www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 19-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 142

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి మ.3.33 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఆర్ద్ర రా.1.08 తదుపరి పునర్వసు; వర్జ్యం: ఉ.10.09-11.41; దుర్ముహూర్తం: ఉ.8.33-9.23, రా.10.19-11.04; అమృతఘడియలు: మ.3.32-5.04; రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.34

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బెంబేలెత్తి యుద్ధనౌకలను దాచిన పాక్

ఆపరేషన్ సిందూర్ వేళ దాయాది పిరికిచర్య

వాణిజ్యపోర్టులకు యుద్ధనౌకల తరలింపు

సరుకురవాణా నౌకల మధ్య దాచిన వైనం

ఉపగ్రహ చిత్రాల ద్వారా వెల్లడి

యుద్ధ సమయంలో బోసిపోయిన పాక్ నౌకాదళ కరాచీ స్థావరం

గ్వదార్ పోర్టుకు పలు యుద్ధనౌకలు

న్యూఢిల్లీ, ఆగస్టు 18: ఆపరేషన్ సిందూర్‌తో భారత్ విరుచుకుపడుతున్న సమయంలో పాకిస్థాన్ బెంబేలెత్తి దాక్కున్న సంగతి తాజాగా రుజువులతో సహా బయటపడింది. భారత్ క్షిపణులు ప్రయోగిస్తుందేమోనన్న భయంతో పాకిస్థాన్ తన నౌకాదళానికి చెందిన ప్రధానమైన, అత్యాధునిక యుద్ధనౌకలను నౌకాదళ స్థావరాల నుంచి తరలించి, వాణిజ్య నౌకలను నిలిపే పోర్టులకు తరలించింది. ఆ విధంగా ఆ వాణిజ్య నౌకల మధ్య వాటిని దాచి పెట్టింది. ఈ వివరాలు ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా వెల్లడైందని ఇంగ్లిష్ చానల్ ఇండియాటుడే

మిగతా 10వ పేజీలో...

గోదావరి ఉరకలు.. కృష్ణమ్మ పరవళ్లు!




శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 39 గేట్ల ఎత్తివేత

దిగువకు 1.51 లక్షల క్యూసెక్కుల విడుదల

శ్రీశైలానికి 3.29 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలంలో 10, సాగర్ 26 గేట్ల ఎత్తివేత 3


10 గేట్ల ద్వారా నీటి విడుదల సందర్భంగా సోమవారం రాత్రి విద్యుద్దీపాల వెలుగులో శ్రీశైలం ప్రాజెక్టు

ముంచెత్తిన వాన 3

- సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షం
- జాలువారిన పత్తి.. వేలాది ఎకరాల్లో పంట నష్టం
- ములుగు జిల్లాలో వాగులో పడి మహిళ మృతి
- నేడు, రేపు అతి భారీ వర్షాలు: వాతావరణ కేంద్రం

చిట్యాలలో 6 కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్!

బెజవాడ నుంచి హైదరాబాద్‌కు పలువురి తిరుగుప్రయాణంతో రద్దీ 3

సీఈసీపై అభిశంసన?

ఇండియా కూటమి పార్టీల యోచన

ఆరోపణలకు సమాధానం చెప్పకుండా జ్ఞానేశ్ ఎదురు దాడికి దిగడంపై ఆగ్రహం

సీఈసీ కాదు.. బీజేపీ అధికార ప్రతినిధి

అవకతవకల్లేవని ఈసీ అఫిడవిట్ ఇస్తే.. ఉన్నాయని ఇచ్చేందుకు మేం సిద్ధం: కాంగ్రెస్

2022లో మా పార్టీ మద్దతుదారుల ఓట్లను తొలగించడంపై 18వేల అఫిడవిట్లు దాఖలు

వాటిపై ఈసీ ఏ చర్య తీసుకోలేదు: ఎస్పీ

రాజకీయ యజమానుల్ని మెప్పించే బదులు సీఈసీ రాజీనామా చేయాలి: తృణమూల్

ప్రతిపక్షంపై ఈసీ యుద్ధం: సీపీఎం


'ఎస్ఐఆర్'కు వ్యతిరేకంగా పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి ఎంపీల నిరసన. చిత్రంలో ఖర్గే, అఖిలేశ్ యాదవ్, అభిషేక్ బెనర్జీ తదితరులు

న్యూఢిల్లీ, ఆగస్టు 18: ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మీద పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపక్ష కూటమి యోచిస్తోంది. ఓటర్ల జాబితాల్లో భారీ ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని ఇండీ కూటమి కొద్ది వారాలుగా ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదంతా ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రచారమని, అన్ని పార్టీల ప్రమేయంతోనే ఓటర్ల జాబితా రూపు దిద్దుకుంటుందని, ఏ దశలోనూ అభ్యంతరం చెప్పకుండా ఇప్పుడు అవకతవకలు అంటే ఎలా అని ప్రధాన కమిషనర్ ఎదురుదాడికి దిగారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయని భావిస్తే ప్రమాణపూర్వకంగా అఫిడవిట్ సమర్పించాలని ఆదివారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రధాన కమిషనర్‌పై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపక్షం యోచిస్తోంది. తీర్మానం ఏ సభలో ప్రవేశ పెట్టాలన్నా కనీసం 50 మంది ఎంపీల మద్దతు కావాలి. ఉభయ సభల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో నెగ్గాలి. అది సాధ్యమైన విషయం కాకపోయినా ఎన్నికల సంఘం మీద ఒత్తిడి తేవడానికి

మిగతా 2వ పేజీలో... 2

ఓటు చోరీకి ఆయుధంగా

ఎస్ఐఆర్

బీజేపీ, ఈసీ కలిసి బడుగు వర్గాల ఓట్లను దొంగిలిస్తున్నాయి

వారి ఉనికి లేకుండా చేస్తున్నాయి

'ఓటు చోరీ'పై పోరాటం సాగిస్తాం

'ఒక వ్యక్తి.. ఒక ఓటు'ను కాపాడతాం: రాహుల్ గాంధీ

బిహార్‌లో రెండోరోజు ఓటర్ అధికార్ యాత్ర 2

యువ ఓటర్లను పరిగణనలోకి

తీసుకోరా?

బిహార్ ఎస్ఐఆర్‌నే ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేస్తారా?

గుర్తింపునకు ఆధార్‌ను ఎందుకు ఆమోదించడం లేదు?

ఈసీకి స్టాలిన్ ప్రశ్నలు 2



ఉపరాష్ట్రపతి పదవికి 'ఇండియా' అభ్యర్థి తిరుచీ శివ!

తమిళనాడు డీఎంకే ఎంపీ పేరు తెరపైకి

ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్‌కు పోటీగా ఇండియా కూటమి వ్యూహాత్మక నిర్ణయం

నామినేషన్ల దాఖలుకు 22 వరకు గడువు 2



రామంతాపూర్‌లోని గోకుల్‌నగర్‌లో ఘటనాస్థలి వద్ద రథం

రథయాత్రలో విషాదం

కృష్ణాష్టమి సందర్భంగా చేపట్టిన యాత్రలో ఇనుప రథానికి తగిలిన కరెంటు వైరు

ఐదుగురి మృతి.. నలుగురికి గాయాలు

హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో ఘటన

క్షతగాత్రుల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గన్‌మన్

మృతుల కుటుంబాలకు మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ.. 5 లక్షల చొప్పున పరిహారం

బాధ్యులపై చర్యలుంటాయని హెచ్చరిక

విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతోనే ఘోరం

మృతుల కుటుంబసభ్యులు, స్థానికుల నిరసన

దుర్ఘటనపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి

హైదరాబాద్ సిటీ/రామంతాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భక్తజనం భజనలు, నృత్యాలు, జయజయధ్వానాల మధ్య ఆనందపారవశ్యంతో సాగుతున్న ఆ రథయాత్ర చివరికి తీవ్ర విషాదంగా ముగిసింది. రథాన్ని లాగుతున్న భక్తులు విసిరివేసినట్లుగా ఎగిరి దూరంగా పడ్డారు. వారిలో ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. ఫలితంగా అప్పటిదాకా ఉన్న గొప్ప ఆధ్యాత్మిక వాతావరణం కాస్తా ఆప్తులను కోల్పోయిన వారి రోదనలతో తీవ్ర విషాదకరంగా మారిపోయింది. ఘోర విద్యుదాఘాతం మిగిల్చిన దారుణం ఇది!! రామంతాపూర్ గోకుల్‌నగర్‌లో ఆదివారం జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో సంభవించింది. యాదవ సంఘం తరఫున శ్రీకృష్ణుడి రథయాత్ర నిర్వహిస్తుండగా పైన 11కేవీ హైటెన్షన్ విద్యుత్తు వైరు నుంచి ఇనుప రథానికి విద్యుత్తు ప్రసరణ జరిగింది. ఫలితంగా రథాన్ని లాగుతున్న భక్తులు తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యారు. హైటెన్షన్ వైర్ల మధ్య నిరుపయోగంగా ఉన్న ఓ కేబుల్ వైరు ముక్క ఘోర ప్రమాదానికి కారణమైంది! ఉప్పల్ పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కురుస్తున్న వర్షాన్ని లెక్క చేయకుండా గోకుల్‌నగర్ నుంచి రాత్రి 8.30 నుంచి 9 మధ్య

మిగతా 14వ పేజీలో...

12 ఏళ్ల బాలిక దారుణహత్య

తల్లిదండ్రులు పనికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా బాలిక

మధ్యాహ్నం తండ్రి వచ్చేసరికి రక్తపు మడుగులో మృతదేహం 14

కూకట్‌పల్లిలో ఘటన.. సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

గుర్తు తెలియని దుండగుడు పొడిచి చంపాడని అనుమానం

ఇక సర్కారీ బడుల్లోనూ పూర్వ ప్రాథమిక విద్య

జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలను వినియోగించుకోవాలని నిర్ణయం

అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త రూపం

ప్రయోగాత్మకంగా 17 జిల్లాల్లోని 34 పాఠశాలల్లో అమలు 13

సెప్టెంబరు 1 నుంచి తరగతులు

ముంబైలో రెడ్ అలర్ట్

భారీ వర్షాలతో అతలాకుతలం

రవాణా సేవలకు అంతరాయం 10

వరదల్లో చిక్కుకున్న 200 మంది

రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్, సైన్యం

నాందేడ్ వరదల్లో ముగ్గురు జగిత్యాల మహిళల గల్లంతు 3


రవీంద్రభారతిలో సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీహరి, పొన్నం, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, కేకే, మధుయాష్కీ

42%కి కేసీఆర్ చట్టమే శాపం!

మొత్తం 50% మించకుండా చట్టంతో బిగించారు

మతం ముసుగులో రిజర్వేషన్లకు బీజేపీ మోకాలడ్డు

'ఓట్ల చోరీ'పై యుద్ధానికి బీసీల మద్దతు కావాలి: సీఎం

సర్వాయి పాపన్న విగ్రహానికి రేవంత్ శంకుస్థాపన

టీ-ఫైబర్‌పై సమగ్ర నివేదిక ఇవ్వండి: ముఖ్యమంత్రి

హైదరాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం బీసీలకు కల్పించాలనుకుంటున్న 42 శాతం రిజర్వేషన్లకు గతంలో కేసీఆర్ చేసిన చట్టమే శాపంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా పకడ్బందీగా చట్టం చేశారని మండిపడ్డారు. మరోపక్క మతం ముసుగులో బీజేపీ నేతలు, బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం

మిగతా 13వ పేజీలో...


వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

భారత్ నుంచి అమెరికాకు..

పెరిగిన ఎగుమతులు

7 రెట్ల మేర వృద్ధి.. ట్రంప్ ప్రతీకార సుంకాల వల్లే..

వ్యాపారాన్ని పోగొట్టుకోకుండా ఉండేందుకు రాయితీలు కూడా ఇస్తున్న ఎగుమతిదారులు 10

అవసరమైతే ఉక్రెయిన్‌కు అమెరికా దళాలు

శ్వేతసౌధంలో జెలెన్‌స్కీతో భేటీలో ట్రంప్ హామీ

యూరియా వచ్చింది సగమే!

అరకొరగా సరఫరా చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఖరీఫ్ సీజన్‌కు 9.80 లక్షల టన్నులు అవసరం

ఇప్పటివరకు వచ్చింది 5.32 లక్షల టన్నులే

యూరియా సరఫరాలో కేంద్రం విఫలం: సీఎల్పీ

3 లక్షల మెట్రిక్ టన్నులు విడుదల చేయండి

నడ్డాకు రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీల విజ్ఞప్తి

పార్లమెంట్ మకర ద్వారం వద్ద ఆందోళన 12

వర్షంలో సైతం యూరియా కోసం..

క్యూలో నిలబడి రైతుల నిరీక్షణ

పలు చోట్ల రాస్తారోకో చేపట్టిన అన్నదాతలు

టోకెన్లు జారీ చేసి యూరియా ఇవ్వండి: తుమ్మల

ఉపరాష్ట్రపతి పదవికి 'ఇండియా' అభ్యర్థి తిరుచీ శివ!

» తమిళనాడు డీఎంకే ఎంపీ పేరు తెరపైకి..



న్యూఢిల్లీ, ఆగస్టు 18: ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తమిళనాడుకు చెందిన డీఎంకే రాజ్యసభ సభ్యుడు తిరుచీ శివను ఎంపికచేసినట్టు తెలిసింది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే నాయకత్వంలో జరిగే పక్షాల భేటీలో ఆయన పేరును ఖరారు చేస్తారని సమాచారం. అధికార ఎన్డీయే కూటమి ఉపరాష్ట్రపతి పదవికి ఇప్పటికే తమ అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పేరును ఖరారుచేసిన విషయం తెలిసిందే. దక్షిణాదిలో, అందులోనూ తమిళనాడులో బలహీనంగా ఉన్న బీజేపీ ఆ రాష్ట్రం నుంచి అభ్యర్థిని ఎంపిక చేసింది. త్వరలో తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్డీయే వేసిన ఈ ఎత్తుకు ఇండియా కూటమి పై ఎత్తును వేయాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే శివ పేరు తెరపైకి వచ్చింది. రాధాకృష్ణన్ అభ్యర్థిత్వంతో ప్రాంతీయంగా తలెత్తే రాజకీయ సమస్యను దీనివల్ల అధిగమించవచ్చునని ఇండియా శిబిరం భావిస్తోంది. అలాగే.. తమిళనాడుకు చెందిన నేతను ఎంపిక చేయడం వల్ల దక్షిణాది రాష్ట్రాల నుంచి అదనపు మద్దతు పొందవచ్చుననేది ఒక ఆలోచన. బీజేపీయా మరొకటా అనేది పక్కనపెడితే తమిళనాడు నుంచి ఒకరు ఉపరాష్ట్రపతి అవుతున్నారంటే.. డీఎంకే సైతం వ్యతిరేకించడానికి ఉండదు. అదేగనుక తమ పార్టీ నేతే పోటీకి నిలబడితే ఈ సమస్య తలెత్తదని డీఎంకే, ఇతర విపక్ష పార్టీలు ఆలోచించినట్టు తెలిసింది. మరోవైపు, రాధాకృష్ణన్ అభ్యర్థిత్వం విషయంలో తమిళనాడులోని అధికార డీఎంకే కూటమిలో చీలిక తలెత్తింది. ఆయనకు మద్దతు ఇచ్చేది లేదని ఈ కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకే ఇప్పటికే తేల్చేయగా, భాగస్వామ్య పక్షం ఎండీఎంకే మాత్రం రాధాకృష్ణన్‌కు అభినందనలు తెలిపింది. కాగా, ఇండియా కూటమిలో ఉంటూ, ఎన్డీయే అభ్యర్థికి తాము ఎలా మద్దతు ఇస్తామని డీఎంకే అధికార ప్రతినిధి ఎలన్‌గోవన్ మీడియాను ప్రశ్నించారు. రాధాకృష్ణన్‌తో తమిళనాడుకు ప్రయోజనం ఏమీ ఉండబోదన్నారు.

రేపు సీపీ రాధాకృష్ణన్ నామినేషన్!



న్యూఢిల్లీ, ఆగస్టు 18: మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీయే పక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ సోమవారం ఢిల్లీ చేరుకున్నారు. ప్రధాని మోదీని కలిశారు. అంతకుముందు రాధాకృష్ణన్‌కు బీజేపీ నేతలు భూపేందర్ యాదవ్, ప్రహ్లాద్ జోషి, కిరెన్ రిజిజు, టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. సోమవారం సాయంత్రం రాధాకృష్ణన్ ఎన్డీయే పార్టీల నేతల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన బుధవారం(ఆగస్టు 20) ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ వేసే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రులతో పాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉపముఖ్యమంత్రులు, కీలక నాయకులు పాల్గొంటారని సమాచారం.

సర్వేపల్లి అంతటివాడు కావాలనే ఆ పేరు పెట్టాం

» ఇప్పుడదే నిజమైంది.. సీపీ రాధాకృష్ణన్ తల్లి బావోద్వేగం



చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): 'మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ అంతటివాడు కావాలని ఆకాంక్షించే తన కుమారుడికి ఆయన పేరు పెట్టామని, ఆ నమ్మకం ఇప్పుడు నిజమైందని ఎన్‌డీఏ తరఫున అభ్యర్థి అయిన సీపీ రాధాకృష్ణన్ మాతృమూర్తి జానకి అమ్మాళ్ భావోద్వేగానికి గురయ్యారు. తిరుప్పూర్‌లో నివాసముంటున్న జానకి అమ్మాళ్ వద్దకు సోమవారం బీజేపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లి ఆమెకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. తన కుమారుడిని ఉపరాష్ట్రపతి పదవికి సిఫారసు చేసిన బీజేపీకి, ప్రధాని మోదీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

చైనా పెట్టుబడులకు గేట్లు బార్లా!

» ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో డ్రాగన్‌తో భారత్ దోస్తీ

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకాలను విధించిన నేపథ్యంలో మోదీ సర్కారు చైనాతో వాణిజ్య, రాజకీయ సంబంధాలను పునరుద్ధరించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా చైనా పెట్టుబడులకు గతంలో మూసేసిన గేట్లను మళ్లీ తెరవాలనుకుంటోంది. పునరుత్పాదక ఇంధనం, మాన్యుఫాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్ వంటి ప్రాధాన్యేతర రంగాల్లో చైనా కంపెనీల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం కేంద్రం వద్ద దాదాపు 200 చైనా ఎఫ్‌డీఐ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత చైనాతో రాజకీయ, ఆర్థిక సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. మన సర్కారు చైనా పెట్టుబడులపై ఆంక్షలు విధించింది అప్పుడే. కానీ, అమెరికా సుంకాల పోరును తట్టుకునేందుకు ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణకు ఇరు దేశాలు మళ్లీ నడుం బిగించాయి. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ సోమవారం భారత్‌కు రావటం ఇందుకు మొదటి అడుగుగా చూడవచ్చు. ఆయన 3రోజుల పాటు పర్యటించనున్నారు.

విభేదాలు వివాదాలుగా మారొద్దు

» చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో జై శంకర్



న్యూఢిల్లీ, ఆగస్టు 18: విభేదాలు వివాదాలుగా మారొద్దని చైనాకు భారత్ సూచించింది. భారత పర్యటనలో ఉన్న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సమావేశం సందర్భంగా విదేశాంగమంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య సంబంధాలు పరస్పర గౌరవం, పరస్పర సున్నితత్వం, పరస్పర ప్రయోజనాల ఆధారంగా సాగాలన్నారు. దీనికి రెండు వైపుల నుంచి నిజాయితీతో పాటు నిర్మాణాత్మక సహకారం అవసరమని చెప్పారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత వాతావరణాన్ని సంయుక్తంగా నెలకొల్పడం అవసరమన్నారు. అదే సమయంలో ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా పీచమణచాల్సిందేనని జై శంకర్ స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా వాంగ్ యీ మంగళవారం ప్రధాని మోదీతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ఈ నెలాఖరులో చైనాలో జరిగే షాంఘై కార్పొరేషన్ ఆర్గనైజేషన్ సదస్సుకు మోదీ హాజరుకానున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

రష్యా చమురును భారత్ అమ్మిపెడుతోంది!

» భారత్‌పై ట్రంప్ సలహాదారు నవరో అక్కసు

న్యూఢిల్లీ, ఆగస్టు 18: రష్యా ముడిచమురును దిగుమతి చేసుకుని.. దాన్ని అధిక విలువగల ఉత్పత్తులుగా మార్చి ప్రపంచదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా భారతదేశం రష్యాకు క్లియరింగ్ హౌస్‌లా వ్యవహరిస్తోందని.. పుతిన్‌కు కావాల్సిన డాలర్లను ఇస్తోందని.. ట్రంప్ సలహాదారు పీటర్ నవరో మండిపడ్డారు. రష్యాను ఆర్థికంగా ఒంటరిని చేయాలన్న అంతర్జాతీయ ప్రయత్నాలకు భారత్ గండికొడుతోందని 'ఫైనాన్షియల్ టైమ్స్' వార్తాసంస్థకు రాసిన వ్యాసంలో ధ్వజమెత్తారు. తాము వద్దంటున్నా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం.. వాణిజ్య ఒప్పందం విషయంలోనూ గట్టిగా వ్యవహరిస్తుండడంపై ఆయన తన అక్కసు వెళ్లగక్కారు. భారతదేశం అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామి కావాలనుకుంటే.. అలా ప్రవర్తించాలని సుద్దులు చెప్పారు.

సీఈసీపై అభిశంసన?

(మొదటి పేజీ తరువాయి)

పనికొస్తుందని విపక్షం భావిస్తోంది. తాము లేవనెత్తిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చే బదులు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్.. బీజేపీ అధికార ప్రతినిధిగా మాట్లాడారని ఇండియా కూటమి ధ్వజమెత్తింది. ఒక్క ప్రశ్నకూ ఆయన సమాధానం ఇవ్వలేదని, ఒక రాజ్యాంగ సంస్థకు ప్రతినిధిగా వ్యవహరించే బదులు ఆయన ఒక పార్టీ ప్రతినిధిగా వ్యవహరించారని మండిపడింది. ఎన్నికల ప్రక్రియను నిజాయితీగా నిర్వహిస్తున్నామని ప్రజలకు వివరించే బదులు ప్రతిపక్ష నేతలపై దాడులు చేసేందుకే సీఈసీ ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారని విమర్శించింది. ఇండియా కూటమి తరఫున పలువురు ఎంపీలు సోమవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65లక్షల మంది పేర్లను విడుదల చేయాల్సిందేనని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఎన్నికల ప్రధాన కమిషనర్ ఎలాంటి వివరణా ఇవ్వలేదన్నారు. రాహుల్‌గాంధీని అఫిడవిట్ దాఖలు చేయాలని చెప్పడమే తప్ప మహదేవపుర నియోజకవర్గంలో ఓట్ చోరీపై సీఈసీ స్పందించలేదన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలులేవని ఎన్నికల సంఘం అఫిడవిట్ ఇస్తే అవకతవకలున్నాయని అఫిడవిట్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దేశంలో ఎన్నికల ప్రక్రియను నిజాయితీగా జరిపించడమనే రాజ్యాంగ విధిని నిర్వర్తించడంలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలమైందన్నారు. బీజేపీని ప్రశ్నించిన వారిపై ఎన్నికల సంఘం బెదిరింపులకు దిగుతోందని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్లు అన్ని పార్టీల ప్రయోజనాలను సమానంగా కాపాడేందుకు సిద్ధంగా లేరన్నారు. బిహార్‌లో ఓట్ల తొలగింపు, మహదేవపురలో నకిలీ ఓటర్లను అనుమతించడం, మహారాష్ట్రలో 5నెలల్లో 75 లక్షల మంది ఓటర్లను చేర్చడం, 45 రోజుల్లో సీసీటీవీ ఫుటేజ్‌ను తొలగింపు, ఆధార్‌ను అనుమతించకపోవడంపై సమాధానమివ్వకుండా సీఈసీ తప్పించుకున్నారని గొగోయ్ విమర్శించారు. సమాజ్‌వాదీ పార్టీ మద్దతుదార్ల ఓట్లను తొలగించడం మీద తాము 2022లో 18 వేల అఫిడవిట్లు దాఖలు చేశామని ఆ పార్టీ నేత రాంగోపాల్‌యాదవ్ ప్రస్తావించారు. ఎన్నికల సంఘం తాము సమర్పించిన 18 వేల అఫిడవిట్లపై ఏచర్య తీసుకుందని ప్రశ్నించారు. డూప్లికేట్ ఓటర్ ఐడీ కార్డుల గురించి తమ పార్టీ అధినేత మమతా బెనర్జీ ఫిబ్రవరిలోనే ప్రశ్నించినా ఏ చర్యా తీసుకోలేదని తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా అన్నారు. ఎన్నికల సంఘం కీలుబొమ్మలా వ్యవహరిస్తోందన్నారు. రాజకీయ యజమానులను మెప్పించే బదులు ఎన్నికల కమిషనర్ ఉద్యోగానికి రాజీనామా చేయాలని సలహా ఇచ్చారు. బిహార్‌లో ప్రతిపక్షాల ఓటర్ అధికార యాత్ర నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రధాన కమిషనర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారని ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ ఝా అన్నారు. ప్రధాన కమిషనర్ పదవిలో ఉండే యోగ్యతను కోల్పోయారని ఆయన ప్రతిపక్ష పార్టీలపైనే యుద్ధం ప్రకటించారని సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ అన్నారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలో 42వేల ఓట్లను తొలగించారని ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ తెలిపారు.



బిహార్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు ఆవరణలో విపక్ష ఎంపీల ఆందోళన



ఓట్ల చోరీపై ఈసీకి స్టాలిన్ ఏడు ప్రశ్నలు

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానికి తమిళనాడు సీఎం స్టాలిన్ ఏడు ప్రశ్నలు సంధిస్తూ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. "ఇంటింటి సర్వే తర్వాత భారీ స్థాయిలో ఓట్ల తొలగింపు ఎలా జరిగింది? కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో యువ ఓటర్లను పరిగణనలోకి తీసుకున్నారా? బిహార్ ఓటర్ల జాబితా సమయంలో పాటించిన నిబంధనలు ఇతర రాష్ట్రాల ఓటర్ల జాబితా తయారీలోనూపాటిస్తారా? ఆధార్‌ను ఈసీ ఎందుకు వ్యతిరేకిస్తోంది?"అని ప్రశ్నించారు.

లోకం తీరు



తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లను వెల్లడించిన ఈసీ

» సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చర్యలు

పట్నా, ఆగస్టు 18: బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) లో భాగంగా తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లను ఎన్నికల సంఘం (ఈసీ) సోమవారం బహిర్గతం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపుపై కొద్దిరోజులుగా విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఓటరు జాబితా నుంచి తొలగించిన పేర్లను ఈనెల 19 నాటికి బహిర్గతం చేసి.. 22 నాటికి ఆ నివేదికను దాఖలు చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడంతో ఈసీ అధికారులు చర్యలు చేపట్టారు. 'అన్ని పోలింగ్ బూత్‌ల వారీగా 'ఏఎస్‌డీ' (గైర్హాజరు, బదిలీ చేసిన, చనిపోయిన) ఓటర్ల పేర్లను ఈసీ ప్రచురిస్తోంది. అలాగే ఆన్‌లైన్ లోనూ ఈ వివరాలను చూసుకోవచ్చు' అని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఓటు చోరీకి ఆయుధంగా ఎస్ఐఆర్

బిహార్‌లో రెండోరోజు ఓటరు అధికార యాత్రలో రాహుల్

ఔరంగాబాద్/గయా జీ, ఆగస్టు 18: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) అనేది ఓట్లను దొంగిలించేందుకు వాడుతున్న ఆయుధమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఓట్ల చోరీని అడ్డుకొని 'ఒక వ్యక్తి.. ఒక ఓటు'ను పరిరక్షించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ఈ మేరకు గత లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసి.. ప్రస్తుత ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటుహక్కును కోల్పోయిన పలువురితో తాను మాట్లాడిన వీడియోను రాహుల్ తన వాట్సాప్ చానల్‌లో పోస్ట్ చేశారు. బిహార్‌లోని ససారాం నుంచి చేపట్టిన ఓటరు అధికార యాత్ర ప్రారంభం సందర్భంగా వారితో రాహుల్ మాట్లాడారు. దేశంలో ఓటు చోరీ జరుగుతోందని చెప్పడానికి వీడియోలో తన పక్కన నిలబడ్డ వారే సజీవ సాక్ష్యమన్నారు. వారంతా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారని, కానీ.. అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి వారి గుర్తింపు, ఉనికి కూడా లేకుండా భారత ప్రజాస్వామ్యం నుంచే తొలగింపునకు గురయ్యాయని తెలిపారు. వారి పేర్లను రాహుల్ వెల్లడించారు. వారిలో మాజీ సైనికుడు, రైతు అయిన రాజ్ మోహన్ సింగ్(70) కూడా ఉన్నారని తెలిపారు. ఓట్ల తొలగింపులో ఈసీ మాజీ సైనికులను వారు వదిలిపెట్టలేదని మండిపడ్డారు. అనంతరం ఔరంగాబాద్‌లో మరికొందరు బాధితులను కలుసుకున్న వీడియోను రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు. "గత నాలుగైదు ఎన్నికల్లో ఓటు వేసినవారి ఓటుహక్కును కూడా దొంగిలించారు. కారణం అడిగితే.. పైనుంచి ఆదేశాలు ఉన్నాయని చెబుతున్నారు" అని రాహుల్ తెలిపారు. ఏదో ఒకరోజు ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, ఓటు చోరీకి పాల్పడ్డందుకు సీఈసీపై, ఇద్దరు ఎన్నికల కమిషనర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసీ నేరాన్ని బయట పెట్టిన తనను అఫిడవిట్ అడుగుతున్నారని, కానీ.. దేశం మొత్తం వారినే అఫిడవిట్ అడిగే పరిస్థితి వస్తుందని అన్నారు. తమకు కొద్దిగా సమయమిస్తే.. ప్రతి అసెంబ్లీ స్థానం, లోక్‌సభ స్థానంలో ఓట్ల చోరీని బయటపెడతామని చెప్పారు. కాగా, ఓట్లు తొలగించామంటూ రాహుల్‌వీడియోలో పేర్కొన్న వక్తుల వివరాలను తమకు అందజేయాలని ఈసీ కోరింది.



ఓటర్ అధికార్ యాత్రలో రాహుల్ గాంధీ

ఆర్థిక సంస్కరణలపై ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష

న్యూఢిల్లీ, ఆగస్టు 18: స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించిన తదుపరి తరం ఆర్థిక సంస్కరణల అమలుపై ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్, పీయూష్ గోయల్, లలన్ సింగ్, కార్యదర్శులు, ఆర్థికశాస్త్రవేత్తలు పాల్గొన్నారు. జీఎస్టీలో సంస్కరణలు, సెమీ కండక్టర్, ఎరువుల రంగాల్లో స్వావలంబ సాధన, సులభతర జీవనం, వాణిజ్యం తదితర అంశాలపై మార్గసూచీని రూపొందించే దిశగా చర్చలు సాగాయి.

ఎఫ్‌డీఐ నిబంధనలు మరింత సరళం

న్యూఢిల్లీ: కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ 100 రోజుల సంస్కరణల ఎజెండాపై కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ), పొరుగు దేశాల నుంచి వచ్చే పెట్టుబడులకు నిబంధనలను సడలించటంతో పాటు స్టార్టప్‌లకు మరిన్ని పన్ను ప్రయోజనాలను అందించే దిశగా ప్రయత్నాలు సాగుతున్నట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అంతేకాదు, తోలు-పాదరక్షల పరిశ్రమలకు పర్యావరణ నిబంధనల సరళీకరణ, ఈ-కామర్స్ హబ్స్ ద్వారా ఎగుమతులను ప్రోత్సహించేందుకు నియమావళి సడలింపులు ఉన్నాయన్నారు.

'ఫాస్టాగ్ వార్షిక పాస్' రికార్డు

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ప్రయాణాలను మరింత సులభతరం చేసేందుకు జాతీయ రహదారి ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ప్రవేశపెట్టిన ఫాస్టాగ్ వార్షిక పాస్‌కు అనూహ్యమైన ప్రజాదరణ లభించింది. నాలుగు రోజుల్లోనే 5 లక్షలకు పైగా ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. ఈ పాస్ వల్ల జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలో ప్రయాణించే వారికి వేగవంతమైన ప్రయాణ సౌకర్యం కలుగుతుందని అధికారులు తెలిపారు.

బిహార్ ఓటర్ల జాబితాపై ఉభయ సభల్లో విపక్షాల ఆందోళన

చర్చలు లేకుండానే వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 18: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై చర్చించాలని డిమాండు చేస్తూ సోమవారం ఉభయసభల్లో విపక్షాలు ఆందోళన చేశాయి. దాంతో ఎటువంటి చర్చలు లేకుండానే సభలు వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను చేపట్టారు. వివిధ శాఖల మంత్రులు సమాధానాలు ఇచ్చేందుకు సిద్ధంకాగా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. గందరగోళం నడుమే ఆరు ప్రశ్నలకు జవాబులు ఇచ్చారు. సీట్లలో కూర్చోవాలని స్పీకర్ కోరినా సభ్యులు పట్టించుకోలేదు. సభ్యులు నినాదాలను కొనసాగిస్తుండడంతో ఈ శక్తిని ప్రజల సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అయినా సభ్యులు వినకపోవడంతో సభను వాయిదా వేశారు. తిరిగి సభ సమావేశమయినప్పుడు కూడా ఇదే పరిస్థితి కనిపించింది. సభ్యులు వెల్‌లోకి వచ్చి ఓట్ చోర్- గద్దీ చోడ్ అంటూ నినాదాలు చేశారు. దాంతో స్పీకర్ స్థానంలో కూర్చొన్న బీజేపీ సభ్యురాలు సంధ్యా రాణి సభను వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తొలుత నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ మృతికి సంతాపం తెలుపుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం వివిధ అంశాలపై విపక్ష సభ్యులు ఇచ్చిన 19 వాయిదా తీర్మానాలను తిరస్కరించారు. బిహార్ ఓటర్ల జాబితాపై నిరసన తెలుపుతూ విపక్ష సభ్యులు ఆందోళన చేశారు. బిహార్ ఓటర్ల జాబితాపై చర్చ జరగాలని డిమాండు చేశారు. సభాపతి అంగీకారం తెలపకపోవడంతో విపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వాకౌట్ చేశారు.

లోక్‌సభలో జన విశ్వాస్ బిల్లు-2.0

కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో జన విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2.0ను ప్రవేశపెట్టింది. చిన్నపాటి నేరాలకు సంబంధించిన 16కేంద్ర చట్టాల్లోని 288 నిబంధనలను 'నేర' పరిధి నుంచి తప్పించేందుకు ప్రతిపాదనలు చేశారు. ఇంతకుముందు కేంద్రం 2023లో ఇదేవిధంగా 19 మంత్రిత్వ శాఖలు, విభాగాల పరిధికి చెందిన 42 కేంద్ర చట్టాల్లోని 183 నిబంధనలు నేర రహితం చేస్తూ చట్టాన్ని రూపొందించింది. తాజాగా మరో జన విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025ను కేంద్ర మంత్రి గోయల్ దిగువ సభలో ప్రవేశపెట్టారు. సులభతర వాణిజ్య విధానాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో దీన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆ తర్వాత బిల్లును సెలక్ట్ కమిటీ పరిశీలన కోసం పంపారు.



అంతరిక్షం నుంచి తాను తీసిన ఫొటోలను మోదీకి చూపెడుతున్న శుభాన్షు

శుభాన్షుపై ప్రత్యేక చర్చ

మిషన్ 'ఏఎక్స్-4' ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి వచ్చిన భారత తొలి వ్యోమగామి శుభాన్షు శుక్లా గౌరవార్థం సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చను చేపట్టారు. అంతకుముందు ఆయన ప్రధాని మోదీని కలిశారు. బిహార్‌లో ఎస్ఐఆర్ గురించి విపక్షాల ఆందోళన మధ్యనే శుక్లా ఘనతపై లోక్‌సభలో చర్చ జరిగింది. దేశంలోని ప్రతి బిడ్డకు శుభాంశు శుక్లా స్ఫూర్తిగా మారారని, ఆయనలా ఎదగాలని, అంతరిక్ష యాత్రలు చేయాలని ప్రతి ఒక్కరూ కలలు కంటున్నారని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. శుభాంశుపై చర్చను బహిష్కరిస్తూ విపక్ష సభ్యులు సభ నుంచి వెళ్లిపోయిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ఇది అత్యంత దురదృష్టకరమని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. కాగా, శుక్లాపై ప్రత్యేక చర్చలో విపక్షం పాల్గొనబోదని, తనకు ముందే తెలుసని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ.. అంతరిక్ష హీరో, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను ప్రశంసించకుండా ఉండలేనన్నారు.

ధర్మస్థల వివాదంలో కీలక మలుపు!

» ఫిర్యాదు వెనుక ఇతరుల ప్రోత్సాహం?

» చట్టవిరుద్ధంగా మృతదేహాలు పాతిపెట్టినట్టు చెప్పాలని ఒత్తిడి

» సిట్ ఎదుట మాజీ కార్మికుడి వెల్లడి!

బెంగళూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. వందలాది మృతదేహాలను పాతిపెట్టినట్టు ఫిర్యాదు చేసిన మాజీ పౌర కార్మికుడు సిట్ ఎదుట...ఫిర్యాదు వెనుక కొందరి ప్రోత్సాహం ఉందని, పుర్రెను కూడా వారే సమకూర్చారని చెప్పినట్టు తెలిసింది. మాజీ పౌరకార్మికుడు చేసిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసును సిట్ అధికారులు దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. అతను చూపించిన అటవీప్రాంతంలో 15 రోజులపాటు తవ్వకాలు జరిపారు. శనివారం నుంచి తవ్వకాలకు బ్రేక్ పెట్టిన సిట్ అధికారులు ఫిర్యాదుదారుడిని సోమవారం విచారించారు. విచారణలో ఫిర్యాదుదారుడు.. తాను 2014 నుంచి 2023 వరకు తమిళనాడులో కుటుంబంతో పాటు ఉన్నానని, ఆ తర్వాత ఓ బృందం తనను సంప్రదించి, ధర్మస్థలలో మృతదేహాలు పాతిపెట్టిన అంశం గురించి వివరాలు కోరిందని చెప్పాడు. చట్టప్రకారమే మృతదేహాలను పూడ్చానని వారికి మాజీ పౌర కార్మికుడు తెలిపాడు. కానీ చట్ట విరుద్ధంగా వాటిని పాతిపెట్టినట్టు చెప్పాలని 2023 డిసెంబరు నుంచి ఆ బృందం ఒత్తిడి తెచ్చింది. ఆ తరువాత అదే బృందం మాజీ పౌర కార్మికుడిని కర్ణాటకకు తీసుకొచ్చింది. ఆ బృందమే ఓ పుర్రెను సమకూర్చింది. ఆ పుర్రెను తీసుకువెళ్లి కార్మికుడు.. చట్టవిరుద్ధంగా మృతదేహాలను పూడ్చిపెట్టినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల ముందు ఏం చెప్పాలనేది ప్రతిరోజూ అతనికి ముగ్గురు సలహాలు ఇచ్చేవారు. అంతా వారు చెప్పినట్లే చేశానని సిట్‌కు మాజీ పౌర కార్మికుడు వివరించినట్టు సమాచారం. సిట్ అధికారులు ఫిర్యాదుదారుడు చెప్పిన అంశాలను రికార్డు చేసినట్టు తెలిసింది. కానీ ఈ విషయమై అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఈ వ్యవహారం సోమవారం కర్ణాటక అసెంబ్లీలో రచ్చకు దారితీసింది.

ట్రాఫిక్ జాంలో చిక్కుకుంటే టోల్ ఎందుకు కట్టాలి?



» ఎన్‌హెచ్ఏఐకి సుప్రీంకోర్టు ప్రశ్న.. టోల్ వసూలును సమర్థించలేమని వ్యాఖ్య

» అంతకుముందు ఆ హైవేపై నెల పాటు టోల్ వసూలు చేయొద్దన్న కేరళ హైకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 18: ప్రయాణికులు ట్రాఫిక్‌జామ్‌లో చిక్కుకొని అవస్థలు పడిన సందర్భాల్లో టోల్ రుసుము ఎందుకు చెల్లించాలని సుప్రీంకోర్టు సోమవారం భారతీయ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)ని ప్రశ్నించింది. 65 కి.మీ. దూరం ప్రయాణానికి 12 గంటల సమయం తీసుకున్న సందర్భాల్లోనూ టోల్ రుసుము కింద రూ.150 చెల్లించాలా అని అడిగింది. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో కేరళలోని త్రిస్సూర్ జిల్లా పలియెక్కర టోల్ ప్లాజా వద్ద నాలుగు వారాల పాటు రుసుము వసూలు చేయకూడదని ఈ నెల 6న కేరళ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. రోడ్డు పనులు జరుగుతుండడంతో 554 నెంబరు జాతీయ రహదారిలో ఎడపల్లి- మన్నుతి మధ్య ప్రయాణం దారుణంగా మారింది. అందువల్ల నెల రోజుల పాటు టోల్ రుసుము వసూలును సస్పెండ్ చేస్తున్నట్టు హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ దాఖలయిన అప్పీలుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం విచారణ చేపట్టింది. గంట ప్రయాణానికి అదనంగా 11 గంటలు తీసుకుంటే టోల్ రుసుము ఎందుకు చెల్లించాలని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. ఎన్‌హెచ్ఏఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ లారీ ప్రమాదానికి గురయిన కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని, ఆ ప్రమాదం దైవఘటన అని చెప్పారు. ఇందుకు జస్టిస్ వినోద్ చంద్రన్ అంగీకరించలేదు. ఆ ప్రమాదం దైవఘటన కాదని, రోడ్డుపై ఉన్న గుంతలో లారీ దిగబడడం వల్లనే ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని గుర్తు చేశారు. 11గంటల ట్రాఫిక్ జామ్‌లో కూడా టోల్ వసూలు ఏ రకంగానూ సమర్థించలేమన్నారు. తీర్పును వాయిదా వేశారు.

చిట్యాలలో 6 కి.మీ. ట్రాఫిక్ జామ్!

» విజయవాడ -హైదరాబాద్ రహదారిపై తీవ్ర రద్దీ



యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కూడలి నుంచి హైదరాబాద్ వైపు కదులుతున్న వాహనాలు

చిట్యాలరూరల్, చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల వరుస సెలవులు ముగియడంతో.. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 11.30 గంటల వరకూ వాహనాలరద్దీ విపరీతంగా పెరిగింది. ఏపీలోని విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు వాహనాలు బారులు తీరాయి. అసలే వాహనాల రద్దీ.. దానికి తోడు వర్షం, కారుమేఘాలతో ఆవరించిన చీకటి.. ఇవన్నీ చాలవన్నట్టు నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తి వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో ప్రయాణవేగం బాగా మందగించింది. చిట్యాల నుంచి 6 కి.మీ. దూరంలోఉన్న పెద్దకాపర్తికి వెళ్లడానికి ఒక్కో వాహనానికీ 30 నిమిషాలకు పైగా సమయం పట్టింది. ఆ 6కి.మీ. మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. పోలీసులు ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బందితో కలిసి వాహనాలను సర్వీస్‌రోడ్డు మీదుగా మళ్లించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆ తర్వాత కూడా.. చౌటుప్పల్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వరకు ట్రాఫిక్ కొనసాగిందని వాహనదారులు తెలిపారు.

శునకాల దాడులపై హెచ్‌ఆర్సీ సుమోటోగా కేసు స్వీకరణ

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హైదరాబాద్/ గన్‌పార్క్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీధి శునకాలు ప్రజలపై దాడి చేసి గాయపరచడంపై మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ) స్పందించింది. ఈ ఘటనలకు సంబంధించిన కేసును సుమోటోగా స్వీకరించింది. ముఖ్యంగా నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని పరిగితోపాటు కొడంగల్ తదితర ప్రాంతాల్లో ఒకేరోజు 23 మందిపై వీధి శునకాలు దాడి చేసి గాయపరచాయి. ఈ ఘటనపై సోమవారం మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ డా.షమీమ్ అక్తర్ విచారణకు ఆదేశించారు. ముఖ్యంగా నల్లగొండలో వీధి కుక్కలు ఓ బాలుడిని పేగులు బయటికి వచ్చేలా కరిచాయి. దీనికి సంబంధించి 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు హెచ్‌ఆర్సీ స్పందిస్తూ.. ఈమేరకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో వీధి శునకాల ఘటనలపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని సమగ్ర వివరణ కోరింది. ఈ నెల 22న పూర్తి నివేదికను ఇవ్వాలని కోరింది.

సిబ్బందిపై కుక్కల దాడి.. సూర్యాపేట కలెక్టర్‌పై కేసు

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న సిబ్బందిపై వీధికుక్కలు దాడి చేసిన ఘటనలో సూర్యాపేట కలెక్టర్‌పై హెచ్‌ఆర్సీ కేసు నమోదు చేసింది. తుంగతుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు చేస్తున్న అధికారిణి, ఇతర వ్యక్తులపై వీధికుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనపై న్యాయవాది రామారావు ఇమ్మనేని హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు చేశారు.

సబితా ఇంద్రారెడ్డి, కృపానందం నిర్దోషులు కారు

» హైకోర్టులో సీబీఐ వాదన

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో వివరణ ఇవ్వాలని పేర్కొంటూ అప్పటి గనులశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, అప్పటి పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి కృపానందానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఓఎంసీ కేసులో ఏ-8గా ఉన్న కృపానందం, ఏ-9గా సబితా ఇంద్రారెడ్డిలపై కేసు రుజువుకాకపోవడంతో వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ సీబీఐ కోర్టు మే 6న తీర్పు ఇచ్చింది. వారిని నిర్దోషులుగా ప్రకటించడం చెల్లదంటూ సీబీఐ హైకోర్టులో క్రిమినల్ అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. వారిద్దరికీ నోటీసులు జారీచేసింది. ఓఎంసీ కేసులో దోషులుగా తేలిన గాలి జనార్దన్‌రెడ్డి, ఇతర నిందితులు ఇప్పటికే హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. ఆ అప్పీళ్లకు ప్రస్తుత కేసును జత చేయాలని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణ వచ్చేనెలకు వాయిదా పడింది.

నేటి నుంచి కేయూలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్

కేయూ క్యాంపస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌ను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయం(కేయూ) ఈసారి తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వరకు ఈ సదస్సును నిర్వహిస్తున్నామని చెప్పారు. కేయూ, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సంయుక్తంగా ఈ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహిస్తోందన్నారు. వచ్చే ఏడాది ఆగస్టు 19 వరకు సంబురాలు జరుగుతాయని తెలిపారు. 'సాధికారత కోసం నూతన ఆవిష్కరణలు, యువతభారత్ కోసం శాస్త్ర సాంకేతికత' అనే థీమ్‌తో సదస్సు జరగనుంది. మూడు రోజుల పాటు జరిగే సైన్స్ కాంగ్రెస్‌లో 65 ముఖాముఖి కార్యక్రమాలతో పాటు ఐదుగురు సీనియర్ ప్రొఫెసర్లు, ల్యాబ్స్ డైరెక్టర్లు రెండు ప్లీనరీ సెషన్లలో కీలక ప్రసంగం చేస్తారు.

పీఎస్‌హెచ్‌ఎంఏ అధ్యక్షుడిగా మురళీధర్ గౌడ్

» ప్రధాన కార్యదర్శిగా రచ్చ మురళి



మురళీధర్ గౌడ్, రచ్చ మురళి

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం(పీఎస్‌హెచ్‌ఎంఏ) రాష్ట్ర కార్యవర్గం ఎన్నికలు సోమవారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగాయి. 33 జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా గద్వాల జిల్లాకు చెందిన డి.మురళీధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నిజామాబాద్ నుంచి రచ్చ మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా నరేందర్ రెడ్డి(మెదక్), అసోసియేట్ అధ్యక్షులుగా అంకం నరేష్(నిజామాబాద్), కొడపర్తి సోమయ్య(భువనగిరి), బత్తుల సదానందం(హన్మకొండ),బి.రాజ్‌కుమార్(కామారెడ్డి) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డి.మోహన్ (కామారెడ్డి), వి.గాలయ్య (మెదక్), బి.హన్మంత రావు (నిజామాబాద్), కె.లక్ష్మణస్వామి (పెద్దపల్లి), కె.రాజశేఖర్ రెడ్డి(గద్వాల), పి.అంజయ్య(రంగారెడ్డి), ఎల్.రమేష్ నాయక్ (భూపాలపల్లి), సిహెచ్.నర్సింగరావు(మేడ్చల్), పి.చంద్రశేఖర్(వనపర్తి), ఎస్.కిషన్(రంగారెడ్డి), మహిళా ఉపాధ్యక్షులుగా కె.లక్ష్మి తులసి(కామారెడ్డి), జి.కమల(మేడ్చల్), భాగ్యరేఖ (రంగారెడ్డి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎస్సారెస్పీ నుంచి ముందుగానే నీటి విడుదల

పెద్దపల్లి/చిన్న కోడూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఈ సారి ముందుగానే ఆయకట్టుకు నీటి విడుదల ప్రారంభమైంది. ఈ నెల 7 నుంచే ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీరు విడుదల చేస్తుండగా.. తాజాగా వరద కాల్వ ద్వారా ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు నీటిని విడుదల చేస్తున్నారు. సాధారణంగా నిల్వ 45టీఎంసీలు దాటిన తర్వాతే.. కాల్వలకు విడుదల చేయడం పరిపాటి. కానీ, ఈసారి 40టీఎంసీలకు చేరగానే.. కాకతీయ ప్రధాన కాలువ, లక్ష్మి, సరస్వతీ కాలువలు, గుత్పా, అలీసాగర్ ఎత్తిపోతల పథకాలకు నీటిని విడుదల చేశారు. తాజాగా ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడంతో సోమవారం ఉదయం ఎస్సారెస్పీ గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలిపెట్టారు. కాగా, అనంతగిరి (అన్నపూర్ణ) రిజర్వాయర్ నుంచి సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి సోమవారం ఒక పంపు ద్వారా నీటి ఎత్తిపోతలను ప్రారంభించారు.



ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురంలో నీటమునిగిన పంటపొలాలు



నారాయణపేట జిల్లా మాగనూర్ మండలం అడివి సత్యారం బ్రిడ్జిపై ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వరద నీరు

ముంచెత్తిన వాన

సిద్దిపేట జిల్లా వర్గల్‌లో అత్యధికంగా 23 సెం.మీ. వర్షపాతం

» నీట మునిగిన ఏడు పాయల వనదుర్గ గుడి
» మెదక్, కామారెడ్డి జిల్లాల్లోనూ భారీ వర్షం
» ములుగు జిల్లాలో వాగులో పడి మహిళ మృతి
» వేలాది ఎకరాల్లో పంటల నష్టం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా జల్లులు పడుతూనే ఉన్నాయి. వర్షాల ధాటికి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించగా.. పలు చోట్ల రాకపోకలకు విఘాతం కలిగింది. కొన్ని పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సిద్దిపేట జిల్లా వర్గల్‌లో అత్యధికంగా 23 సెంటీమీటర్ల వాన పడగా, మెదక్ జిల్లా అల్లాదుర్గ్‌లో 22, కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌లో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో దాదాపు 4 వేల ఎకరాలపైగా వరి, పత్తి, కూరగాయల పంటలు నీటమునిగాయి. తొగుట, రాయపోల్ మండలాల్లో కురిసిన వర్షానికి పలు ఇళ్లు కూలిపోయాయి. మర్కూక్ మండలంలోని చేబర్తి గ్రామంలో మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్‌కు గల ప్రధాన కాలువ ధ్వంసమైంది. ములుగులో 18.6, రాయపోల్‌లో 16.3, మర్కూక్‌లో 14.2, కొమురవెల్లిలో 12, గజ్వేల్‌లో 11.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నారాయణఖేడ్ పరిధిలోని నల్ల వాగు, జహీరాబాద్‌లోని నారింజ వాగు ప్రాజెక్టులు పూర్తిగా నిండాయి. జిల్లా పరిధిలో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో 10మండలాల్లో రాకపోకలకు అంతరాయం కలిగింది. మెదక్ జిల్లాలోని మనోహరాబాద్‌లో పోలీసు స్టేషన్, ఎంపీడీవో కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. టేక్మాల్ మండలం బుడ్మట్‌పల్లిలో ఇళ్లలోకి నీరు ప్రవేశించి ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు. అల్లాదుర్గం ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న నీటి ఉధృతికి ఓ బైక్ కొట్టుకుపోయింది. గడిపెద్దాపూర్‌లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఏడుపాయల వనదుర్గ గర్భ గుడిలోకి వరద నీరు ప్రవేశించడంతో అమ్మ వారికి నిత్యపూజలు నిలిపివేశారు. ఉత్సవమూర్తికి పూజలు కొనసాగిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలోని రుద్రూర్‌లో 16.2 సెంటీమీటర్ల వర్షం నమోదు కాగా, కోటగిరి మండలంలో 14.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. రుద్రూర్ - బొప్పాపూర్ బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బోధన్ మండలం హంగర్గలో పంట పొలాల్లోకి భారీగా వరద వచ్చి చేరింది. నిర్మల్ జిల్లాలోని కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులకు ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. మేడ్చల్ జిల్లాలోని ఈఎస్‌ఎస్ కేశవరంలో అత్యధికంగా 10.9, శామీర్‌పేట మండలం అలిబాద్‌లో 9.5, వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పెద్దఉమ్మెంతాల్‌లో 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎడతెరిపిలేకుండా జల్లులు పడుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.



కుమరం భీం జిల్లా చింతలమానేపల్లి మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న దిందా వాగును దాటుతున్న గ్రామస్థులు

మహబూబ్‌నగర్ జిల్లాలోని సీసీ కుంట మండలంలో 6, మూసాపేటలో 5.1, నాగర్‌కర్నూల్ జిల్లాలోని పెద్దకొత్తపల్లిలో 8.44, వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో 8.06, నారాయణపేట జిల్లా కేంద్రంలో6.02 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గద్వాల జిల్లాలో భారీ వర్షాల దాటికి పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి చేలలో పూత, గూడ (పిందె) రాలుతోందని రైతులు వాపోయారు. సూర్యాపేట జిల్లాలో ఉన్న 900చెరువులు, కుంటలు అలుగులు పోస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ డివిజన్ల పరిధిలో భారీ వర్షం కురిసింది. బిచ్కుంద, పిట్లం, జుక్కల్, మద్నూర్, బీర్కూర్ మండలాల్లోని 900ల ఎకరాల్లో సోయా, పత్తి, వరి పంటలు నీట మునిగాయి. బిచ్కుంద మండలంలో మంజీర వరదలో చిక్కుకున్న నలుగురు గొర్రెల కాపర్లను, 656 గొర్రెలను పోలీసులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఆసిఫాబాద్ జిల్లాలోని వెంకట్‌రావుపేట వద్ద పెన్‌గంగా వంతెనకు ఆనుకొని ఉప్పొంగి ప్రవహిస్తోంది. లోలెవల్ వంతెనపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో సిర్పూర్(టి)-మహారాష్ట్ర మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

ములుగు జిల్లాలో మహిళ మృతి

ములుగు జిల్లా భారీ వర్షాలు పడుతుండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. జిల్లాలో సగటున 39.3సెంటీమీటర్ల వర్షం కురిసింది. తాడ్వాయి మండలం కాల్వపల్లిలోని తూముల వాగులో పడి సోలం గౌరమ్మ (40) మృతి చెందింది. మంగపేట మండలంలోని కమలాపురంలో 30 ఇళ్లల్లోకి వరద చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వందలాది ఎకరాల పొలాలు నీటమునిగాయి.

మహారాష్ట్రలోని వాగులో జగిత్యాల మహిళల గల్లంతు



ఎండీ సమీనా, అఫ్రిన్, హసీనా (ఫైల్)

మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్ వద్ద వాగులో జగిత్యాల జిల్లాకు చెందిన ముగ్గురు మహిళలు గల్లంతయ్యారు. వారు ప్రయాణిస్తున్న కారు వరదలో కొట్టుకుని పోగా, అఫ్రిన్(34), హసీనా(36), సమీనా(50) గల్లంతైనట్లు సోమవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో జగిత్యాలలో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వీరంతా మహారాష్ట్రలోని ఉద్గీర్‌లో ఉండే బంధువులను కలవడానికి సమీనా మేనల్లుడు షోహెబ్‌తో కలిసి రెండు రోజుల క్రితం బయలుదేరి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దెగ్లూర్ వద్ద ఆదివారం సాయంత్రం వీరు ప్రయాణిస్తున్న కారు కొట్టుకుపోయింది. ప్రమాదంలో కారు డ్రైవర్, వాహనంలో ప్రయాణిస్తున్న షోహెబ్ బయటపడగా అఫ్రిన్, హసీనా, సమీనాలు గల్లంతయ్యారు.

నేడు, రేపు 7 జిల్లాలకు భారీ వర్ష సూచన

తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.








యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో నీట మునిగిన పత్తి చేలు, ముంచెత్తిన వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పంజాబ్ చౌక్, భద్రాచలం వద్ద గోదావరి ఉధృత ప్రవాహం

గోదావరి ఉరకలు.. కృష్ణమ్మ పరవళ్లు!

» శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 39గేట్ల ఎత్తివేత
» 20 తర్వాతే మిడ్ మానేరు నుంచి పంపింగ్
» శ్రీశైలంలో 10, సాగర్‌లో 26 గేట్లు ఎత్తివేత



నాగార్జునసాగర్ 26 గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

హైదరాబాద్/నాగార్జునసాగర్/గద్వాల/బ్రహ్మగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రతోపాటు ఎగువనున్న ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల దాటికి గోదావరి ఉరకలు వేస్తోంది. మరోవైపు.. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. రెండు బేసిన్లలోని ప్రధాన జలాశయాలు నీటితో నిండిపోగా, వచ్చిన వరదను వచ్చినట్టే దిగువకు వదులుతున్నారు. గోదావరి పరిధిలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 1,25,400 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 39గేట్ల ద్వారా 1.51లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. అలాగే, ఇందిరమ్మ వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు 18 వేల క్యూసెక్కులు, కాకతీయ కెనాల్‌కు 5 వేల క్యూసెక్కులు వదిలారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1,091(నీటి నిల్వ సామర్థ్యం 81టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం 1,089 అడుగుల (79టీఎంసీల) మేర నీరు ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 1.17లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మిడ్‌మానేరు జలాశయానికి 18,865 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. తాజా ఇన్‌ఫ్లోల ప్రకారం ఈనెల 20 నుంచి మిడ్‌మానేరు నుంచి నీటిని పంపింగ్ చేయడానికి వీలు కలుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 310.68మీటర్ల మేర నీరు నిల్వ ఉండగా, 311.14 మీటర్ల(13.13 టీఎంసీల)కు చేరితే ఒక పంపు, 14.94 టీఎంసీలకు చేరితే రెండు పంపులు, 313.19 మీటర్ల(16.76 టీఎంసీల)కు చేరితే మూడు పంపులు, 317.31 మీటర్ల(25.77 టీఎంసీల)కు చేరితే నాలుగు మోటార్లు ప్రారంభించే అవకాశాలున్నాయి. ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద సోమవారం ఉదయం 13.490 మీటర్లకు చేరిన గోదావరి ఆ తర్వాత క్రమంగా తగ్గుముఖం పట్టింది. సాయంత్రం 5గంటలకు 13.450మీటర్ల వద్ద గోదావరి నిలకడగా కొనసాగుతోంది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ కుంగినా, అన్నారం సుందిళ్లలో ఒక్క నీటి చుక్కనూ ఆపకున్నా.. ఈ ఏడాది కురుస్తున్న వర్షాలతో గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ జల కళ సంతరించుకున్నాయని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 37.5 అడుగులు ఉండగా.. 39 అడుగులకు వరకు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

శ్రీశైలం, సాగర్‌కు పోటెత్తిన వరద

కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. శ్రీశైలం ప్రాజెక్టుకు 3.29లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా... 10 క్రస్ట్‌గేట్లను ఎత్తి 4.03లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 197.01 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 3.31లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... 26క్రస్ట్ గేట్లు ఎత్తి 2.93 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఈ సీజన్‌లో 3లక్షల క్యూసెక్కులపైగా వరద రావడం ఇదే మొదటిసారి. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.045టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 585.90 అడుగుల(3000.031) మేర నీటి నిల్వ ఉంది. పులిచింతల ప్రాజెక్టుకు 2.47 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... 3.10 లక్షల క్యూసెక్కులను వదిలారు. ఇక ఎగువన ఉన్న ఆల్మట్టికి 87వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 1.25లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు1.35లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1.40లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో రికార్డయింది. జూరాల ప్రాజెక్టుకు 1.85 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా..1.79 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది.

భట్టి, ఉత్తమ్‌లపై కేసు కొట్టివేత

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై నమోదైన ఓ క్రిమినల్ కేసును హైకోర్టు సోమవారం కొట్టివేసింది. కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవాలని, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండు చేస్తూ 2021లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. దీనిపై సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ వారు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినట్లుగానీ, ర్యాలీలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నట్లుగానీ, శాంతిభద్రతలకు విఘాతం కలిగినట్లుగానీ ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును కొట్టివేసింది.

కబడ్డీ అసోసియేషన్‌కు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఉద్యోగులు కబడ్డీ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉండడం, పార్ట్‌టైం కోచ్‌లతో శిక్షణ ఇప్పిస్తున్నారన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్‌కు హైకోర్టు నోటీసులు జారీచేసింది. నిబంధనలు పాటించడం లేదని, క్రీడాభివృద్ధి కోడ్ - 2011ను అమలు చేయడం లేదని ఆరోపిస్తూ రిటైర్డ్ కబడ్డీ కోచ్ పవన్‌కుమార్ యాదవ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ.. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర లేదని, పిటిషనర్ కబడ్డీ కోచ్ కాబట్టి ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదన్నారు.

యాదగిరిగుట్ట ఆలయానికి మూడు ఐఎస్‌వో సర్టిఫికెట్లు

యాదగిరిగుట్ట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. భక్తుల శ్రేయస్సు, పర్యావరణ పరిరక్షణ, పారదర్శకమైన పరిపాలనకు మూడు ఐఎస్‌వో సర్టిఫికెట్లు ఇస్తున్నట్టు హైమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం యాదగిరిగుట్ట ఆలయ అధికారులకు సమాచారమిచ్చింది. దేవాలయానికి సంబంధించి పరిపాలన, నిర్వహణ, సౌకర్యాల కల్పనకు ఐఎస్‌వో 9001, ఆలయంలో పొదుపు, ఇంధన నిర్వహణ సామర్థ్యం పెంచేందుకు చేపట్టే చర్యలకు ఐఎస్‌వో 50001, ప్రసాదాలు, అన్నదానంలో పరిశుభ్రత, భద్రత ప్రమాణాలకు ఐఎస్‌వో 22000 సర్టిఫికెట్లను ఇస్తున్నట్టు పేర్కొంది. పారదర్శకమైన పాలనకు కట్టుబడి ఉండటం పట్ల సంస్థ సంతృప్తి వ్యక్తం చేసింది. రిటైర్డ్ న్యాయమూర్తి సుందరరామయ్య సమక్షంలో హైమ్ ఇంటర్నేషన్ సర్టిఫికేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య సర్టిఫికెట్లను జారీ చేశారు.

హెచ్‌సీఏ అవకతవకల్లో కేటీఆర్‌ది కీలకపాత్ర

» క్విడ్ ప్రోకో విధానంలో లబ్ధి: గురువారెడ్డి



మాట్లాడుతున్న గురువారెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ), మాజీ మంత్రి కేటీఆర్ మధ్య క్విడ్ ప్రోకో వ్యవహారం నడిచిందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) కార్యదర్శి గురువారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. 2015 నుంచి హెచ్‌సీఏ ఆడిట్‌ను పరిశీలిస్తే తప్పుడు లెక్కలు, నిబంధనలు పాటించని క్లబ్‌లకు చేకూర్చిన లబ్ధి, దుర్వినియోగమైన నిధుల వ్యవహారం బయటపడుతుందన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. '2015-16లో బీసీసీఐ ఐటీ అండ్ డేటా మేనేజ్‌మెంట్ సబ్ కమిటీకి నాటి మంత్రి కేటీఆర్‌ను నిబంధనలకు విరుద్ధంగా అప్పటి అధ్యక్షుడు అర్షద్ ఆయూబ్ నామినేట్ చేశారు. ప్రభుత్వపరంగా పలు విషయాల్లో హెచ్‌సీఏకు లబ్ధి చేకూర్చి, ప్రతిఫలంగా ఐపీఎల్ టికెట్లను విక్రయించే కాంట్రాక్టును రాజ్ పాకాలకు ఇప్పించడంతో పాటు పలు అవకతవకల్లో కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత కీలకపాత్ర పోషించారు. ప్రతి ఏడాది క్రికెట్ క్లబ్‌లకు అభివృద్ధి నిధుల కింద రూ.6.10 కోట్లు ఇస్తున్నారు.. టీమ్‌లు లేని క్లబ్‌లకు కూడా డబ్బులు ఇస్తున్నారు' అని ఆరోపించారు. అలాగే కేవలం పరిపాలన ఖర్చుల కింద ఏటా రూ.12 కోట్లు చూపిస్తున్నారని.. అంత మొత్తం దేనికి ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రస్తుత క్లబ్‌లలో 76 క్లబ్‌లు నిబంధనలకు అనుగుణంగా లేవని, హెచ్‌సీఏ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీసీసీఐని కోరారు. నిబంధనలు పాటించని హెచ్‌సీఏ సొసైటీ గుర్తింపు రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జీఎస్టీ ప్రక్షాళన!

ప్రధాని ఎర్రకోట ప్రసంగంలో జాతీయతనూ, దేశభక్తినీ రగల్చే వ్యాఖ్యలు ఉత్తేజాన్నివ్వడంతోపాటు, వస్తుసేవల పన్ను (జీఎస్టీ) విధానంలో మార్పు తేబోతున్నామన్న హామీ ఈ దేశ సగటు మనిషిని కచ్చితంగా సంతోషపెట్టి ఉంటాయి. దీపావళికి జీఎస్టీ పండుగ రాబోతున్నదనీ, ఆ రోజున గొప్ప బహుమతి ఇవ్వబోతున్నామని ప్రధాని ఎర్రకోటమీద నుంచి వ్యాఖ్యానించారు. వెనువెంటనే, ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి మీడియాకు లీకులు అందాయి. ప్రస్తుతం ఉన్న నాలుగురకాల జీఎస్టీ శ్లాబుల్లో 12, 28శాతం తొలగిపోయి, 5, 18శ్లాబులు మిగుల్తూ జీఎస్టీ 2.0 ఆవిర్భవించబోతున్నదని మీడియా కథనాల సారాంశం. కేంద్ర ఆర్థికశాఖ పరోక్షంగా అందించిన సమాచారాన్ని కాచివడబోసి, పాలు, పన్నీరు నుంచి టీవీలు, వాషింగ్ మెషీన్ల వరకూ ఎన్నిరకాల ఉత్పత్తుల ధరలు తగ్గవచ్చునో మీడియా అంచనాలు కడుతోంది. సుంకాల యుద్ధాలో, విదేశాలతో చేసుకోవాల్సి వస్తున్న వాణిజ్య ఒప్పందాలో, సొంతబలం లేని స్థితిలో ముంచుకొస్తున్న రాష్ట్రాల ఎన్నికలో.. ఎవరు ఏ కారణాలు చెబుతున్నప్పటికీ, జీఎస్టీ సమూల ప్రక్షాళనకు ప్రభుత్వం సిద్ధపడినందుకు సంతోషించాలి, అభినందించాలి.

కేవలం శ్లాబుల కుదింపు, పన్నురేట్ల తగ్గింపులే కాక, జీఎస్టీ వ్యవస్థను సమూలంగా సంస్కరించే పని జరుగుతోందట. పన్ను ఎగవేతలను రూపుమాపి, బోగస్ ఇన్వాయిస్‌లతో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను దిగమింగే అకృత్యానికి కూడా అడ్డుకట్టవేస్తారట. రిటర్నులు, రిఫండ్ల ప్రక్రియలు అతివేగంగా జరిగిపోతాయట. మొత్తానికి అటు అమ్మకందారు, ఇటు కొనుగోలుదారు కళ్ళలో ఆనందాన్ని చూడాలని ఆర్థికశాఖ అనుకుంటోందని అర్థం. 2017లో జీఎస్టీ వ్యవస్థను ప్రవేశపెడుతున్నప్పుడు పాలకులు దానిని ఏ రీతిన కీర్తించారో మనకు తెలుసు. ఆ తరువాత అది చక్కనిదీ, సరళతరమూ (గుడ్ అండ్ సింపుల్) కాదని తేలిపోయింది. జీఎస్టీ వసూళ్ళు దాదాపు రెండులక్షల కోట్లకు చేరి, ఏటా పదిశాతానికి పైగా వృద్ధి కనబడుతున్నా, పన్ను రేట్లు, వివిధ శ్లాబులలోకి వచ్చే వస్తువులు, సేవల విషయంలో సామాన్యులకు తీవ్రమైన అసంతృప్తి ఉంది. రేట్ల నిర్ణయంలో కేంద్రం అమానవీయంగా వ్యవహరిస్తోంది. ఆరోగ్య ఉత్పత్తులు–సేవలు, ఔషధాలు, వెన్న, నెయ్యి, పాలు వంటి నిత్యావసరాలపైనా జీఎస్టీ హెచ్చు స్థాయిలో ఉండటం ఏ విధంగానూ సమర్థనీయం కాదు.

గత ఏడాది సెప్టెంబరులో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిగిన ఓ సమావేశంలో, తమిళనాడులోని ఓ హోటల్ చైన్ యజమాని వివిధరకాల ఆహారోత్పత్తులపై వేర్వేరు జీఎస్టీ రేట్ల గురించి చేసిన వ్యాఖ్యలు క్రీమ్ బన్ వీడియోగా ఎంతో ప్రాచుర్యం పొందాయి. 'క్రీమ్ బన్ మీద 18శాతం జీఎస్టీ ఉంటే, విడిగా బన్ మీద అస్సలు లేదు..., మా హోటల్‌కు వచ్చిన కస్టమర్లు, బన్ను, క్రీము వేరు వేరుగా ఇస్తే మేమే దానిమీద పూసుకొని తింటామని అంటున్నారు మేడమ్' అంటూ నిజాన్నీ, నిష్ఠూరాన్నీ సమానపాళ్ళలో మేళవించి వ్యాఖ్యానించాడాయన. ఆ తరువాత ఆర్థికమంత్రికి అవమానమో, ఆగ్రహమో కలిగినందున, విడిగా కలిసి క్షమాపణలు చెప్పుకున్న మరో వీడియో వెలుగుచూసింది. ఇక, రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగిన 55వ జీఎస్టీ సమావేశం పాప్‌కార్న్ ఫ్లేవర్, దానిలోని చక్కెర, మసాలా స్థాయిలను బట్టి మూడురకాల పన్నులు నిర్ణయించడంతో నెటిజన్లు ప్రభుత్వాన్ని తీవ్రంగా ట్రోల్ చేశారు. జీవిత బీమా (లైఫ్ ఇన్సూరెన్స్), ఆరోగ్య బీమా (హెల్త్ ఇన్సూరెన్స్) ప్రీమియంలపై 18శాతం జీఎస్టీ వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాయడం కలకలం రేపింది. సామాన్యులకు అవసరమైన బీమా ప్రీమియంలపై జీఎస్టీని తగ్గించాలంటూ ఉద్యోగ సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తూ, నాయకులకు విన్నపాలు సమర్పిస్తున్నాయి. ప్రీమియం చెల్లింపులపై జీఎస్టీని పూర్తిగా రద్దుచేయాలని పార్లమెంట్‌లో విపక్షాలు అడిగినప్పుడు జీఎస్టీ రాకమునుపు కూడా ప్రీమియంపై పన్ను ఉన్నదంటూ ప్రభుత్వం ప్రతివిమర్శ చేసింది. ప్రతీదానినీ రాజకీయం చేయవద్దని విపక్షాన్ని హెచ్చరించింది. ఇప్పుడు ప్రీమియంపై కూడా పన్ను తగ్గించబోతున్నారనీ, సగటు మనిషి ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పెట్రోలియం ఉత్పత్తులనూ జీఎస్టీ పరిధిలోకి తెచ్చి మంటను ఉపశమింపచేస్తారనీ వింటున్నాం. ప్రజల ప్రతీ అవసరాన్నీ దృష్టిలో పెట్టుకొని, రేట్లనూ, శ్లాబులనూ చక్కదిద్దాలనీ, న్యాయమైన, హేతుబద్ధమైన పన్ను విధానం రూపొంది, అమ్మకందారుల, వినియోగదారుల ప్రశంసలు అందుకోవాలని ఆశిద్దాం.

ఫెడరల్ : రాజ్యాంగ పీఠికకు మరో చేర్పు



భారత జాతీయ జాగృతిలో కీలక పాత్ర వహించిన వలసపాలన వ్యతిరేక ఆలోచనారంగంలో విశాల దృక్పథమూ, ముందుచూపుతో ప్రశస్త భావాలు ప్రభవించాయి. అయితే 1947లో భారత స్వాతంత్ర్య విజయం అనంతరం వలసపాలనానంతర రాజ్య వ్యవస్థ అత్యున్నత స్థాయిలో అధికార పోరాటం కారణంగా ఆ సమున్నత భావాలలో కొన్ని నిలదొక్కుకోలేకపోయాయి. అధికారంలో పాలుపంచుకోవడంలో ఫెడరల్ కేంద్రం, రాష్ట్రాల మధ్య అనివార్యమైన సర్దుబాట్లు అనేది ఆ భావాలలో ప్రముఖమైనది. మత ప్రాతిపదికన జరిగిన దేశ విభజన, దాని విషమ పర్యవసానాలు ప్రాంతీయమైన రాజకీయ గతిశీలతను కనిపించకుండా చేశాయి. ఆ రాజకీయ శక్తిశీలతే స్వతంత్ర భారతదేశాన్ని ఒక సమాఖ్య రాజ్యంగా రూపొందించే విషయమై వలస పాలన వ్యతిరేక జాతీయవాదులలో వినూత్న ఆలోచనలకు ప్రేరణనిచ్చింది. ప్రజాస్వామ్య సమాజం, సమాఖ్య వ్యవస్థ విషయమై స్వాతంత్ర్య సమర నాయకుల సృజనాత్మక భావాలు స్వతంత్ర భారతదేశ ప్రస్థానంలో సాకారమవలేదు. అవకపోగా అలక్ష్యానికి గురయ్యాయి. ఇపుడు ఆ సమున్నత దార్శనికతల సృజనాత్మక పునరుద్ధరణకు మనం పూనుకోవాల్సిన అవసరమున్నది.

భారత రాజ్యాంగ పీఠిక నుంచి 'సెక్యులర్' (లౌకిక), 'సోషలిస్ట్' (సామ్యవాద) అనే పదాలను తొలగించివేసే విషయాన్ని పరిశీలించాలని ఇటీవల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పెద్దలు సూచించారు. ఎమర్జెన్సీ చీకటి రోజులలో ప్రధాని ఇందిర ప్రభుత్వం రాజ్యాంగానికి 42వ సవరణ ద్వారా రాజ్యాంగ పీఠికలో ఆ రెండు పదాలు చేర్చింది. 'సెక్యులర్'ను తొలగించడం, హిందూ గణతంత్ర రాజ్య ఏర్పాటు ప్రతిపాదకులకు ఒక ప్రతీకాత్మక విజయమవుతుంది. 'సోషలిస్ట్'ను చరిత్ర చెత్తబుట్టపాలు చేయడం సామాజిక–ఆర్థిక అసమానతలు అంతుపొంతు లేకుండా పెచ్చరిల్లిపోవడాన్ని నిస్సిగ్గుగా వేడుక చేసుకుంటున్న యుగానికి సముచితమైనది కావచ్చు.

సెక్యులరిజం, సోషలిజం రెండిటినీ కేంద్రీకృత రాజ్య వ్యవస్థ అధికారానికి సైద్ధాంతిక ఆధారాలుగా ఇందిరా గాంధీ పరిగణించారు. ఆ దృక్పథంతోనే ఆమె ఆ రెండు భావనలను రాజ్యాంగ పీఠికలో చేర్చారు. అయితే ఈ రెండు సైద్ధాంతిక పునాదులు బీటలు వారడంతో మత పరమైన మెజారిటేరియన్‌వాదం ఆ రెండింటిని కేంద్రీకృత నిరంకుశాధికారాన్ని పెంపొందించుకుని, పటిష్ఠం చేసుకునేందుకు చక్కగా ఉపయోగించుకున్నది. రాజ్యాంగ పీఠికలోని ప్రతీకాత్మకతకు ప్రాముఖ్యత ఉన్నట్టయితే ఆ పీఠిక నుంచి రెండు పదాలను తొలగించడం కాకుండా మరొక పదాన్ని అదనంగా చేర్చడం విజ్ఞతాయుతంగా ఉంటుంది, సందేహం లేదు.

నవంబర్ 15, 1948న రాజ్యాంగ సభలో కేటీ షా అధికరణ 1కి ఒక సవరణ ప్రతిపాదించారు. 'ఇండియా షల్ బి ఏ సెక్యులర్, ఫెడరల్, సోషలిస్ట్ యూనియన్ స్టేట్స్'గా ప్రకటించాలని ఆ సవరణ పేర్కొన్నది. ఆ దశలో రాజ్యాంగ పీఠికపై ఇంకా చర్చ ప్రారంభం కాలేదు. మొదటి అధికరణను సవరించడం ద్వారా భావి భారత్ స్వరూపస్వభావాలకు ఒక స్పష్టత నివ్వాలని కేటీ షా భావించారు. 'అధికరణ 1లోని 'యూనియన్' అనే పదం ఏక కేంద్రక ప్రభుత్వం (యూనిటరీ గవర్నమెంట్) అని భావించడానికి దారితీయకూడదు. ఎవరూ అలా పొరపడకుండా ఉండాలంటే మొదటి అధికరణలోని మొదటి నిబంధనలోనే 'ఫెడరల్ యూనియన్' అని స్పష్టం చేయాలని నేను భావిస్తున్నాన'ని షా అన్నారు.

akbar

> మన స్వాతంత్ర్యోద్యమ నాయకులు, ఉదార భారత సమాఖ్య రాజ్యాన్నే ప్రగాఢంగా ఆకాంక్షించారు. వలసపాలన కాలం నాటి కేంద్రీకృత రాజ్యవ్యవస్థను కొనసాగించాలని వారు ఎంత మాత్రం భావించలేదు. ప్రాంతీయ తత్వాలు వారి స్వభావానికి విరుద్ధం. మన గణతంత్ర రాజ్య సంస్థాపన సందర్భంలోనే వారి ఉదాత్త దార్శనికతను కోల్పోయాం. ఫలితంగా సంభవించిన నష్టాన్ని నిజాయితీగా అర్థం చేసుకోవాలి. కేంద్రీకృత నిరంకుశాధికారానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానం పురోగతికి అది ఒక ఆవశ్యక షరతు.

కేటీ షా ప్రతిపాదనకు డాక్టర్ అంబేడ్కర్ రెండు అభ్యంతరాలు తెలిపారు. 'రాజ్యాంగం అనేది రాజ్య వ్యవస్థలోని వివిధ విభాగాలను క్రమబద్ధీకరించడానికి ఉద్దేశించిన ఒక వ్యవస్థ' అని ఆయన అన్నారు. 'ప్రభుత్వ విధానం ఏమిటి? సమాజాన్ని ఎలా వ్యవస్థీకరించాలి మొదలైన విషయాలను రాజ్యాంగం నిర్దేశించదు' అని అంబేడ్కర్ అన్నారు. 'సోషలిస్ట్' అనే పదానికి సంబంధించినంతవరకు షా సవరణ అనవసరం' అనేది అంబేడ్కర్ రెండో ఆక్షేపణ. అయితే 'సెక్యులర్', 'ఫెడరల్' అనే పదాల గురించి ఆయనేమీ చెప్పలేదు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు తమ సారంలోను, లక్ష్యంలోను సామ్యవాద స్ఫూర్తిలేనివి అయితే సామ్యవాదం మరింకేమవుతుందనేది నేను అర్థం చేసుకోలేకపోతున్నాను' అని అంబేడ్కర్ అన్నారు.

'ఫెడరల్' అనే పదాన్ని చేర్చాలన్న కేటీ షా వివేకవంతమైన సూచనను రాజ్యాంగ సభ తిరస్కరించిందని మరి చెప్పనవసరం లేదు. దీనిపై మహబూబ్ అలీ బైగ్ అనే సభ్యుడు ప్రతిస్పందిస్తూ 'ముసాయిదా రాజ్యంగ నిర్మాతల మనసులో ఏక కేంద్రక ప్రభుత్వ భావన ఉండి ఉంటుందని, అయితే దాన్ని వారు సమాఖ్య అని చెప్పుతున్నారని' విస్మయం వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం యూనిటరీ ప్రభుత్వంగా కాకుండా ఫెడరల్ ప్రభుత్వంగానే ఉండితీరాలి. భవిష్యత్తులో అధికార లాలసులు ఏక కేంద్రక ప్రభుత్వాన్ని ఫాసిస్ట్ లేదా సంపూర్ణ నియంతృత్వ ప్రభుత్వంగా మార్చివేసేందుకు అవకాశమున్నదని పేర్కొంటూ కనుక మనం ఇప్పుడే ఫెడరేషన్ అనే సరైన మాటను చేర్చితీరాలని ప్రతిపాదించారు. బైగ్ ప్రతిపాదించిన ఈ సవరణ కూడా తిరస్కృతమయింది.

కేటీ షా చాలా పట్టుదల మనిషి. అధికరణ 1లోని మొదటి నిబంధనకు ఆయన మరో సవరణ ప్రతిపాదించారు. అన్ని రాష్ట్రాలు సమమైనవే అన్నది ఆ సవరణ సారాంశం. ఈ కొత్త సవరణను ప్రతిపాదిస్తూ తన తొలి సవరణ ప్రతిపాదనపై డాక్టర్ అంబేడ్కర్ అభ్యంతరాలను త్రోసిపుచ్చారు. 'రాజ్యాంగం అనేది ప్రభుత్వంలోని వివిధ విభాగాలను క్రమబద్ధం చేసే వ్యవస్థ మాత్రమే' అన్న విషయాన్ని తాను వినడం ఇదే మొదటిసారి అని షా అన్నారు. 'ఇండియన్ యూనియన్ నిజమైన సమాఖ్య రాజ్యంగా ఉండి తీరాలంటే అందులో అంతర్భాగంగా ఉన్న అన్ని రాష్ట్రాలు ఎటువంటి మినహాయింపులు లేకుండా సమమైనవే అన్న విషయాన్ని రాజ్యాంగంలో చేర్చడం చాలా చాలా ముఖ్యమని కేటీ షా నొక్కి చెప్పారు. షా సవరణతో పాటు దాన్ని సమర్థిస్తూ హరివిష్ణు కామత్ ప్రతిపాదించిన సవరణను కూడా రాజ్యాంగ సభ తిరస్కరించింది.

సుభాస్ చంద్రబోస్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా 1938లో ఏర్పాటు చేసిన జాతీయ ప్రణాళికా సంఘంలో చేరాలని రాధాకమల్ ముఖర్జీ, మేఘనాథ్ సాహాతో పాటు కేటీ షాను కూడా ఆహ్వానించారు. తమ తమ రంగాలలో మేరునగ శిఖరాలు అయిన ఈ ముగ్గురు విద్యావేత్తలు పరిపూర్ణ సమాఖ్యవాదులు. స్వాతంత్ర్య సమరంలో సుభాస్ బోస్, పండిట్ నెహ్రూ ఇరువురితోను షా సన్నిహితంగా కలిసి పనిచేశారు. 1952లో ప్రథమ సార్వత్రిక ఎన్నికలలో కేటీ షా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ అభ్యర్థి చెప్పుకోదగిన ప్రముఖుడు కానప్పటికీ షా పరాజితుడు అయ్యారు. డాక్టర్ అంబేడ్కర్ సైతం ఆ ఎన్నికలలో అనామక కాంగ్రెస్ అభ్యర్థి చేతుల్లో ఓడిపోయారు. 1952లో రాష్ట్రపతి పదవికి జరిగిన ఎన్నికలలో కేటీ షా స్వతంత్ర అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌పై పోటీచేసి ఓడిపోయారు. జాతీయ ప్రణాళికా సంఘంలో షాకు సహచరుడు, బెంగాల్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన మేఘనాథ్ సాహా రాష్ట్రపతి పదవి ఎన్నికలలో పోటీ చేయమని కేటీ షాను ప్రోత్సహించారు. వలసపాలన వ్యతిరేక పోరాట ఆశయాలు, లక్ష్యాలకు విజేత కంటే ఎక్కువగా నిబద్ధుడు అయినప్పటికీ కేటీ షా ఓడిపోయారు.

రాజ్యాంగ పీఠికలోని మాటలు మనోరంజితమైనవీ, స్ఫూర్తిదాయకమైనవీ. 'ఫెడరల్' అనే మాటను అదనంగా చేర్చడం వల్ల ఆ భావనలు మరెంతో అర్థవంతమవుతాయి. సమాఖ్య విధానాన్ని చిత్తశుద్ధితో అమలుపరచాల్సిన అవసరమున్నది. త్వరలోనే దేశ వ్యాప్తంగా జనాభా గణన జరగనున్నది. ఆ తరువాత నియోజకవర్గాలను పునర్ వ్యవస్థీకరిస్తారు. దీని వల్ల హిందీ రాష్ట్రాల ప్రాధాన్యం పెరిగి దక్షిణాది రాష్ట్రాలు తమ రాజకీయ పలుకుబడిని కోల్పోవచ్చనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగా సమాఖ్య పాలనా పద్ధతిని చిత్తశుద్ధితో అమలుపరిచేందుకు మరింత శ్రద్ధ చూపవలసిన అవసరమున్నది. శక్తిమంతమైన భారతదేశం సమాఖ్య తరహా రాజ్యం మాత్రమే అవుతుంది.


కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో వేర్పాటువాద ధోరణులు పెచ్చరిల్లిపోయాయి. తమిళ, కన్నడ, మరాఠీ, బెంగాలీ స్వాభిమానాలు మళ్లీ ప్రకోపిస్తున్నాయి. భారత రాజకీయాల భావి తీరుతెన్నులకు అవి సూచకాలు కాదా? మహాద్రష్టలైన మన స్వాతంత్ర్యోద్యమ నాయకులు, వినూత్న, ఉదార భారత సమాఖ్య రాజ్యాన్నే ప్రగాఢంగా ఆకాంక్షించారు. వలసపాలన కాలం నాటి కేంద్రీకృత రాజ్యవ్యవస్థను కొనసాగించాలని వారు ఎంతమాత్రం భావించలేదు. ప్రాంతీయ తత్వాలు వారి స్వభావానికి విరుద్ధం. మన గణతంత్ర రాజ్య సంస్థాపన సందర్భంలోనే వారి మానవీయ దార్శనికతను కోల్పోయాం. ఫలితంగా సంభవించిన నష్టాన్ని నిజాయితీగా అర్థం చేసుకోవాలి. కేంద్రీకృత నిరంకుశాధికారానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానం పురోగతికి అది ఒక ఆవశ్యక షరతు.

■ సుగత బోస్
హార్వర్డ్ విశ్వవిద్యాలయం

('ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యం)

ప్రజాస్వామ్యానికి పునాదిగా పంచాయతీలు

'పంచాయతొచ్చిందిరా పల్లోడా-పల్లెకే విలువొచ్చెరా పల్లోడా, పట్టణాలకు పల్లె పోటీగా నిలువాలే-అభివృద్ధిలో ముందు అడుగులే వెయ్యాలే, కూలికే తిరుగొద్దురా పల్లోడా-కూటికె ఇక కరువొద్దురా పల్లోడా, నీ ఊరి బాగోగు నీవే చూడాలెరా-నీ ఊరి మంచిచెడు నీ జిమ్మేదారిరా, బాధ్యతే నీకొచ్చెరా పల్లోడా-భారీ హక్కే వొచ్చెరా పల్లోడా' అంటూ తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు, వరంగల్ జిల్లాకు చెందిన కవి, మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణ 1958లోనే పంచాయతి ప్రాముఖ్యాన్ని గేయ రూపంలో చాటారు. రాష్ట్రంలో పంచాయతి ఎన్నికల వాతావరణం నెలకొన్న ప్రస్తుత సమయంలో గ్రామాల పరిస్థితిని అవలోకనం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చినా, మౌలిక సదుపాయాల్లో ఒకడుగు ముందుకు, మూడడుగులు వెనక్కి వేసింది.



తెలంగాణ అభివృద్ధి చెందాలంటే తొలుత పంచాయితీల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. స్థానిక పన్నులు గ్రామ పంచాయతీలకే చెందాలి. పంట పొలాలు పచ్చగా మారాలి. పట్టణాలకు వలసపోయిన ప్రజలు పల్లెబాట పట్టాలి.

మద్యానికి దూరంగా ఉండటం, అక్షరాస్యత, పరిశుభ్రత, స్వచ్ఛత, మౌలిక వసతుల కల్పన, విద్య, వైద్యం ద్వారా గ్రామాలు త్వరగా అభివృద్ధి చెందుతాయి. ధ్వంసమైన గ్రామీణ వ్యవస్థను పునరుజ్జీవింప చేయడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. దేశాభివృద్ధికి వెన్నెముక అయిన వ్యవసాయం నడుములు ఇరిగినాయి. వృత్తులు అంతరించిపోయినాయి. చెరువులు కబ్జాలపాలయినాయి. రియల్ ఎస్టేట్ భూతం కంచెలు వేసి కరాళ నృత్యం చేస్తోంది. చెరువులను చెరబట్టారు. నల్ల తుమ్మలు, నల్ల మేకలు, నల్లగొంగడి టార్చిలైట్ వేసి వెతికినా కనిపిస్తలేవు. అదే దారిలో తాటి, ఈత వనాలు కనుమరుగైనాయి. కుటీర పరిశ్రమల స్థానంలో విదేశీ కాలుష్య పరిశ్రమలు వచ్చి గ్రామాలను సర్వనాశనం చేస్తున్నాయి. పారిశ్రామిక విప్లవం పేరుతో వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థను, గ్రామీణ ఉపాధిని విధ్వంసం చేశారు. పచ్చని పల్లెల్లో కాలుష్యకారక పరిశ్రమల ఏర్పాటుతో ఏటా గ్లోబల్ వార్మింగ్‌కు కారణం అవుతోంది. ప్రకృతి విధ్వంసం అవుతోంది.

తెలంగాణ అభివృద్ధి చెందాలంటే తొలుత పంచాయితీల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. లోకల్ పన్నులు గ్రామ పంచాయతీలకే చెందాలి. ఐదవ షెడ్యూల్ అమలవుతున్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా మేండాలేక వంటి గ్రామాలను ఆదర్శంగా తీసుకోవాలి. ఈ గ్రామంలో పంచాయతీరాజ్ చట్టాన్ని పక్కాగా అమలు చేస్తున్న తీరు, గ్రామీణ వ్యవస్థకే ఆదర్శం. గ్రామంలో అధికారం గ్రామీణులదే. రాష్ట్ర ప్రభుత్వ అధికారం, జిల్లా కలెక్టర్ అజమాయిషీ చెల్లదు. గ్రామపంచాయతీ అనుమతి లేనిదే కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కూడా ఆ గ్రామంలో అడుగుపెట్టలేరు. గ్రామసభ తీర్మానం మేరకు పరిపాలన సాగాలి అని పంచాయతీరాజ్ చట్టం స్పష్టంగా పేర్కొంది. కానీ, తెలంగాణలోని ఆదివాసీ ప్రాంతాల్లో ఐదవ షెడ్యూల్ అమలు అటకెక్కింది. పీసా చట్టం, అటవీ హక్కుల చట్టాలను పట్టించుకోవడం లేదు.

పలు కమిటీల సిఫారసుల మేరకు ఎట్టకేలకు 1993లో 73వ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగ హోదా దక్కింది. 1993, ఏప్రిల్ 20న రాష్ట్రపతి ఆమోదం పొంది, ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. దీనికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24న 'పంచాయతీరాజ్ దినోత్సవం' నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఒకే విధమైన నిర్మాణంతో పంచాయతీరాజ్ సంస్థలను ఏర్పాటు చేయడం రాష్ట్రాల రాజ్యాంగబద్ధమైన బాధ్యతగా మారింది. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడింది. ఇందులో గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, మండల స్థాయి, జిల్లా స్థాయి అనే మూడు అంచెలను ఏర్పరిచారు. గ్రామ స్థాయిలో సభ్యులను ప్రజలు తమ ఓటు ద్వారా ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. మండల స్థాయి చైర్‌పర్సన్, జిల్లాస్థాయి చైర్‌పర్సన్‌ను మాత్రం పరోక్షంగా ఎన్నుకుంటారు.

పంచాయతీ సంస్థల కాలపరిమితిని 5 సంవత్సరాలుగా నిర్దేశించారు. ఏ కారణంతోనైనా అర్ధంతరంగా రద్దుచేస్తే తిరిగి 6 నెలల లోపు తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించి నూతన పంచాయతీని ఏర్పాటుచేయాలి. జనాభా దామాషా ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, తెగల జనాభాను బట్టి రిజర్వేషన్లను కల్పిస్తారు. అదేవిధంగా మహిళలకు మొత్తం సభ్యుల స్థానాలు, చైర్‌పర్సన్ స్థానాల్లో 1/3వ వంతు తక్కువ కాకుండా రిజర్వేషన్లు కల్పించడం తప్పనిసరి. వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించడం ఆయా రాష్ట్రాల విచక్షణకు వదిలేశారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి సర్కార్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ ముందడుగు వేయడం బీసీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడమే అవుతుంది. దీని అమలుకు ఏ మేరకు చిత్తశుద్ధి చూపుతుంది అనేదే అసలు ప్రశ్న.

తెలంగాణలో గ్రామీణ నాగరికత పునర్వికాసం చెందాలంటే, ముచ్చర్ల సత్తెన్న పంచాయతి యావత్ తెలంగాణ పంచాయతి కావాలి. నగరపాలిక, గ్రామపాలిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. సమైక్యాంధ్రలో ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో ధ్వంసమైన గ్రామీణ కుటీర పరిశ్రమలు తిరిగి తెరుచుకోవాలి. పారిశ్రామిక పునరుజ్జీవం జరగాలి. గ్రామాల్లోని గొలుసుకట్టు చెరువులు జలకళతో తిరిగి శోభిల్లాలి. బోసిపోయిన చెరువుకట్టల మీద నల్ల తుమ్మలు వికసించాలి. పంట పొలాలు పచ్చగా మారాలి. పట్టణాలకు వలసపోయిన ప్రజలు వెనక్కి పల్లెబాట పట్టాలి. పల్లెల్లో కరువును పారదోలడానికి కదురు, కవ్వం, కర్రు కదులుతూనే ఉండాలి.

• కొండె సమ్మయ్య
జర్నలిస్టు

ఆదివాసీలపై మతం రుద్దవద్దు!

భారతదేశానికి అసలు వారసులైన ఆదివాసులపై నేటి హిందూ మతోన్మాదులు మతం రంగు పులిమేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. 'ఆదివాసుల మతం ఏమిటి?' పేరుతో భంగ్యా భూక్యా రాసిన వ్యాసానికి (ఆంధ్రజ్యోతి: 24-07-25) స్పందనగా కాయం నవేంద్ర 'ఆదివాసీలు ముమ్మాటికీ హిందువులే' పేరుతో రాసిన వ్యాసం (12-08-25) అసత్యాలతో, ఆదివాసీ సమాజాన్ని గందరగోళపరిచేలా ఉన్నది. కాయం నవేంద్ర రాసినట్టు ఆదివాసీలు ఏ మతానికీ 'శాఖ' కాదు, ఏ మతంలోనూ అంతర్భాగం కాదు. వారికి వారే ఒక ప్రత్యేక వృక్షం.

భారతదేశంలోని ఆదివాసీలు తమ స్వంత మత, సాంస్కృతిక, సామాజిక వ్యవస్థలతో స్వతంత్ర గుర్తింపును కలిగి ఉన్నారు. వారు హిందూ మతంలో భాగం కాదు. వారిని ఒక ప్రత్యేక సమాజంగా గుర్తించాలి. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను (ఆర్టికల్ 25), సాంస్కృతిక స్వయం ప్రతిపత్తిని (ఆర్టికల్ 29, 30) హామీ ఇస్తుంది. ఈ హక్కులు ఎవరి చరిత్రను, మతాన్ని, సంప్రదాయాన్ని వక్రీకరించి మరొక మతంలో బలవంతంగా కలపడానికి అనుమతించవు.



హిందూ శాస్త్రాలతో (వేదాలు, పురాణాలు), కర్మకాండలతో (యజ్ఞాలు, మంత్రాలు) పోల్చినపుడు ఆదివాసీల విశ్వాసాలు (ప్రకృతి ఆరాధన, ఆత్మల పూజ) మౌలికంగా భిన్నమైనవి. ఆదివాసీలు హిందూ మతంలో ఎప్పటి నుంచో భాగం అనే వాదన చారిత్రకంగా అసత్యం. ప్రాచీన వేద సాహిత్యంలో నిషాదులు, కిరాతులు, పులిందులు, శబరులు వంటి అరణ్యవాసులు హిందూ కులవ్యవస్థకు వెలుపలివారిగా వర్ణించబడ్డారు, నాగరికతకు దూరంగా చూపబడ్డారు.

మధ్యయుగంలో ఆదివాసీలు స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. గోదావరి పరిసరాల్లోని కోయ రాజ్యాలలో 12వ శతాబ్దం నుండి స్థానిక పాలన వ్యవస్థ ఉన్నది. వీరి దేవతలు పుట్ట పెన్, గంగమ్మ, భూమత్తల్లి. వీరి పూజలు అడవి గూడెంలో మాత్రమే. బస్తర్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణలో 14వ శతాబ్దం నుండి 1948 వరకు విస్తరించిన గోండు రాజ్యాలలో దండకారణ్య మహాపూజ, జంతు బలి, నృత్యాలు ఉన్నాయే గాని హిందూ పద్ధతులు లేవు. జార్ఖండ్, బిహార్, బెంగాల్, ఒడిశాలోని సాంతాళ్ రాజ్యాలు మరాంగ్ బురు, జాహెర థాన్ మతాలను పాటించాయి. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో విస్తరించిన భీల్ సమాజం వనం, నదుల ఆరాధనను పాటిస్తాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలోని బైగా తెగ భూమిపూజ, ప్రకృతి సంరక్షణను పాటిస్తుంది. కుల వ్యవస్థను తిరస్కరిస్తుంది. జానపద కథల్లో మహాదేవ్ బైగా రూపంలో ఉంటాడు, కానీ హిందూ సంప్రదాయాలు భిన్నం. ప్రకృతి ఆరాధన (nature worship) ప్రపంచవ్యాప్త ప్రాచీన మతాల లక్షణం. దానిని హిందూ 'పంచభూతాల'తో కలపడం చరిత్ర వక్రీకరణ. ఆదివాసీ తెగ చట్టాలు (వారి వివాహం, వారసత్వం, పూజలు ఇవన్నీ) హిందూ ధర్మశాస్త్రాలకు (మనుస్మృతి మొదలైనవాటికి) భిన్నంగా ఉంటాయి. ఆదివాసులు ఎప్పుడూ హిందూవులే అనే హిందూత్వ వాదుల వాదన తర్కానికి నిలబడదు. భారత రాజ్యాంగమూ వారిని ప్రత్యేకంగా గుర్తిస్తుంది. ఆర్టికల్ 342 ప్రకారం ఎస్టీ గుర్తింపు మతం ఆధారంగా కాదు. అనేక కోర్టు తీర్పులూ ఇదే విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. బ్రిటిష్ వారి కంటే ముందు కూడా తెగలు స్వతంత్ర సంప్రదాయాలను కలిగి ఉన్నాయి. వారు హిందూ పండుగల్లో పాల్గొనడం సాంస్కృతికం మాత్రమే తప్ప, మత ఏకీకరణ కాదు. ఆదివాసులను హిందూ మతంలో కలపడం అంటే వారి చరిత్రను చెరిపేయడం, భవిష్యత్తును దోచుకోవడం.

ప్రాచీన సింధూ నాగరికత వారసత్వమైన ఈ భారతదేశ ఆదివాసీలే ఆది బౌద్ధులు. ఈ ఆదివాసీలే స్వతంత్ర గణతంత్ర కళింగులు, నాగాజాతి బిడ్డలు. సామ్రాట్ అశోక చక్రవర్తితో సామ్రాజ్యవాదానికి దీటుగా పోరాడి కళింగ యుద్ధం చేశారు. యుద్ధం తర్వాత మారిన అశోకుడు వారి నుంచి బౌద్ధం స్వీకరించాకే బహుజన చక్రవర్తి అయ్యాడు. కాలక్రమంలో వలస ఆర్యన్ రాజుల దాడుల్లో సంస్కృతిని పోగొట్టుకున్న సింధూ నాగరికత ప్రజలు హిందువులు అయ్యారు. వలస బ్రాహ్మణిజ పాలనలో వేద చరిత్ర మొదలై బౌద్ధం అంతరించింది. సంస్కృతి దాడిని తట్టుకోలేని ఆదివాసీలు కొందరు అడవుల్లోకి పారిపోయారు, కొందరు బ్రాహ్మణీకరణ చెందారు. నాగా జాతి (నాగుల) చావు కోసమే జనమేజయుని యాగం అని వారి పురాణాల్లోనే రాసుకున్నారు. అందుకే ప్రాచీన సింధూ నాగరికత వారసులు, ప్రకృతి ఆరాధకులైన ఆదివాసీలకు మతమే లేదు.

○ వజ్జ వెంకటేశ్వర్లు

'స్వదేశీ' నినాదం కాదు, విధానం కావాలి!

ఎర్రకోటమీద నుంచి ప్రధాని నోట 'స్వదేశీ' నినాదం వినిపించినందుకు సంతోషించాల్సిందే. మరి, దానిని ఆచరణ సాధ్యం చేయాల్సింది ఎవరు? ప్రజలు స్వదేశీకోసం పాటుపడాలంటున్నారు పాలకులు. కానీ, పాలకులే విదేశీ వస్తువులను ప్రజలకు అందుబాటులో ఉంచి, వాటిని వినియోగింపజేస్తున్నారు. స్వదేశీ వస్తువులేవో, విదేశీ వస్తువులేవో గుర్తించగలిగేంత పరిజ్ఞానం దేశంలోని వినియోగదారులందరికీ ఉంటుందా?!

'స్వదేశీ వస్తువులనే వినియోగించాలి' అన్న వాట్సాప్ మెసేజ్ కనపడినా లేదా నినాదం వినపడినా పౌరుల్లో జాతీయభావం ఉప్పొంగుతుంది. స్వయం సమృద్ధి కాంక్ష కనిపిస్తుంది. ఎర్రకోట నుంచి ఆ నినాదం వినిపించినప్పుడు చాలా మంది చప్పట్లు కొట్టారు. "స్వదేశీ' మాట మాట్లాడే ముందు విదేశాల నుంచి దిగుమతులు ఆపేయడానికి మనం సిద్ధమేనా?' అలా సిద్ధపడితే, అమెరికా అధ్యక్షుడు విధిస్తోన్న 50 శాతం టారిఫ్‌ల బాధలే ఉండవు. గత ఆర్థిక సంవత్సరంలో మన ఎగుమతులు రూ.68 లక్షల కోట్లు కాగా, దిగుమతులు రూ.76 లక్షల కోట్లు. నిజానికి ఎగుమతుల కన్నా దిగుమతులే ఎక్కువ. దాదాపు 8 లక్షల కోట్ల రూపాయలు!

మన వస్తువులను స్వీకరిస్తున్న దేశాలు కూడా స్వదేశీ నినాదాన్ని ఇస్తూ వాటిని అడ్డుకుంటే ఇక్కడి రైతులు, ఇతర ఉత్పత్తిదారుల పరిస్థితి ఏంటి? అదీ గాక మన దేశంలోకి దిగుమతి చేసుకుంటున్న వస్తువులను నిలిపేయడానికి ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయా? ఈ మధ్య కాలంలో రోడ్లపై తిరుగుతున్న విదేశీ కార్లలో బీవైడీ అనే చైనా ఎలక్ట్రిక్ కార్ బాగా పాపులర్ అయ్యింది. గతంలో ఎంజీ అనే కార్ కూడా చైనా నుంచి వచ్చినదే. ఇక హ్యుందాయ్, కియా, హోండా, టైటాలతో పాటు బీఎండబ్ల్యూ, మెర్సిడెస్ వంటి లగ్జరీ కార్ల సంస్థలన్నీ విదేశాలకు సంబంధించినవే. వీటి దిగుమతులను ప్రభుత్వం నిలిపేయగలదా? ఈ కార్ల దిగుమతి సుంకాల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం చేకూరుతోంది. మందుబాబుల మందు మొదలుకొని, ప్రాణాధార మందులు, చిన్న చిన్న ఆట వస్తువుల వరకు కూడా మనం భారీగా దిగుమతి చేసుకుంటున్నాం. ఈ దిగుమతుల ద్వారా మంచి ఆదాయం సమకూరుతోంది. దిగుమతులను నిలిపేయకుండా ప్రభుత్వ పెద్దలు, ప్రముఖులు, మేధావులు 'స్వదేశీ' నినాదాన్నిచ్చి, ప్రజలను స్వదేశీ వస్తువులే వినియోగించాలని ఎలా కోరగలరు? ఇది అర్థరహితం కాదా? విదేశీ బ్యాంక్‌లు, విదేశీ ఇన్సూరెన్స్ సంస్థలను వ్యాపారం చేసుకోమని దేశంలోకి ఆహ్వానించి, ఇప్పుడు స్వదేశీ కంపెనీలతో మాత్రమే మీ వ్యవహారాలు నడపండి అని ప్రజలకు ఈ పాలకులు పిలుపు ఇవ్వగలరా?


> నూతన ఆర్థిక విధానాలకు తలుపులు బార్లా తెరిచి, విదేశీ సంస్థలకు భారతదేశం ఆహ్వానం పలుకుతున్నదని చెప్పినది ప్రభుత్వాలా, ప్రజలా? ఇప్పటికీ ఎఫ్‌డీఐకి అర్రులు చాస్తూ ఆహ్వానిస్తున్నది ప్రజలా? ప్రభుత్వాలా?



నూతన ఆర్థిక విధానాలకు తలుపులు బార్లా తెరిచి, విదేశీ సంస్థలకు భారతదేశం ఆహ్వానం పలుకుతున్నదని చెప్పినది ప్రభుత్వాలా, ప్రజలా? ఇప్పటికీ ఎఫ్‌డీఐకి అర్రులు చాస్తూ ఆహ్వానిస్తున్నది ప్రజలా? ప్రభుత్వాలా? మనదేశంలో తయారైన సి-విటమిన్ ట్యాబ్లెట్లను కూడా (అమెరికా హెచ్చరించగానే) ఇక్కడి అవసరాలను కూడా లెక్కజేయకుండా అమెరికాకు ఎగుమతి చేసింది ఈ ప్రభుత్వాలే కదా. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్' అనుమతి లేనిదే విదేశీ వస్తువుల దిగుమతి జరుగుతుందా? మారిన పరిస్థితుల్లో ఆన్‌లైన్ వ్యాపారాలు పెరగడం వల్ల 'ఇంటర్నేషనల్ ఆన్‌లైన్ సప్లయింగ్ స్టోర్స్'ను ఏర్పాటు చేసింది ప్రభుత్వమే కదా?! ఇలాంటి వ్యాపార అభివృద్ధి కోసం 'ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్'ను, దాని కోసం 'ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్' అనే సంస్థను ఏర్పాటు చేసినది మన ప్రభుత్వమే కదా! వీటన్నిటినీ మించి ప్రభుత్వానికి రావాల్సిన నిధుల కోసం ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్ వ్యవహారాలను కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ చక్కబెట్టడం లేదా? అనేక వస్తువులను దిగుమతి చేసుకోనిదే పూట గడిచే పరిస్థితి లేని పరస్పర ఆధారిత ఆర్థిక వ్యవస్థలుగా దేశాల పరిస్థితిని మార్చింది ప్రభుత్వాల వ్యవహారాలేగా!

ఆర్థిక స్వయం సమృద్ధి సాధిస్తే దేశం రాజకీయ స్వేచ్ఛ సాధించే అవకాశం ఉన్నదని నాటి స్వాతంత్ర్య సమరయోధులు భావించి, స్వదేశీ నినాదాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. స్వదేశంలో అన్ని సమకూరాలంటే యువతకు ప్రత్యామ్నాయ ఉపాధి వృత్తివిద్యా కోర్సుల ద్వారా ఉపాధి చూపాలని నాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని మన నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పుడు ఇంజనీరింగ్ తప్ప ఇతర ఒకేషనల్ కోర్సులు ఏవీ ప్రత్యామ్నాయంగా అందుబాటులో లేవు. ప్రభుత్వాలు ఆ వైపు దృష్టి పెట్టడమే లేదు. స్వాతంత్ర్యానంతరం కూడా జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో విదేశీ కంపెనీలన్నింటినీ విలీనం చేసి స్వదేశీ సంస్థలుగా ఏర్పాటు చేశారు. ఇనుము, ఉక్కు కర్మాగారాలు, చమురు శుద్ధి కర్మాగారాలు స్థాపించుకోకపోతే మనుగడ అసాధ్యమని భావించి బ్రిటన్, రష్యా, వెస్ట్ జర్మనీ వంటి దేశాల సహకారంతో వాటిని మన దేశంలో స్థాపించారు. కాబట్టే నేడు ఉక్కును ఎగుమతి చేసే దేశాల్లో భారత్ అగ్రగామిగా ఉంది. 'మంగళ్ యాన్ మిషన్' సక్సెస్‌ఫుల్‌గా ప్రయోగిస్తున్న నేటి భారత్ '1962 నాటి స్వదేశీ విధానం'లో నిర్ణయమేనని మర్చిపోకూడదు. విదేశీ వస్తువులను బహిష్కరించాలనో, స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలనో పాలకులు నినాదాలు ఇవ్వడం కాదు, స్వదేశంలో మంచి నాణ్యమైన, చవకైన, ఇతర దేశాల వస్తువులతో పోటీపడగల స్థాయిలో వస్తూత్పత్తి మెరుగుపడాలి. ఆ రకమైన వాతావరణాన్నీ, పరిస్థితులనూ ఏర్పరచాలి, స్వదేశీని అన్ని విధాలుగా ప్రోత్సహించాలి. తద్వారా విదేశీ వస్తువులు వాటంతటవే దిగుమతి కావడం ఆగిపోతాయి.

◆ జి. తిరుపతయ్య



వేయిస్తంభాల గుడి సాక్షిగా ప్రకృతి గర్జనను క్లిక్‌మనిపించిన చిత్రం

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

భావోద్వేగాలు ఉప్పొంగినప్పుడు...
ధర్మాగ్రహాలు పిడికిళ్లెత్తినప్పుడు..
కన్నీళ్లు వర్షించినప్పుడు..
ఆనందాలు అంబరాన్ని తాకినప్పుడు..
ప్రకృతి పరవశంతో తుళ్లిపడినప్పుడు...
పంచభూతాలు పంజా విసిరినప్పుడు..
అతివ ముగ్ధమనోహరమై మురిపించినప్పుడు
అబల 'ఆకాశంలో సగమై' విస్తరించినప్పుడు
ఆ.. దృశ్యాలు అదృశ్యాలు కాకమునుపే
అవి జ్ఞాపకాలై కాలగతిలో కలిసిపోక మునుపే
క్లిక్ క్లిక్ మంటూ మెరిసే కాంతిరేఖలు
వాటికి శాశ్వతత్వం చేకూరుస్తాయి..
గుండెల్లో చిరకాలం పదిలపరుస్తాయి!
చరిత్రను చెరిగిపోని చిత్రమాలిక చేసిన
ఓ మా 'ఫొటోగ్రఫీ'.. నీకు వేన వేల వందనాలు!

7



మేడారం జంపన్న వాగులో యువతుల భక్తిపారవశ్యాన్ని ఒడిసిపట్టిన చిత్రం



కలెక్టర్ రావాలని కోరుతున్న బీసీ సంఘాల నాయకులు

పాపన్న జయంతి సభలో నిరసన సెగలు

- కలెక్టర్ రాకపోవడంతో బీసీ సంఘాల ఫైర్
- గొడవ తెలుసుకొని వచ్చి నివాళులర్పించిన కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రభుత్వం తరఫున బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు రసాభాసగా మారాయి. ఈ సందర్భంగా గౌడ సంఘం, బీసీ సంఘాల నాయకులు పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అయితే ప్రభుత్వం తరఫున నిర్వహించే పాపన్న జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ రాకపోవడంతో వివిధ బీసీ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. కలెక్టర్ రావాలని ఆందోళన చేయడంతో కలెక్టర్ స్నేహ శబరీష్ వచ్చి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరిగౌడ్, బీసీ జాక్ ఛైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్, కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు చిర్ర రాజు మాట్లాడుతూ.. దాదాపు 300 సంవత్సరాల క్రితమే సబ్బండ వర్గాలైన 12మంది సైన్యంతో మొదలైన గెరిల్లా యుద్ధం దాదాపుగా 1200 మంది సైన్యాన్ని తయారు చేసుకుని ఆనాటి మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి దాదాపుగా 22 కోటలు నిర్మించిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని నెలకొల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, డీఆర్‌డీవో మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్‌డీవోలు, బీసీ వెల్ఫేర్ అధికారితో పాటు స్థానిక కార్పొరేటర్ మానస, బీసీ సంఘం నాయకులు శ్యాం, విజయ్, శ్రీనివాస్, చందా మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, బీసీ సంఘాల నాయకులు

'సైన్స్ కాంగ్రెస్'కు సర్వం సిద్ధం

కేయూలో నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ



తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాలకు ముస్తాబవుతున్న కేయూ ఆడిటోరియం

- శాస్త్ర, సాంకేతిక అంశాలపై మేధోమథనం
- ప్లీనరీలు.. ఆవిష్కరణలు.. సాంస్కృతిక ప్రదర్శనలు..
- ప్రారంభోత్సవంలో పాల్గొననున్న కేంద్ర రక్షణ శాఖ సలహాదారు సతీశ్‌రెడ్డి
- హాజరుకానున్న శాస్త్రవేత్తలు, యువ పరిశోధకులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాలకు కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ ముస్తాబైంది. కేయూ ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభ వేడుకలకు కేంద్ర ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ సలహాదారు, డీఆర్‌డీఓ పూర్వ ఛైర్మన్ జి.సతీశ్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలక్రిష్ణారెడ్డి, హైదరాబాద్ సీసీఎంబీ మాజీ డైరెక్టర్, టీఏఎస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సీహెచ్. మోహన్‌రావు, కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, ఉస్మానియా వర్సిటీ మాజీ వీసీ, టీఏఎస్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, టీఏఎస్ ఎగ్జిక్యూటివ్ కన్వీనర్, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, టీఏఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ట్రెజరర్ ప్రొఫెసర్ ఎస్ఎం రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ భైరు వెం కట్రామిరెడ్డి హాజరుకానున్నారు. ఈ నెల 21న సాయంత్రం జరిగే వీడ్కోలు సదస్సులో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా, కడప యోగి వేమన వర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎ.రామచంద్రారెడ్డి, రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ ఎ.శ్రీదేవసేన, ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు. మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సైన్స్ కాంగ్రెస్ ప్లీ నరీల్లో శాస్త్ర, సాంకేతిక అంశాలపై నిపుణులు మేథోమధనం చేస్తారు. కాకతీయ యూనివర్సి టీ, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ సంయుక్తంగా ఈ సంబురాలను నిర్వహిస్తున్నాయి. 'సాధికారత కోసం వినూత్న నైపుణ్యాలు, శాస్త్ర సాంకేతికతో యువ భారతాన్ని రూపాంతరం చెందేలా తోడ్పాటును అందించడం' అనే నినాదాన్ని

(మిగతా 6వ పేజీలో...)



జనం చెంతకు సైన్స్

- ప్రతిష్ఠాత్మకంగా 'తెలంగాణ సైన్స్ కాంగ్రెస్'
- వచ్చే ఏడాది వరకు కేయూ స్వర్ణోత్సవాల నిర్వహణ
- వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

6

ఇంతింతై వటుడింతై..

- ఖండాంతరాలకు విస్తరించిన కేయూ ఖ్యాతి
- వేలాది మంది జీవితాలకు దిక్సూచి
- 4 నుంచి 29 విభాగాల వరకు విస్తరణ
- ఉత్తర తెలంగాణ విద్యావికాసంలో కీలకపాత్ర
- నేడు 50వ యేడులోకి ప్రవేశం
- నేటి నుంచి ఏడాది పాటు స్వర్ణోత్సవాలు

7



మంగపేట మండలం కమలాపురం ఇందిరా కాలనీలో వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సీతక్క

అప్రమత్తంగా ఉండాలి

- గోదావరి వరద ఉధృతి పెరిగే అవకాశం
- లోతట్టు ప్రాంతాల వారు నష్టపోకుండా చర్యలు : మంత్రి దనసరి సీతక్క
- రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతి పరిశీలన

ఏటూరునాగారం రూరల్/ఏటూరునాగారం/తాడ్వాయి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లాలో కురుసున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతితో పాటు గోదావరికి వరద తాకిడి పెరుగుతున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. సోమవారం ఏటూరునాగారం, తాడ్వాయి, మంగపేట మండలాల్లో ఆమె పర్యటించారు. ఏటూరునాగారం, రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి ప్రవాహాన్ని మంత్రి పరిశీలించారు. తాడ్వాయి మండలంలోని మేడారం జంపన్నవాగును ఆమె పరిశీలించారు. ఏటూరునాగరాం రామన్నగూడెం పుష్కర ఘాట్ వదకు చేరుకొని గోదావరి వరద ఉధృతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎగువ ప్రాంతాల్లోంచి వరద గోదావరికి భారీగా చేరుతుండడంతో గోదావరి మరింతగా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతానికి గోదావరి నిలకడగానే ఉందని, మరల వరద తాకిడి పెరిగితే గోదావరి పెరుగుతుందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరితో పాటు మండలంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. మేడారం జంట వంతెనల వరద ఉధృతిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో దెబ్బతిన్న ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆమె వెంట ఇరిగేషన్ అధికారులు ఉన్నారు. మంత్రి వెంట ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ రవీందర్, ఇరిగేషన్ డీఈ సదయ్య, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన బానోతు రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

తూముల వాగులో మహిళ మృతి

తాడ్వాయి మండలంలోని కాల్వపల్లి గ్రామ శివారు తూములవాగులో ప్రమాదవశాత్తు పడి మహిళ మృతి చెందింది. వివాహిత సోలం గౌరమ్మ(40) ఆదివారం రాత్రి బహిర్భూమికి వెళ్లింది. తెల్లవారే సరికి ఇంట్లో కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఈక్రమంలో ఇంటి సమీపంలోని తూములవాగు పక్కన మృతదేహం గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ఒకటే ముసురు

ఇరు జిల్లాల్లో మోస్తరు వర్షం

జన జీవనానికి అంతరాయం

హనుమకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాలో గత 24గంటల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. ఉదయం నుంచి ముసురు పడుతూనే ఉంది. అడపా తడపా తేలికపాటి వర్షం కురిసింది. హనుమకొండ జిల్లాలో సరాసరి 3.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఐనవోలు మండలంలో 13.5 మి.మీ. వర్షం కురవగా భీమదేవరపల్లిలో 1.2 మి.మీ., వేలేరులో 1.5 మి.మీ., ఎల్కతుర్తిలో 1.9 మి.మీ., కమలాపూర్‌లో 0.5 మి.మీ., హసన్‌పర్తిలో 2.1 మి.మీ., ధర్మసాగర్‌లో 2.2 మి.మీ., కాజీపేటలో 1.4 మి.మీ., హనుమకొండలో 4.8 మి.మీ., పరకాలలో 5.8 మి.మీ., దామెరలో 4.5 మి.మీ., ఆత్మకూరులో 2.7 మి.మీ., శాయంపేటలో 3.5 మి.మీ., నడికుడలో 1.9 మి.మీ. వర్షం కురిసింది. కాగా వరంగల్ జిల్లాలో సరాసరి 10.5 మి.మీ. వర్షపాతం రికార్డయింది. ఖానాపూర్‌లో 20.8 మి.మీ., దుగ్గొండిలో 17.8 మి.మీ. వర్షం పడింది. నల్లబెల్లిలో 17.7 మి.మీ., చెన్నారావుపేటలో 16.3 మి.మీ., నర్సంపేటలో 12.3 మి.మీ., గీసుకొండలో 10.3 మి.మీ., వరంగల్‌లో 8.7 మి.మీ., ఖిలా వరంగల్‌లో 7.5 మి.మీ., నెక్కొండలో 7 మి.మీ., సంగెంలో 6.9 మి.మీ., పర్వతగిరిలో 5.3 మి.మీ., వర్ధన్నపేటలో 4.8 మి.మీ., రాయపర్తిలో 10.5 మి.మీ. వర్షం కురిసింది.

యూరియా రగడ

- పలుచోట్ల బస్తాల కోసం రోడ్డెక్కిన రైతులు
- జాతీయ రహదారులపై ధర్నాలు, రాస్తారోకోలు
- నిలిచిపోయిన వాహనాల రాకపోకలు
- గూడూరులో పోలీసుల జోక్యంతో ఉద్రిక్తత
- బస్తాలు సరిపడా ఇవ్వడం లేదని రైతుల ఆరోపణ



ఎల్కతుర్తిలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు



గూడూరులో రాస్తారోకో ప్రదేశంలో కర్రతో హెచ్చరిస్తున్న మహిళా రైతు

ఎల్కతుర్తి/గూడూరు/చెన్నారావుపేట/స్టేషన్ ఘన్‌పూర్/పాలకుర్తి/నెల్లికుదురు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో పంటల సాగుకు సరిపడా యూరియా దొరకక పోతుండటంతో ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల రైతులు రోడ్డెక్కి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారులపై బైఠాయించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. యూరియా కొరతపై రైతులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. పోలీసుల జోక్యంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలో 100 శాతం యూరియాను అందుబాటులో ఉంచాల్సిన అధికారులు కేవలం 46 శాతం అందించడంలో తీవ్ర కొరత ఏర్పడింది. రోజుల తరబడి ఎల్కతుర్తి సొసైటీకి క్యూకట్టినా యూరియా లభించకపోవడంతో ఆగ్రహించిన సుమారు 100 మందికి పైగా రైతులు సోమవారం హనుమకొండ-కరీంనగర్ ఎన్‌హెచ్-563పైకి చేరుకుని ద్విచక్ర వాహనాలను రోడ్డుకు అడ్డుగా పెట్టి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గంట పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో సంఘటన స్థలానికి ఎస్సై అకినేపల్లి ప్రవీణ్‌కుమార్, ఏవో రాజ్‌కుమార్ చేరుకున్నారు. విషయాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన యూరియాను రైతులకు అందుబాటులోకి తీసుకు వస్తామని తెలుపడంతో ఆందోళన విరమించారు. మంత్రి ఆదేశాలతో గంట వ్యవధిలో యూరియా లారీ ఎల్కతుర్తి సొసైటీకి చేరుకోవడంతో

(మిగతా 6వ పేజీలో...)

గూడూరులో రోడ్డెక్కిన రైతులు

గూడూరు (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం 365 జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై బైఠాయించిన రైతులు కలెక్టర్ తమ వద్దకు రావాలని, యూరియా బస్తాలను వెంటనే ఇవ్వాలని, కేంద్ర, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న గూడూరు సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డి, ఏవో అబ్దుల్‌మాలిక్ రైతులు రాస్తారోకో చేస్తున్న ప్రదేశానికి చేరుకున్నారు. అధికారులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా రైతులు వినకపోవడంతో సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్ రెడ్డి పోలీస్ సిబ్బంది బలవంతంగా రైతులను అక్కడి నుంచి పంపించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు. గూడూరు సొసైటీకి రెండు రోజుల క్రితం 390 మంది రైతులకు 390 బస్తాల యూరియా అందించేందుకు టోకెన్లను ఇచ్చారు. సోమవారం ఉదయం యూరియా వస్తుందని ప్రచారం జరగడంతో తెల్లవారుజాము నుంచే రైతులు భారీ సంఖ్యలో సొసైటీ వద్దకు చేరుకున్నారు. ఎంత సేపటికి యూరియా రాకపోవడంతో ఆగ్రహించిన రైతులు గూడూరు జాతీయ రహదారికి చేరుకుని రాస్తారోకో నిర్వహించారు.

రుణం పేరుతో 'సైబర్' వల

రూ.6.66 లక్షలు అర్పించుకున్న యువకుడు

శాయంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పెద్ద మొత్తంలో అప్పు ఇస్తామంటే నమ్మిన ఓ యువకుడు అపరిచిత లింకులు క్లిక్ చేశాడు. విడతల వారీగా రూ.లక్షల్లో చెల్లింపులు చేశాడు. చివరకు తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళితే... హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన గోలి అఖిల్ రెడ్డి అనే యువకుడు ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. 2024 జూన్ నెలలో ఫేస్‌బుక్ ద్వారా రిలయన్స్ ఫైనాన్స్ లోన్, ధని ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ లోన్ అనే రెండు లింకులను క్లిక్ చేశాడు. దీంతో రుణం తీసుకోవడానికి ఆసక్తి ఉందా.. అని రాగా, అవును అని రిప్లై ఇచ్చాడు. ఇందుకుగాను రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తర్వాత అతనికి ఓ నంబర్ నుంచి వాట్సాప్ మెస్సేజ్ రాగా, ఆ నెంబర్‌కు తన వ్యక్తిగత వివరాలు ఆధార్, పాన్‌కార్డు, ఫొటోలు పంపాడు. అనంతరం జూలై నెలలో అఖిల్‌కు రిలయన్స్ ఫైనాన్స్ లోన్ నుంచి కాల్ వచ్చింది, ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి అఖిల్‌కు రూ.15 లక్షల రుణానికి అర్హత ఉందని చెప్పాడు. ఇందుకుగాను ప్రాసెసింగ్ ఫీజు, నాలుగు నెలల ఈఎంఐలు, ఆర్‌బీఐ చార్జెస్ చెల్లించాలని అన్నాడు.

ఈ మేరకు అఖిల్ తన ఖాతా నుంచి రమేష్, మనోజ్.ఆర్ సింగ్, ముడెసాథ్ అనే పేరు గల వ్యక్తులకు విడతల వారీగా రూ.3,22,870 ట్రాన్స్‌ఫర్ చేశాడు. అలాగే ధని ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రుణం కోసం వేర్వేరు తేదీలలో వేర్వేరు ఖాతాలకు తన ఖాతా నుంచి రూ.3,43,226 ట్రాన్స్‌ఫర్ చేశారు. మొత్తంగా రిలయన్స్, ధని ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేర్లతో వేర్వేరు వ్యక్తులకు రూ.6,66,096 పంపించాడు. అనంతరం రుణం రాకపోవడం, ఎవరూ స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి గతేడాది సెప్టెంబర్ 10న సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. ఎలాంటి పరిష్కారం కాకపోవడంతో ఇటీవల శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టర్ స్నేహ శబరీష్ ● ప్రజావాణికి 185 వినతులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న స్వాతంత్ర్య సమరయోధుడు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యలపై 185 వినతులు వచ్చాయి. వినతులను కలెక్టర్ పరిశీలించి సంబంధిత శాఖ అధికారులను పిలిచి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, డీఆర్‌డీవో మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్‌డీవోలు, ఇతర జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంట ఆలస్యంగా ప్రజావాణి

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు కలెక్టరేట్‌లోని ప్రజావాణి జరిగే హాల్‌లో నిర్వహించడంతో ఉదయం 10:30గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణి గంట ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో ప్రజావాణికి వచ్చిన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ ఇప్పించాలి

గత కొన్ని సంవత్సరాలుగా స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ ఇప్పించాలని కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ ఇప్పించాలని చింతగట్టుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు బిల్లా ప్రతాప్‌రెడ్డి సోమవారం కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో ప్రతాప్‌రెడ్డి మంత్రి కొండా సురేఖను నిలదీయగా సోమవారం ప్రజావాణికి రావాలని ఆమె సూచించడంతో ప్రతాప్‌రెడ్డి సామాజికవేత్త రిటైర్డ్ సూపరింటెండెంట్ తాళ్లపల్లి రామస్వామి గౌడ్ సహకారంతో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన కలెక్టర్ పెన్షన్ వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జనరిక్ మందులు రాసేలా చర్యలు తీసుకోవాలి

జనరిక్ మందుల ప్రమోషన్లకై చర్యలు తీసుకోవాలని తెలంగాణ హాస్పిటల్స్-పేరెంట్స్ కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బి.సతీష్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్‌లు కలెక్టర్ స్నేహ శబరీషకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2011లో జారీ చేసిన జీవోఎంఎస్ నంబర్ 54, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 2016లో జారీ చేసిన నోటిఫికేషన్ పార్ట్3 సెక్షన్ 4 ప్రకారం మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ అయిన ప్రతీ డాక్టర్ రాసే మందులను జనరిక్ పేర్లతో మాత్రమే రాయాలని నిబంధన ఉన్నప్పటికీ చాలా మంది డాక్టర్లు రాయడం లేదని ఫిర్యాదులో తెలిపారు.

ఆర్‌డీవోపై చర్యలు తీసుకోవాలి

వృద్ధ, దంపతులు నారాయణ శాంతమ్మ

తమకు ఉన్న 5ఎకరాల భూమిని కొడుకులకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామని, ఇప్పుడు కొడుకులు పట్టించుకోకపోవడంతో ఆ భూమి మాకు ఇప్పించాలని రాంపూర్‌కు చెందిన వృద్ధ దంపతులు చందరాజు నారాయణ శాంతమ్మలు కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు.సమస్య పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించినా ఆర్‌డీవో పట్టించుకోకుండా న్యాయం చేయడం లేదని, కొడుకులకే ఆర్‌డీవో సపోర్టు చేస్తున్నాడని వృద్ధ దంపతులు కలెక్టర్‌కు తెలిపారు. 3 నెలల నుంచి కలెక్టరేట్ చుట్టూ, ఆర్‌డీవో చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని ఇప్పటికైనా స్పందించి ఆర్‌డీవోపై, తమ కొడుకులపై చర్యలు తీసుకుని మాభూమి ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

న్యాయం చేయాలని కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధ దంపతులు →



ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి

బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వారం ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు దృష్టి సారించాలని, ప్రజల సమస్యలకు సానుకూల స్పందన ఇచ్చినప్పుడే మునిసిపల్ శాఖపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కరించాలని ఆయా విభాగాల ఉన్నతాధికారులకు కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడారు. నగరంలో శానిటేషన్ సమస్య చాలా చోట్ల కనిపిస్తుందని ప్రజలు ఫిర్యాదులు అందించక ముందే బాధ్యతగా పని పూర్తి చేయాలన్నారు.

పలు కాలనీలలో చెత్త కుండీల నుంచి చెత్త తరలించడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, మరో మారు ఫిర్యాదులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పన్నుల విభాగాలపై ప్రతీ వారం తరుచుగా ఫిర్యాదులు అందుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు రిపీట్ కాకుండా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెంది ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తాయని మలేరియా విభాగం సిబ్బంది విధిగా పని చేయాలన్నారు. ఇంకా ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరిగితే యజమానులను గుర్తించి నోటీసులు జారీ చేయాలన్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు సోమవారం ప్రజావాణికి వచ్చేందుకు ప్రజలు మొగ్గు చూపలేదు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 81 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, వెటర్నరీ అధికారి గోపాల్‌రావు, సీహెచ్‌వో రమేష్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి తో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ - 13, హెల్త్, శానిటేషన్ - 8, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 13, టౌన్‌ప్లానింగ్ - 41. ఎలక్ట్రికల్ - 2. మంచి నీరు - 2, హార్టికల్చర్ - 2 ఇలా మొత్తం 81 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా..

- గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ చింతగట్టు గ్రామంలో రెండు సంవత్సరాల క్రితం శ్మశాన వాటిక కోసం రూ. 18 లక్షలు మంజూరు అయ్యాయి. ఇప్పటి వరకు శ్మశాన వాటిక పనులు మొదలుపెట్టలేదు. దీనిపై స్థానిక కార్పొరేటర్ సంబంధిత అధికారులు స్పందించి శ్మశాన వాటిక పనులు ప్రారంభించాలని గ్రామస్థులు కమిషనర్‌ను కోరారు.
- హనుమకొండ టీచర్స్ కాలనీ ఫేజ్ -2 వడ్డెపల్లిలో రోడ్డు నెంబర్ 2, 5లో గత 30 సంవత్సరాల క్రితం 30 ఫీట్ల రోడ్డును వదిలి ఇండ్లు నిర్మించుకున్నాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏలాంటి సమస్య లేదు. కానీ ఇటీవల ఓ వ్యక్తి ఇందిరమ్మ ఇంటి పేరుతో రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నాడు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు విన్నవించారు.
- కాజీపేట పోస్టాఫీస్ ఎదుట రోడ్డుపై ఆర్టీసీ బస్సుతో పాటు కూరగాయల షాపులు ఉన్నాయి. ప్రతీ రోజు అక్కడి నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. బస్సు చాలా కాలంగా నిలిపి ఉంచడం, రోడ్డుపై వ్యాపారాలు చేయడం వల్ల చాలా ఇబ్బందిగా మారిందని ప్రజలు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

ప్రజావాణి వినతులు పెండింగ్‌లో ఉండొద్దు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన వినతులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతులను వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. మొత్తం 92 వినతులు అందగా వాటిని శాఖల వారీగా ఎండార్స్ చేశారు. ఇందులో రెవెన్యూ శాఖకు 33 వినతులు, జీడబ్ల్యూఎంసీకి 18, హౌసింగ్ పీడీకి 9, డీఆర్‌డీవోకు 2, డీఎంహెచ్‌వోకు 4, విద్యా శాఖకు 4, వివిధ శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రెవెన్యూ, పోలీసు, మునిసిపల్, వైద్య ఆరోగ్యశాఖ, రోడ్లు, రవాణా తదితర శాఖల అధికారులు పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, హౌసింగ్ పీడీ గణపతి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అనురాధ, డీపీవో కల్పన, డీసీవో నీరజ, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆదేశాలు

పాపన్న ఆశయాలను కొనసాగించాలి

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ఆయన చూపిన ధైర్యం, తెగువ, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం అందరికీ ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి ఎ.పుష్పలత, 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జనం చెంతకు సైన్స్

● ప్రతిష్ఠాత్మకంగా 'తెలంగాణ సైన్స్ కాంగ్రెస్'
● వచ్చే ఏడాది వరకు కేయూ స్వర్ణోత్సవాల నిర్వహణ
● వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సైన్స్‌ను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా కేయూ ఈ దఫా తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, టీఏఎస్-25 అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ సీహెచ్.మోహన్‌రావు, ప్రొఫెసర్ వి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం కేయూ కామర్స్ సెమినార్ హాల్‌లో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సు వివరాలను వారు వెల్లడించారు.

వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కేయూ, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సంయుక్తంగా మూడు రోజుల పాటు సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కేయూ 50వ వసంతోత్సవంలోకి అడుగిడుతున్న సందర్భంగా సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అకడమిక్, పరిశోధన, మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాధాన్యంగా స్వర్ణోత్సవాలు నిర్వహిస్తామన్నారు. వచ్చే ఏడాది ఆగస్టు 19 వరకు సంబురాలు జరుగుతాయని తెలిపారు. కేయూలోని కె-హబ్‌ను టీ-హబ్‌తో అనుసంధానం చేసి జాతీయ స్థాయిలో గుర్తింపుకు ప్రయత్నిస్తామన్నారు. వర్సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వ అనుమతి కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

లోకల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణ మంత్రిత్వశాఖ సలహాదారు జి.సతీశ్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నతా విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్టారెడ్డి ప్రారంభోత్సవ సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. మూడు రోజుల పాటు జరిగే సైన్స్ కాంగ్రెస్‌లో 65 ముఖాముఖి కార్యక్రమాలతో పాటు ఐదుగురు సీనియర్ ప్రొఫెసర్లు, ల్యాబ్స్ డైరెక్టర్లు రెండు ప్లీనరీ సెషన్లలో కీలక ప్రసంగం చేస్తారని వెల్లడించారు. 750 రీసెర్చ్ పేపర్లు, 626 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు. స్కూల్ స్టూడెంట్స్‌తో శాస్త్రవేత్తల ముఖాముఖి ఏర్పాటు చేసి ప్రాజెక్టు ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తామన్నారు.

హైదరాబాద్ సీసీఎంబీ మాజీ డైరెక్టర్, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సీహెచ్. మోహన్‌రావు మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో సైన్స్ అండ్ టెక్నాలజీ కీలకమన్నారు. స్కూల్ విద్యార్థులకు ప్రేరణ కల్పించేందుకు సైన్స్ కాంగ్రెస్‌లో ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, టీఏఎస్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వరలక్ష్మి, ప్రొఫెసర్ వడ్డె రవీందర్, వెబ్‌సైట్ ఇన్‌చార్జి, కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ బి. రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

వరంగల్ లీగల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగారా శిక్ష, రూ. 15 వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కం ఫోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి బి. అపర్ణాదేవి సోమవారం తీర్పుచెప్పారు. కేసులో బాధితురాలికి రూ. 5 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చెరువు కొమ్ముల తండా చెందిన వాంకుడోత్ చంద్రశేఖర్ కాజీపేట డీజిల్ కాలనీకి చెందిన బాలికతో తరచూ మాట్లాడుతుండేవాడు. ఈ క్రమంలో బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లో ఎవరు లేని సమయంలో అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు తన తల్లికి చెప్పడంతో సుబేదారి పోలీసులకు బాధితురాలి తల్లి నిందితుడిపై ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడిపై అత్యాచారం, ఫోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలుచేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 15 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎ. సుధాకర్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారిగా సీఐ జి. మహేందర్ రెడ్డి వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

క్రైం డీసీపీగా గుణశేఖర్ బాధ్యతలు

వరంగల్ క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం విభాగం నూతన డీసీపీగా గుణశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీగా పనిచేస్తున్న గుణశేఖర్‌ను ప్రభుత్వం ఇటీవలే వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం డీసీపీగా బదిలీ చేయగా సోమవారం విధుల్లో చేరాడు. ఈ సందర్భంగా డీసీపీని పలువురు అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు.

'సైన్స్ కాంగ్రెస్'కు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

ఈ దఫా థీమ్‌గా తీసుకున్నారు. సైన్స్, టెక్నాలజీలో విజ్ఞాన మార్పిడి, నూతన ఆవిష్కరణలపై మూడు రోజుల పాటు చర్చలు చేపడతారు. మంగళవారం (ఆగస్టు 19) స్వర్ణోత్సవ సంబురాల్లోకి కేయూ అడుగిడుతున్న సందర్భంలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

ముస్తాబైన ఆడిటోరియం..

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభోత్సవ ఘట్టానికి యూనివర్సిటీ ఆడిటోరియం వేదిక కానుంది. దీని కోసం ఇప్పటికే ఆడిటోరియంను సుందరంగా తీర్చిదిద్దారు. ప్రారంభోత్సవం తర్వాత జరిగే కీలకమైన 5 ప్లీనరీలను ఆడిటోరియంలోనే నిర్వహిస్తారు. ప్రముఖ శాస్త్రవేత్తలు, దేశంలో పేరెన్నికగల పరిశోధన సంస్థల డైరెక్టర్లు హాజరై శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి, భవిష్యత్ పరిశోధనలపై దిశా నిర్దేశం చేస్తారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలర్ మాలిక్యూలర్ బయోలజీ (సీసీఎంబీ) డైరెక్టర్ కె.వినయ్‌కుమార్ నందికూరి, బెంగళూరులోని ఎల్‌ఆర్‌డీఈ (డీఆర్‌డీఏ) డైరెక్టర్ జి.విశ్వం, ఢిల్లీ, కేరళ త్రివేంద్రంలోని డీఆర్‌డీఏ డైరెక్టర్ మార్త ఎన్ రెడ్డి, ఎన్‌వీ చలపతి, హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ ఎస్.రఘురాం కీలక ప్రసంగాలు చేస్తారు. వీరితో పాటు ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్, ఇంజనీరింగ్, లైఫ్ సైన్సెస్, ఫార్మసీ, కెమిస్ట్రీ, జియాలజీ విభాగాల్లో నిష్ణాతులైన వాసు సింగూరి, ప్రొఫెసర్ జ్ఞానేశ్వర్, వరంగల్ నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధి, డీఎన్ రామకృష్ణ, ప్రొఫెసర్ మోరె రాములు, ప్రొఫెసర్ కె.రాజిరెడ్డి, ప్రొఫెసర్ డి.సాంబరెడ్డి, ఏఆర్‌సీ రెడ్డి ప్లీనరీలకు హాజరుకానున్నారు.

కలెక్టర్లు దృష్టి సారించాలి

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం పంట సాగుకు అవసరమైన యూరియా రైతులకు చేరేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణరావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం రూ. లక్షా 13 వేల కోట్లు వెచ్చించిందన్నారు. రైతులు ప్రస్తుత అవసరాల మేరకు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలన్నారు. పరిశ్రమలకు యూరియా డైవర్ట్ కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

కాగా, యూరియా కొరత సృష్టించినట్లయితే చర్యలు తప్పవని, యూరియా నిల్వలపై నివేదికలు సమర్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించామని అన్నారు. జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, పోలీసు అధికారులు యూరియా నిల్వలపై పర్యవేక్షణ చేస్తున్నారని, ఎక్కడా సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నారని కలెక్టర్లు మంత్రికి వివరించారు.

హనుమకొండ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ స్నేహ శబరీష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. వరంగల్ నుంచి కలెక్టర్ సత్యశారద, డీసీపీ అంకిత్ కుమార్, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, మండలాల ప్రత్యేకఅధికారులు పాల్గొన్నారు.

మైక్రోబయాలజీ నూతన విభాగాధిపతిగా సుజాత

కేయూ క్యాంపస్ ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కేయూ మైక్రోబయోలజీ నూతన విభాగాధిపతిగా డాక్టర్ ఎడ్ల సుజాత నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు .ఇప్పటి వరకు విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ పి.వెంకటయ్య నుంచి మైక్రోబయాలజీ విభాగం చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుజాతను మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్ ముంజం శ్రీనివాస్, డాక్టర్ వెంకటగోపినాథ్, డాక్టర్ సూర్యం తదితరులు అభినందించారు.

యూరియా రగడ

(5వ పేజీ తరువాయి)

భారీగా రైతులు క్యూకట్టి బస్తాలను తీసుకెళ్లారు.


పలుచోట్ల...

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద సోమవారం రైతులు రాస్తారోకో చేశారు. ప్రధాన రహదారిపై మూడు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. వరి నాట్లకు యూరియా కోసం రైతులు ఉదయం నుంచి పడిగాపులు కాశారు. యూరియా దొరకక పోవడంతో రైతులు వెళ్లిపోయారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్‌లో సొసైటీ వద్ద సోమవారం రైతులు యూరియా కోసం బారులు తీరి కనించారు. గ్రామానికి లారీలో 440బస్తాల యూరియా రాగా, ఉదయం నుంచి వర్షంలోనూ క్యూలైన్‌లో వేచి ఉన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సోమవారం మండలకేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రం వద్దకు పెద్దఎత్తున రావడంతో రైతులు బారులు తీరాల్సిన పరిస్థితి వచ్చింది. అలాగే పాలకుర్తి మండల కేంద్రంలోని ఎఫ్ఎస్‌సీఎస్ (రైతు సేవా సహకార పరపతి సంఘం) ఎదుట యూరియా కోసం రైతులు బారులు తీరారు. మొత్తం 1100 యూరియా బస్తాలు మాత్రమే రావడంతో 15 వందల మందికి పైగా రైతులు సంఘానికి చేరుకున్నారు. క్యూలైన్‌లో గంటల తరబడి వేచి ఉన్న కొందరికే యూరియా బస్తాలు అందడంతో నిరాశతో వెనుదిరిగారు. ఎకరానికి నాలుగు యూరియా బస్తాలు ఇవ్వాల్సి ఉండగా, ఎంత భూమి ఉన్న రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారని రైతులు వాపోయారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి అరెస్టు


వివాహితతో వివాహేతర సంబంధంతో ఆమె భర్త ఆత్మహత్య

వాజేడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నలుగురికి మంచి చెప్పాల్సిన ఉపాధ్యాయుడు పక్క దారి పట్టి కటకటాలపాలయ్యాడు. విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు ఓ వివాహితతో సంబంధం పెట్టుకొని ఆమె భర్త మరణానికి కారణమయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూడగా సదరు ఉపాధ్యాయుడు జైలుకు వెళ్లాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బిజినేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వాంకోడుతు బావుసింగ్‌ది భద్రాద్రి కొత్తగుడెం జిల్లాలోని సూర్యతండా. కొన్ని సంవత్సరాలుగా మండలంలోని బిజినేపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగుడెం జిల్లాకు చెందిన ఓ వివాహిత పరిచయం కాగా ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం సదరు మహిళ భర్తకు తెలిసి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సెల్ఫీ వీడియో, సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదు చేసుకున్న కొత్తగుడెం పోలీసులు ఆత్మహత్యకు కారణమైన బావుసింగ్‌ను ఈ నెల 11వ తేదీన పాఠశాలకు వెళుతున్న సమయంలో వెంకటాపురంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో సదరు మహిళ సైతం అరెస్టు అయినట్లు సమాచారం. బావ్ సింగ్‌కు వివాహం జరగగా పెళ్లైన కొన్ని నెలలకే అతడి ప్రవర్తన నచ్చక భార్య విడిగా ఉంటోంది. ఆమె కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలే. ఇదిలావుండగా, బావ్‌సింగ్ అరెస్టు అయిన సంఘటనను విద్యాశాఖ అధికారులు గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జైలుకు వెళ్లిన బావ్‌సింగ్‌పై ఇంత వరకు శాఖాపరమైన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.







శాశ్వత జ్ఞాపకం ఫొటో!

- కాలంతో పాటు మారుతూ వస్తున్న ఫొటోగ్రఫి రంగం
- సెల్‌ఫోన్‌లో బంధించే అవకాశం రావడంతో మరింత ప్రాచుర్యం
- క్లిక్‌మనే శబ్దం లేని కార్యక్రమమే లేదిప్పుడు..
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా మారిన అత్యాధునిక టెక్నాలజీతో సెల్ ఫోన్లలో సైతం ఫొటోలు తీసే అవకాశం రావడంతో ఫొటోగ్రఫి రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతీ వ్యక్తి ఫొటోగ్రాఫర్‌గా అవతారమెత్తి అద్భుతమైన ఫొటోలు తీస్తూ చెరిగిపోని జ్ఞాపకాలుగా మలుస్తున్నారు. ఒకప్పుడు పెద్ద నగరాలు, పట్టణాలకే పరిమితమైన ఫొటోగ్రఫి.. క్రమంగా విస్తరించి గ్రామాలకూ అందుబాటులోకి వచ్చింది.

ఫొటోకు అంకురార్పణ

ప్రపంచ చరిత్రలో ఆగస్టు 19న మొట్టమొదటి ఫొటోకు అంకురార్పణ జరిగింది. 1839లో ఫ్రాన్స్‌కు చెందిన దాగూరే అనే శాస్త్రవేత్త గాజుపలకపై కొన్ని రసాయనాలు పోసి దానిని ఛాయాచిత్రంగా రూపొందించాడు. అప్పటి నుంచి ప్రతీ ఏటా ఆగస్టు 19ని ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆనాటి నుంచి ఫొటోగ్రఫి కాలనుగుణంగా అనేక రూపాంతరాలు చెందుతూ జర్మనీ, జపాన్ దేశాల అత్యాధునిక లేజర్ డిజిటల్ టెక్నాలజీతో కొత్తపుంతలు తొక్కుతూ ప్రపంచవ్యాప్తంగా సుస్థిరస్థానం సంపాదించుకుంది. అన్ని రకాల కార్యక్రమాల్లో, కార్యకలాపాల్లో తనదైన ప్రత్యేకతను చాటుకుంటోంది.

ఉమ్మడి జిల్లాలో ..

వరంగల్ ఉమ్మడి జిల్లాలో 1940 నుంచి ఫొటో అందుబాటులోకి వచ్చినట్టు చరిత్ర చెబుతోంది. తొలినాళ్లలో వరంగల్ నుంచి ఔట్‌డోర్ ఫొటోగ్రాఫర్లుగా వేళ్లమీద లెక్కపెట్టే మంది మాత్రమే ఉండేవారు. వారిలో శంకరయ్య, ఇర్ఫాన్, రాంసింగ్, దుర్గాసింగ్, వరదరాజులు నాయుడు, కోదాటి లక్ష్మణ్, బిట్ల నారాయణ (రవి వర్మ), హరి బ్రదర్స్ (నీల్ కమల్), జయప్రకాష్ (ప్రకాష్ స్టూడియో) తదితరులు ఫొటోగ్రాఫర్లుగా చలామణి అయ్యేవారు. 1970 తర్వాత ఫొటోగ్రఫి రంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా వరంగల్, హనుమకొండ నగరాలతో పాటు జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, నర్సంపేట, తొర్రూరు, పరకాల, తదితర పట్టణ ప్రాంతాల్లోనూ ఆధునిక డిజిటల్ ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. నెగెటివ్‌లతో పనిలేకుండా ఫొటోగ్రఫి రంగం.. మొబైల్, చిప్‌లతో రాజ్యమేలుతూ ప్రత్యేకతను చాటుకుంటోంది.






ఆత్మవిశ్వాసమే ఆలంబనగా..

- ఫొటోగ్రఫిలో రాణిస్తున్న రాజేశ్వరి
- 20 ఏళ్ళుగా ఫొటో స్టూడియో నడుపుతూ కుటుంబానికి ఆదరువు

కాటారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆమె కు చిన్ననాడే వివాహం అయింది.. భర్త తోడు గా సంసార బాధ్యతలు నిర్వహిస్తూ అన్యోన్యంగా సాగుతున్న వారి సంసారంలో పెను కుదుపు ఏర్పడింది. ఫొటోగ్రాఫర్‌గా కుటుంబాన్ని పోషిస్తున్న భర్త.. విధి వక్రీకరించి మంచం పట్టడంతో కుటుంబం పోషణ భా రంగా మారింది. ఓ వైపు మంచాన పడ్డ భర్త, ముగ్గురు చిన్న పిల్లలను సాకే బరువు, బాధ్యత ఆమె నెత్తిన పడింది. అయినా కష్టాలకు వెరవకుండా.. కన్నీళ్లను దిగమింగి హా బీగా నేర్చుకున్న ఫొటోగ్రఫినే వృత్తిగా ఎంచుకుంది. కుటుంబ భారమంతా మీద వేసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగు తూ మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఆమే పస్తం రాజేశ్వరి. ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం సందర్భంగా ఆమె జీవన పయనంపై ప్రత్యేక కథనం..


స్టూడియోలో ఫొటో తీస్తున్న రాజేశ్వరి

చిన్ననాటి నుంచే...

కాటారం మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన రాజేశ్వరికి 16ఏటనే పస్తం రాజేష్‌తో వివాహం జరిగింది. భర్త రాజేష్ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. రాజేష్ దంపతులకు ఉమేష్, రామకృష్ణ అనే ఇద్దరు కుమారులతో పాటు జ్యోతి అనే కుమార్తె ఉంది. జీవితం సాఫీగా సాగుతున్న క్రమంలో రాజేష్‌కు పక్షవాతం వచ్చింది. 15 ఏళ్ల మంచానికే పరిమితమై 5ఏళ్ల క్రితం తనువు చాలించాడు. అయినా బంధువుల సాయంతో మొక్కవోని ధైర్యంతో భర్త ద్వారా సరదాగా నేర్చుకున్న ఫొటోగ్రఫీనే వృత్తిగా స్వీకరించింది. ముగ్గురు పిల్లలతో కలిసి బతుకుపోరు మొదలు పెట్టింది.

సూటిపోటి మాటలు..

పురుషులే అధికంగా ఉండే ఫొటోగ్రఫి వృత్తిలోకి రాజేశ్వరి రావడంపై ఎంతోమంది సూటిపోటి మాటలు మాట్లాడినా లెక్కచేయకుండా రాజీలేని పోరాటంతో జీవనం సాగిస్తున్నది. ఫొటోస్టూడియోను ఆలంబనగా చేసుకొని బతుకు బండిని లాగుతోంది. గత 20ఏళ్లుగా ఫొటోస్టూడియోను విజయవంతంగా నడుపుతోంది. ఇన్‌డోర్, అవుట్ డోర్‌లోనూ అందమైన ఫొటోలు తీస్తూ రాణిస్తోంది. పెద్ద కుమారుడు ఉమేష్ ఎదిగి వచ్చి ఫొటోస్టూడియోలో పనిచేస్తుండగానే తీవ్ర అనారోగ్యం పాలై మంచం పట్టాడు. రెండో కుమారుడు రామకృష్ణ పీజీ చేయగా ఏదైనా ఉద్యోగం సాధించి కుటుంబానికి తోడుగా నిలుస్తాడని తలిస్తే.. పక్షవాతం బారిన పడ్డాడు. ఇలా కష్టాతో సహవాసం చేస్తూనే కుమార్తె జ్యోతికి బంధువుల సహకారంతో వివాహం జరిపించారు.

ఆదుకోవాలి...

బతుకు సమరంలో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిన తనకు ప్రభుత్వం సాయం అందించాలని రాజేశ్వరి కోరుతోంది. బంధువుల ఇంట్లో గత30ఏళ్లగా కిరాయికి ఉంటున్నామని, స్వంత ఇల్లు కూడా లేని తమకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని వేడుకుంటోంది. ఫొటోస్టూడియోతో పాటుముందు చిన్నగా ఫుట్‌వేర్ అమ్ముతున్నానని, తనకు సబ్సిడీ రుణం ఇచ్చి ఆదుకోవాలని కోరుతోంది.



దారి ఇలా.. బడికి ఎలా..?

స్వాతంత్ర్యం సిద్ధించి 79 వసంతాలు దాటినా.. సర్కార్ బడుల స్థితిగతులు మారడం లేదు. 'మా బడికి వెళ్లడానికి కనీసం బాట కూడా లేదు...' అని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని వీరారం శివారు మంచ్యాతండా ప్రైమరీ స్కూల్‌లో మొత్తం 22 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. ఆ పాఠశాలకు విద్యార్థులు, టీచర్ల రాకపోకలకు పొలాల గట్లే ఆధారం. వర్షాకాలంలో పొలాల గట్లు బురదమయం అవుతుండటంతో పలుమార్లు విద్యార్థులు జారిపడ్డ సంఘటనలున్నాయి. అంతేకాక పురుగులు, విష సర్పాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. దారి బాధ తప్పించడానికి కనీసం 10 ఫీట్ల రోడ్డు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, మరిపెడ రూరల్

ఇంతింతై వటుడింతై..

- ఖండాంతరాలకు విస్తరించిన కేయూ ఖ్యాతి
- వేలాది మంది జీవితాలకు దిక్సూచి
- 4 నుంచి 29 విభాగాల వరకు విస్తరణ
- నేడు స్వర్ణోత్సవంలోకి అడుగులు

కేయూ క్యాంపస్ ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇంతింతై వటుడింతై అన్నట్లుగా కాకతీయ యూనివర్సిటీ విస్తరించింది. 1976లో ఏర్పడిన వర్సిటీ 2025 ఆగస్టు 19కి స్వర్ణోత్సవ సంబురాల్లోకి అడుగిడుతోంది. 50 ఏళ్ళ ప్రస్థానంలో అనేక మైలురాళ్ళను అధిగమించింది. ప్రపంచ వ్యాప్తంగా కేయూ విద్యార్థులు శాఖోపశాఖలుగా విస్తరించారు. ఆర్ట్స్, సోషల్, సైన్స్, బయోటెక్నాలజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, కెమిస్ట్రీ, కామర్స్, ఎడ్యుకేషన్, లా విభాగాల్లో వేలాదిమంది విద్యార్థులు పట్టాలు పొందారు. తొలుత 1968లో హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీకి అనుబంధంగా పీజీ సెంటర్‌గా ఏర్పడింది. చారిత్రక వరంగల్ నగర ప్రశస్త్యాన్ని గురించి కాకతీయ సామ్రాజ్యం పేరుతో కాకతీయ యూనివర్సిటీ విద్యారణ్యపురిగా నామకరణం చేశారు. అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ కృష్ణకాంత్, ముఖ్యమంత్రి జలగం వెంగళరావు నేతృత్వంలో వర్సిటీకి శంకుస్థాపన చేశారు. మొదటగా ఎంఏ తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు సైన్స్ గ్రూపుల్లో కెమిస్ట్రీ, మ్యాథ్స్‌లతో షురూ చేశారు. తర్వాత అనేక కోర్సులను ప్రవేశపెట్టారు.

ఎగ్జిక్యూటివ్ కమిటీ..

కేయూ స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ. నిర్ణయాలు కేయూ పాలక మండలి నేతృత్వంలో జరుగుతాయి. వీసీ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీ పాలక మండలిని నియమిస్తుంది. డీన్ సీడీసీ, డీన్ అకాడమిక్ ఆడిట్‌లు ఎప్పటికప్పుడూ వర్సిటీ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటోంది. కేయూ యూజీసీ కోఆర్డినేటింగ్ ఆఫీస్ విద్యార్థులకు జాతీయ స్థాయి ఫెల్లోషిప్‌లతో పాటు, రూసా, ప్రణాళిక సంఘం నిధులను తెప్పించి వర్సిటీ అభివృద్ధికి తోడ్పడుతోంది. విద్యార్థులకు సహాయంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, సీహెచ్‌సీ సెల్‌లను ఏర్పాటు చేశారు. సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్, గాంధీయన్ స్టడీస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్, ఫ్రీ లీగల్ ఎయిడ్, బ్యాంకు, పోస్టాఫీస్, సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్, వేదన పేరుతో మహిళల రక్షణ చర్యలకు సెంటర్‌ను ఏర్పాటు చేశారు.



672 ఎకరాల విస్తీర్ణం..

కేయూకు మొత్తం 672 ఎకరాల భూమి ఉంది. ఇందులో కెనాల్ కాలువలు, ఆల్ ఇండియా రేడియో స్టేషన్, పోలీస్‌స్టేషన్, మున్సిపల్ కార్పొరేషన్ వాటర్ హెడ్ ట్యాంకులకు కొంత భూమిని తీసుకున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు కొందరు వర్సిటీ భూములను అక్రమించుకున్నారు.

అందిస్తున్న కోర్సులివే..

ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, చరిత్ర, టూరిజం మేనేజ్‌మెంట్, రాజనీతిశాస్త్రం, ప్రభుత్వ పాలన శాస్త్రం, హ్యూమన్ రిసోర్స్ అండ్‌ఆఫ్ మేనేజ్‌మెంట్, ఎకానమిక్స్, సోషియాలజీ, గణితం, స్టాట్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, సైకాలజీ, జర్నలిజం, బాటనీ, జువాలజీ, బయో టెక్నాలజీ. బయో కెమిస్ట్రీ, మైక్రో బయోలజీ, సెరికల్చర్, కంప్యూటర్ సైన్స్, జియాలజీతో పాటు ఇంజనీరింగ్, కామర్స్, లా, ఫార్మసీ, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, లైబ్రరీ సైన్స్ విభాగాలున్నాయి. వీటితో పాటు దూరవిద్యలో యోగ, డిప్లొమాతో పాటు అనేక సర్టిఫికెట్ కోర్సులున్నాయి.

హాస్టల్ సౌకర్యాలు..

ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఎడ్యుకేషన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, లా కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు వర్సిటీ క్యాంపస్‌తో పాటు సుబేదారిలోని లా హాస్టల్‌లో వసతి కల్పిస్తున్నారు. దాదాపు 5వేలకు పైగా విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు.

ఆన్‌లైన్‌లో కోర్సులు ..

కాకతీయ యూనివర్సిటీలో అఫ్‌లైన్ కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సులు, సర్టిఫికేట్ కోర్సులనుమూక్ ద్వారానేరుగా యూజీసీఅందిస్తోంది.


ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి, కేయూ వీసీ

మొత్తం 29 విభాగాలు..

కాకతీయ యూనివర్సిటీలో ప్రస్తుతం 29 రెగ్యులర్ విభాగాలున్నాయి. మొదటి, రెండో ఏడాది కలిసి ఒక్కో విభాగంలో సరాసరిగా 100 మంది విద్యార్థులుంటారు. ఇవే కాకుండా ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ కోర్సులున్నాయి. పీజీ కోర్సుల్లో డిగ్రీ విద్యార్హతతో క్యాంపస్ సీట్లు సాధిస్తే.. ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సైన్స్ కోర్సుల్లో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తారు. మార్కెట్‌లో ఉన్నత ఉద్యోగ అవకాశాలు కల్పించే అనేక కోర్సులను కేయూ అందిస్తోంది. ప్రైవేట్ వర్సిటీలకు దీటుగా సెలబస్‌ను రూపొందిస్తోంది. రీసెర్చ్‌లోనూ దీటుగా నిలుస్తోంది.

టీచర్ల కొరత... ఆర్థిక సమస్యలు..

కేయూలో టీచర్ల కొరత ఉంది. 409 మంది అధ్యాపకులకు గాను కేవలం 76 మందే శాశ్వత ప్రతిపాదికన పనిచేస్తున్నారు. మిగతావారంతా కాంట్రాక్టు, పార్ట్‌టైమ్, పేపర్‌వైజ్ పద్ధతుల్లో పనిచేస్తున్నారు. దీనికి తోడు ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గతంలో లాగా బ్లాక్ గ్రాంట్‌ను విడుదల చేయడం లేదు. దీంతో ఆదాయం కోసం విద్యార్థుల పరీక్షల ఫీజులు, ఇతర సర్టిఫికేట్ ఫీజులను పెంచారు. ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు పరీక్షల విభాగంతో పాటు దూరవిద్య కేంద్రం నిధులపై ఆధారపడాల్సి వస్తోంది.

పోటీకి తగిన కోర్సులు కరువు..

కేయూలో మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కోర్సులు లేవు. కేవలం క్యాంపస్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు మాత్రమే కొంతమేర ప్లేస్‌మెంట్లు లభిస్తున్నాయి. ఇతర కోర్సులకు అంత ఆదరణ లేదు.

అభివృద్ధికి ప్రణాళికలు..

ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, కేయూ వీసీ

గోల్డన్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని వర్సిటీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాం. నిధుల కోసం వేచిచూస్తున్నాం. స్వర్ణోత్సవాల వేళ కేయూలో తెలంగాణ సైన్స్ అకాడమీ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నాం. శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా ప్రభుత్వం చేస్తున్న కృషిలో పాలుపంచుకుంటున్నాం. వచ్చే ఏడాది వరకు స్వర్ణోత్సవ సంబురాల కార్యక్రమాలు నిర్వహిస్తాం.

ఆకట్టుకుంటున్న బేసిక్ రోబోలు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తయారీ

కేసముద్రం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నీతి అయోగ్ అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా కేంద్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థులు అమర్చిన బేసిక్ రోబోలు ఆకట్టుకుంటున్నాయి. ఎనిమిదో తరగతి విద్యార్థులు బోడ గణేష్, జర్పుల కల్యాణ్, బానోత్ పవన్ తమ గైడ్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు విజయచందర్ సహకారంతో బేసిక్ రోబోల విడి భాగాలను అమర్చి తయారు చేశారు. విద్యార్థులకు పాఠశాల దశలోనే ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, సెన్సార్లు, కృత్రిమ మేధ వంటి విషయాలపై ప్రాథమిక అవగాహన ఈ ల్యాబ్‌లలో కల్పిస్తామని ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ ల్యాబ్‌లో రోబోటిక్స్‌లో పంపిణీ చేసిన విడిభాగాలను అమర్చి బేసిక్ రోబోలను విద్యార్థులు తయారు చేసి నడిపించారు. స్వయం చలితంగా బేసిక్ రోబోలు తిరుగుతున్న వీడియోలు స్థానిక సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి విద్యార్థులను పలువురు అభినందించారు.


కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన బేసిక్ రోబో నమూనాలు

ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగు

ప్రమాదపు అంచున తాత్కాలిక కట్ట

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇల్లంద, కొత్తపల్లి, ల్యాబర్తి గ్రామాల్లో ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆకేరు వాగులోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో చెక్ డ్యాంల నుంచి మత్తడి పడి నీరు దిగువకు వెళిపోతోంది. ఇల్లంద గ్రామ శివారులో గతేడాది కోతకు గురైన చోట తాత్కాలిక కట్టను నిర్మించారు. శాశ్వత పనులు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు స్వయంగా వచ్చి చూసినప్పటికీ పనులకు మోక్షం కలుగలేదు. నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పనులు సాగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపధ్యంలో వరద పెరిగితే మళ్లీ కట్ట తెగిపోయి భూములు కోతకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.


ఇల్లందలో గ్రామ శివారులోని ఆకేరు వాగు వద్ద ప్రమాదకరంగా ఉన్న తాత్కాలిక కట్ట

పాపపరిహారానికి దాన ధర్మాలు చేయాలి

హనుమకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సంత్ రవిదాస్ ఆశ్రమం కాశీపీఠాధిపతి ఆచార్య భరత్ భూషన్‌దాస్ సోమవారం హనమకొండలోని వేయిస్తంభాలగుడిని సందర్శించారు. రుద్రేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిపుచ్చుకోవడం అనేది ఆధ్యాత్మిక ప్రపంచం నుంచి లౌకిక ప్రపంచానికి దిగుమతి అయిన పదం అన్నారు. దీనికి గొప్ప తాత్విక చరిత్ర ఉందన్నారు. ఈశ్వరుడి ధ్యానంతోనే ఖర్మరాహిత్యం జరుగుతుందని చెప్పారు. పాపపరిహారం జరగాలంటే దాన ధర్మాలు చేయాలన్నారు. ఉత్తరాది కన్నా దక్షిణాదిలోనే సంప్రదాయాల పట్టింపు ఎక్కువ అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అనిల్ కుమార్ ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. స్వామివారికి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకొని ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, ఉత్తిష్ఠగణపతికి కుంకుమ విలేపనాభిషేకం, రుద్రేశ్వర స్వామివారికి పాశుపత ఏకాదశ రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంకాలం ఆలయంలో ప్రదోశకాల పూజ నిర్వహించారు.


అనుగ్రహ భాషణం చేస్తున్న సంత్ రవిదాస్

బంజారా సంస్కృతిని భావితరాలకు అందించాలి

వడ్డేపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బంజారా సంస్కృతిని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని బంజారా సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ ఆంగోతు నరేష్ నాయక్ అన్నారు. హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన తీజ్ ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం బంజారాల ఆరాధ్య దైవాలు మేరా మాయాడీ, సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటాలకు ఆయనతో పాటు బంజారా నేతలు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ గోర్ బంజారా తీజ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆంగోతు వినోద్ లోక్‌నాయక్, బాదావత్ బాలాజీ, డాక్టర్ గుగులోత్ రాజు నాయక్, గుగులోత్ సజ్జన్ నాయక్, భూక్య హేమానాయక్, డుంగ్రోతు కిశోర్ నాయక్ పాల్గొన్నారు.


పేషంట్లతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఎంజీఎంలో సమస్యలు పరిష్కరించాలి

ఆస్పత్రిని సందర్శించిన సీపీఎం బృందం

వరంగల్ మెడికల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు బాబు డిమాండ్ చేశారు. ఎంజీఎంలో నెలకొన్న సమస్యలపై సీపీఎం పార్టీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సర్వే నిర్వహించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆపరేషన్ థియేటర్‌లోకి నీరు రావడంతో ఆపరేషన్లు చేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పరికరాలుకూడా తక్కువగా ఉన్నాయని, రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అరూరి కుమార్, గున్నాల ప్రభాకర్, రేణుక, అప్పాజీ, వాణి, ఉపేందర్, రంగరాజు, విజయ, దివ్య, ఎండి.జహేద, చంద్రమౌళి, శారద, జుబేదా, ఇస్మాయిల్, యాకూబ్‌పాషా, శంకర్, మాశూబి పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల పాఠశాలలో సైకిళ్ల పంపిణీ

హనుమకొండ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనుమాండ్ల ఝాన్సీ రెడ్డి జన్మదినం సందర్భంగా హనుమకొండలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో వెన్నెల ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సోమవారం సైకిళ్లను పంపిణీ చేశారు. వెన్నెల ఫౌండేషన్ చైర్మన్ బండి చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో 25 మంది నిరుపేద విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేసినట్లు చైతన్యరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సిలబస్‌కు పరిమితం కావొద్దు

కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, ఆ గస్టు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సిలబస్ కు పరిమితం కాకుం డా విస్తృత అధ్యయనంతో జీవితంలో ఎదగాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్ర తా ప్‌రెడ్డి అన్నారు. సోమవారం కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల మొదటి ఏడాది విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి, టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. పాఠ్య పుస్తకాలతో పాటు పాఠ్యేతర అంశాలపై ప్రాముఖ్యత వహించాలని అన్నారు. ప్రతీ అంశాన్ని సద్వినియోగం చేసుకుని జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కృత్రిమ మేథాతో పాటు నైపుణ్యాలు అవసరమన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ మహేందర్, డాక్టర్లు సీహెచ్ రాధిక, సుమలత, ఆసీం ఇక్బాల్‌తో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవో జ్ఞానేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలి

హనుమకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న సుజన్ తేజ పట్ల దుర్భాషలాడిన జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్‌ను డీఈవో బాధ్యతల నుంచి తప్పించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పాఠశాల విద్యా సంచాలకులను కోరింది. ఈ మేరకు వినతి పత్రం సమర్పించింది. డీఈవో వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటూ వివాదాలకు కేంద్రంగా మారారని, కార్యాలయంలో పని చేసే సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, ఫైళ్లను త్వరగా పరిష్క రించడం లేదని, మహిళా సిబ్బందిని కూడా దుర్భాషలాడతున్నారని ఆరోపించారు. వినతి పత్రం సమర్పించినవారిలో చావ రవి (టీఎస్‌యూటీఎఫ్), నన్నెబోయిన తిరుపతి (టీపీటీఎఫ్), టి లింగారెడ్డి (డీటీఎఫ్), కొమ్ము రమేష్ (బీటీఎఫ్) వై విజయకుమార్ (ఎస్‌సీఎస్‌టీయుఎస్) ఎం సోమయ్య (డీటీఎఫ్) ఎస్ హరిక్రిష్ణ (టీటీఏటీఎస్) ఏ వెంకట్ (టీఎస్‌యూటీఎఫ్) ఉన్నారు. వరంగల్ డీఈవో జ్ఞానేశ్వర్‌పై చర్య తీసుకోవాలని ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, జిల్లా కన్వీనర్ హరిచరణ్, వరంగల్ మహానగర్ కార్యదర్శి బెల్లం కార్తీక్ అడిషనల్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేర కు వినతి పత్రం సమర్పించారు.

ఆస్పత్రులకు అనుమతులు ఇప్పించండి

వరంగల్ మెడికల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రులకు సంబంధిత అనుమతులు, రెన్యూవల్స్ కోసం యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇచ్చే ఈ అనుమతులు ప్రస్తుతం కలెక్టర్ కార్యాలయానికి మార్పు చేశారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా 21 ఆస్పత్రులు కొన్ని రెన్యూవల్స్ కొన్ని కొత్తవి అనుమతుల కోసం దరఖాస్తులు సమర్పించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటిస్తూ అన్ని రకాల పత్రాల సమర్పించారు. కానీ గత ఏడాది కాలంగా ఎలాంటి అనుమతులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నట్లు వాపోతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయాన్ని సంప్రదిస్తే కలెక్టర్ వద్దకు ఫైల్ వెళ్లిందని చెబుతున్నారు. కలెక్టరేట్‌లో ఆరా తీస్తే అడిషనల్ కలెక్టర్ చాంబర్‌లో ఉందని సమాధానం ఇస్తూ దాటవేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఆస్పత్రుల అనుమతులు రెన్యూవల్ ఇప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- పలువురు ప్రయాణికులకు గాయాలు


ముందుభాగం దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

శాయంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆగివున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పలువురు ప్రయాణికులు గాయాలపాలయ్యారు. స్థానిక ఎస్ఐ జక్కుల పరమేశ్వర్ తెలిపిన ప్రకారం... సోమవారం గుడెప్పాడ్ నుంచి పరకాల వైపు గా వెళ్తున్న ఓ లారీ మండలంలోని కొత్తగట్టు సింగారం స్టేజి సమీపంలో జాతీయ రహదారిపై ఎలాంటి పార్కింగ్ లైట్, ఇండికేటర్స్ లేకుండా ఆగివుంది. ఈ క్రమంలో హనుమకొండ నుంచి కాళేశ్వరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు లారీని తప్పించబోతుండా ఎదురుగా మరొక లారీ వచ్చింది. దీం తో డ్రైవర్ బస్సును నియంత్రించే క్రమంలో ముందు ఆగివున్న లారీని వెనక భాగంలో ఢీకొట్టాడు. దీంతో బస్సు ముందు భాగం బాగా దెబ్బతింది. అలాగే బస్సులో 55 మంది ప్రయాణికులు ఉండగా 11 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ పరమేశ్వర్ క్షతగాత్రులను అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మిగతా వారిని వేరే బస్సులలో గమ్యస్థానాలకు పంపారు. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. బస్సు డ్రైవర్ గౌసొద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ అబ్దుల్ ఖయూమ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేదల కోసం పోరాడిన యోధుడు పాపన్న

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- రాంపూర్‌లో సర్వాయి పాపన్న జయంతి


రాంపూర్‌లో సర్వాయి పాపన్న జయంతి ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి


బీఆర్ఎస్ కార్యాలయంలో సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మడికొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పేదల హక్కుల కోసం పోరాడిన మహా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జీడబ్ల్యూఎంసీ 46వ డివిజన్ రాంపూర్‌లో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవంలో ఎమ్మెల్యే శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాపన్న విగ్రహానికి పూలమాల వేసి కల్లుగీత కార్మిక సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వాయి పాపన్న 375 ఏళ్ల క్రితమే పేదల పక్షాన నిలబడి పోరాడిన యోధుడని, పాపన్న వీరత్వాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్‌రెడ్డి ట్యాంక్‌బండ్‌పై మహనీయుల విగ్రహాల పక్కన పాపన్న విగ్రహాన్ని నెలకొల్పబోతున్నారని తెలిపారు. గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జీవో 560 ప్రకారం కల్లుగీత కార్మిక సొసైటీలకు 5 ఎకరాల భూమి కేటాయించాలన్నారు. పాపన్న భవన నిర్మాణానికి ఎకరం భూమి, కల్లుగీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మునిగాల సరోజనకరుణాకర్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్యగౌడ్, చింత మధు, విజేందర్, గడ్డం వీరాంజనేయులు, గడ్డం యాదగిరి పాల్గొన్నారు.

కడిపికొండలో..

కాజీపేట మండలం కడిపికొండలో సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నర్మెట వెంకటరమణగౌడ్, సంఘం పెద్దలు బల్లిని విజ్జగిరి గౌడ్, బుర్ర ప్రభాకర్, మొండెం శ్రీనివాస్, బైరి స్వామి, సట్ల సదానందం, నర్మెట వేణుగోపాల్ పాల్గొన్నారు.

• వడ్డెపలి(ఆంధ్రజ్యోతి): పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను సమాజంలోని ప్రతీ ఒక్కరు కొనసాగించాలని గౌడ సం ఘం రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లాల రాజ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ (కల్లు మండువ) జంక్షన్‌లో గోపాల్‌పూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బానిసత్వానికి వ్యతిరేకంగా మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి గోల్కొండ కోటను ఏలిన తొలి తెలంగాణ బహుజన విప్లవ వీరుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, గౌడ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు చింత రమేష్‌గౌడ్, దూలం సురేందర్‌గౌడ్, దూలం పెద్దరాజు గౌడ్, దూలం పవన్, అరుణ్ పాల్గొన్నారు.

• కేయూ క్యాంపస్ : సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని కేయూ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ బొడిగే సతీశ్ నేతృత్వంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజుగౌడ్, ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, కనుకయ్య, డాక్టర్ ఎస్.సుందరరాజ్ యాదవ్, బొనగాని యాదగిరిగౌడ్, కరుణాకర్, ఫిరోజ్, రాజేశ్, ఉమాశంకర్, మోహన్, చీకటి శ్రీను, మామిడి లింగయ్య, జనగాం శ్రీనివాస్, దేవోజీనాయక్, సిద్దార్థ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

• హనుమకొండ టౌన్ : తెలంగాణ బహుజన వీరుడు, ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీక అని బీఆర్ఎస్ పశ్చిమ నియోజక వర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ అన్నారు. సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పాపన్న గౌడ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు మూటిక రాజు యాదవ్, సుధాకర్, వినిల్‌రావు, చాగంటి రమేష్, రఘు, శ్రీనివాస్, భైరపాక ప్రశాంత్, దేవమ్మ, అజయ్‌గౌడ్, పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ


టేకులగూడెంలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న జంగా రాఘవరెడ్డి

మడికొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ టేకులగూడెంలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి స్థానిక కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. పూజా కార్యక్రమంలో భాగంగా కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలి

రాంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు, గృహ వినియోగదారులు విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు పాటించాలని వరంగల్ సూపరింటెండెంట్ గౌతంరెడ్డి సూచించారు. తడిబట్టలు, తడి చేతులతో విద్యుత్ తీగలను, స్విచ్‌లను తాకవద్దన్నారు. ఇళ్లలో తడి నేలపై ఎలక్ట్రిక్ తీగలు, పరికరాలు పడకుండా జాగ్రత్త పడాలన్నారు. బట్టలు ఆరేసేందుకు ప్లాస్టిక్ వైర్లను వినియోగించాలన్నారు. వర్షం నీటిలో తెగిపడిన ఎలక్ట్రికల్ వైర్ల వద్దకు వెళ్లవద్దన్నారు. ఇంటిలోకి సరఫరా అయ్యే వైర్లు సరిగ్గా ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలన్నారు. తెగి పడిన విద్యుత్ తీగలు, పరికరాలు కనిపిస్తే వెంటనే 1912 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడేటప్పుడు చార్జింగ్ బంద్ చేసి మాట్లాడాలన్నారు. రైతులు, గృహ వినియోగదారులు స్వతహాగా విద్యుత్ మరమ్మతులు చేయకూడదన్నారు. విద్యుత్ సమస్యలు ఉంటే 1912 నెంబర్‌లో సంప్రదించాలని ఎస్ఈ సూచించారు.

నిబంధనలను పాటిస్తూ ఉత్సవాలు జరుపుకోవాలి

గణేష్ ఉత్సవ కమిటీలకు సీపీ సూచన

వరంగల్ క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే మండప నిర్వాహకులు పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరిగా పొందాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. వారం రోజుల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మండప నిర్వాహకులకు సీపీ పలు సూచనలు చేశారు. మండప నిర్వాహకులు ముందుగా తాము ఏర్పాటు చేసే గణేశ్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ, ఇతరత్రా సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్: పోలీస్‌పోర్టల్.టీఎస్‌పోలీస్.జీఓవి.ఇన్ ద్వారా మండపాల పూర్తి వివరాలను నమోదు చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు అనుమతులు జారీ చేస్తారన్నారు. అదే విధంగా విద్యుత్‌శాఖ అనుమతి పొందాలన్నారు. షార్ట్ సర్క్యూట్ జరగకుండా మంచి నాణ్యత ఉన్న వైర్లను ఉపయోగించాలన్నారు. మండపాల ఎదుట మండప కమిటీ సభ్యుల వివరాలతో పాటు నిర్వాహకుల పేర్లతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలన్నారు. చదువుకునే విద్యార్థులతో పాటు వృద్ధులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా తక్కువ శబ్దం వచ్చే స్పీకర్లను వినియోగించాలన్నారు.

సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకే స్పీకర్లను వినియోగించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో డీజే ఉపయోగించొద్దని హెచ్చరించారు. విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలని పోలీస్ అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో సంతకాలు చేస్తారన్నారు. మండపాల్లో ప్లాస్టిక్ సంచులు, అనుమానాస్పద బ్యాగ్‌లు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. భక్తుల సందర్శనను దృష్టిలో పెట్టుకొని క్యూలైన్‌లు ఏర్పాటు చేయాలని సీపీ సూచించారు.


వరంగల్ బ్యాంకు కాలనీలో మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

వరదనీరు నిలువకుండా పూడిక తీయాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో సందర్శన

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : డ్రైయినేజీ, మ్యాన్ హోల్స్‌లో వరద నీరు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. సోమవారం వరంగల్ నగరంలోని 13, 22 డివిజన్‌లలోని కొత్తవాడ, బ్యాంకుకాలనీ, మర్రివెంకటయ్య కాలనీ, ఏకశిల నగర్, దేశాయిపేట రోడ్డు, చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా కాలనీలలో డ్రైనేజీలు, మ్యాన్ హోల్స్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వడ్డేపల్లి చెరువులో కలుస్తున్న నీటిపై స్థానిక కార్పొరేటర్ జోషిని అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్నారా ? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు జవాన్‌లు అందుబాటులో లేకపోవడం వల్ల వారికి వేతనాలు వస్తున్నాయా ? లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనయర్ మాట్లాడారు. నగరంలో వరద ముంపు నివారణ కోసం అధికారులు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేష్ జోషి, బస్వరాజు కుమార్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, డీఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భీమయ్య, మలేరియా హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధూకర్‌లతో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో చాలా కాలనీలలో అభివృద్ధి పనులకు టెండరు ప్రక్రియ పూర్తి అయినా ఇంకా చాలా చోట్ల పనులు ప్రారంభించలేదని, వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. 66 డివిజన్‌లలో ఒక్కో డివిజన్‌కు రూ. 50 లక్షల చొప్పున స్టాంప్ డ్యూటీ, 15వ ఆర్థిక సంఘం నిధులు, స్పెషల్ ఫండ్, ఎస్సీ సబ్‌ప్లాన్, నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇంకా మంజూరైన పనులకు తక్షణకు టెండరు ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జీ ఎస్ఈ మహేందర్, ఈఈ సంతోష్‌బాబు, డీఈలు రవికుమార్, కిరణ్, సారంగం, రోజారాణి, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- పురుగుల మందు తాగిన స్వామిరాజు
- వేధింపులే కారణమని ఆరోపణ

పరకాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నడికుడ మండల కేంద్రానికి చెందిన తాళ్ల స్వామిరాజు అనే వ్యక్తి సోమవారం పరకాల పోలీసు స్టేషన్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొందరు వ్యక్తులు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఆయన ఈ చర్యకు పాల్పడ్డాడు. సీఐ క్రాంతికుమార్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా నడికుడ మండల కేంద్రానికి చెందిన తాళ్ల పున్నంచందర్, కిన్నెర మల్లికార్జున్, తాళ్ల స్వామిరాజులకు గత కొంత కాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పరస్పరం కేసులు కూడా పెట్టుకున్నారు. సోమవారం గ్రామంలో ఒక మిత్రుడి గృహ ప్రవేశానికి వెళ్లిన వీరు మద్యం షాపులో గొడవ పడ్డారు. కిన్నెర మల్లికార్జున్ పరకాల పోలీసు స్టేషన్‌లో తాళ్ల స్వామిరాజుపై ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్ఐ రమేష్ స్వామిరాజును పోలీసు స్టేషన్‌కు రావాలని ఫోన్ ద్వారా ఆదేశించాడు. స్వామిరాజు పురుగుల మందు డబ్బాను కొనుగోలు చేసి స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ముందే తాగి పడిపోయాడని తెలిపారు. కాగా, గమనించిన స్వామిరాజు స్నేహితులు ఆయనను వెంటనే పట్టణంలోని సివిల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న స్వామిరాజు విలేకరులతో మాట్లాడుతూ గత కొంత కాలంగా పున్నంచందర్, మల్లికార్జున్‌లు తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తన తప్పేమి లేనప్పటికీ గతంలో నీపై కేసులు ఉన్నాయని, ఇప్పుడు కూడా కేసు పెడతామని సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ రమేష్‌లు బెదిరించడంతో వేధింపులు తట్టుకోలేకనే పురుగుల మందు తాగానని వివరించారు.

కేయూ వీసీ చాంబర్ మార్పు

పరిపాలన భవనంలోని రెండో అంతస్తులో ఏర్పాటు

కేయూ క్యాంపస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కేయూ వీసీ చాంబర్ కేయూ పరిపాలన భవనంలోని మొదటి అంతస్తు నుంచి రెండో అంతస్తులోకి మార్చారు. ఈ మేరకు సోమవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి నూతన చాంబర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వీసీ ప్రతాప్‌రెడ్డిని శాలువ, పుష్పగుచ్ఛం అందచేసి అభినందలు తెలిపారు.

జలేశ్వరాలయంలో విఘ్నేశ్వరుడి ప్రతిష్ఠ

రెడ్డికాలనీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాకాజీ కాలనీలోని స్వయంభూ బ్రహ్మసూత్ర సమేత జలేశ్వరాలయంలో విఘ్నేశ్వరుడికి ఉపాలయం నిర్మించారు. సోమవారం ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఫణిశర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. గొడిశాల రామస్వామి జ్ఞాపకార్థం వారి భార్య రేణుక, వంగ శిరీష, వెంకట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జలేశ్వరాలయ కమిటీ చైర్మన్ మట్టా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పిల్లల ఆహారం

ఒకటి నుంచి మూడేళ్ల వయసు పిల్లలకు ఘనాహారంగా అన్నాన్నే ఎంచుకుంటూ ఉంటాం. కానీ పిల్లల ఎదుగుదలకు సూక్ష్మ పోషకాల మీద దృష్టి పెట్టడం అత్యవసరం. అందుకోసం చిరుధాన్యాలను ఎంచుకోవాలి. వీటిలో బియ్యం, గోధుమల్లో లేని విటమిన్లు, ఖనిజ లవణాలు ఉంటాయి. కాబట్టి అందుబాటులో ఉన్న పలురకాల చిరుధాన్యాలను పిల్లలకు తినిపిస్తూ ఉండాలి.

పిల్లలకూ చిరుధాన్యాలు

చిరు ధాన్యాల్లో ఉండే ఇనుము, క్యాల్షియం, మెగ్నీషియం, బి విటమిన్లు పిల్లలు శక్తిని ఖర్చు చేసుకునే వేగాన్నీ, ఎముకల సాంద్రతనూ, రోగనిరోధకశక్తినీ పెంచుతాయి. వీటిలో గ్లూటెన్, అత్యధిక పీచు ఉంటుంది కాబట్టి పిల్లలకు తేలికగా జీర్ణమవుతాయి. వీటిలోని ఇనుము హార్మోన్ల పనితీరుకూ, ఎర్ర రక్తకణాల పెరుగుదలకూ తోడ్పడుతుంది. కాబట్టి పిల్లల ఆహారంలో చిరుధాన్యాలను చేర్చుకుంటే, ఎదుగుదల ఆరోగ్యకరంగా సాగుతుంది. అయితే చిరుధాన్యాలను పిల్లలకు తినిపించడం ఇబ్బందిగా మారితే, వాటిని ఇలా కొత్తగా కూడా వండి తినిపించవచ్చు.

రమ్యమైన రాగి బంతులు




కావలసిన పదార్థాలు:
- **రాగి పిండి:** ఒక కప్పు
- **నీళ్లు:** ఒకటిన్నర కప్పు
- **ఎండుమిరప:** 2
- **కరివేపాకు:** ఒక రెమ్మ
- **ఆవాలు:** అర టీస్పూను
- **మినపప్పు:** ఒక టీస్పూను
- **ఉప్పు:** అవసరమైనంత
- **నూనె:** రెండు టీస్పూన్లు

వంట సమయం: 20 నిమిషాలు

ఇలా వండుకోవాలి:
- ప్యాన్‌లో నూనె వేడి చేసి, ఆవాలు, మినపప్పు వేయించుకోవాలి. తర్వాత ఎండు మిరపకాయలు, కరివేపాకు వేసి, వేగిన తర్వాత, నీళ్లు, ఉప్పు వేసి కలపాలి.
- నీళ్లు మరిగిన తర్వాత, మంట తగ్గించి, నెమ్మదిగా రాగి పిండి పోస్తూ ఉండలు లేకుండా కలుపుకోవాలి. రాగి పిండి పోయగానే అది ముద్ద కడుతుంది. అప్పుడు మంట తీసేసి, మిశ్రమాన్ని చల్లారబెట్టి, పొడిబారిపోకుండా వస్త్రం కప్పి ఉంచాలి.
- ఇడ్లీ కుక్కర్‌లో నీళ్లు వేడి చేసి, ప్లేటుకు నూనె పూసుకోవాలి. చేతులకు కూడా నూనె పట్టించి, పిండి ముద్ద వేడిగా ఉన్నప్పుడే, గుండ్రని బంతుల్లా చుట్టుకోవాలి.
- ఈ రాగి బంతులను ఇడ్లీ ప్లేట్‌లో ఉంచి, 15 నిమిషాల పాటు ఆవిరి మీద ఉడికించుకోవాలి. ఉడికిన తర్వాత, క్యారెట్, లేదా టమాటో చట్నీతో కలిపి పిల్లలకు తినిపించాలి.

అరికల పాయసం



కావలసిన పదార్థాలు:
- **అరికలు:** పావు కప్పు
- **చక్కెర/బెల్లం:** పావు కప్పు
- **చిక్కని పాలు:** రెండు కప్పులు
- **జీడిపప్పు:** పది
- **ఎండు ద్రాక్ష:** 10
- **పాలు:** అరకప్పు
- **యాలకుల పొడి:** అర టీస్పూను
- **నెయ్యి:** రెండు టేబుల్ స్పూన్లు

వంట సమయం: 25 నిమిషాలు

ఇలా వండుకోవాలి:
- ప్యాన్‌లో నెయ్యి వేడి చేసి, జీడి పప్పు, ఎండు ద్రాక్షలను దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే నెయ్యిలో అరికలను కమ్మని వాసన వచ్చేవరకూ వేయించుకోవాలి. తర్వాత నీళ్లు పోసి కలుపుకోవాలి. తర్వాత ప్యాన్ మీద మూత పెట్టి, అరికలు మెత్తబడేవరకూ ఉడికించుకోవాలి. చివర్లో అర కప్పు పాలు, బెల్లం, యాలకుల పొడి కలిపి, 5 నుంచి 8 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. తర్వాత, వేయించి పెట్టుకున్న జీడిపప్పు, ఎండు ద్రాక్ష కలిపి పిల్లలకు తినిపించాలి.

పిల్లలకు చిరుధాన్యాలు ఇలా అలవాటు చేయాలి

పిల్లలకు అలవాటు చేసే ప్రతి పదార్థం విషయంలో కొన్ని మార్గదర్శకాలు పాటించాలి. చిరుధాన్యాలకూ ఈ సూత్రం వర్తిస్తుంది. కాబట్టి చిరుధాన్యాలపరంగా అనుసరించవలసిన, అనుసరించకూడని అంశాల గురించి తెలుసుకుందాం!

ఇలా చేయాలి?


- అలర్జీ తత్వాన్ని కనిపెట్టడం కోసం మూడు రోజుల నియమంలో భాగంగా మూడు రోజుల పాటు ఒకే ఆహారం తినిపించాలి. మొదట్లో చిన్న పరిమాణాల్లో తినిపించి, పిల్లల జీర్ణ వ్యవస్థ ఆ పదార్థానికి అలవాటు పడేలా చేయాలి. పోరిడ్జ్, కిచిడి, లేదా దోసె రూపాల్లో క్రమేపీ పిల్లలకు వాటిని అలవాటు చేయాలి.
- **సరైన రకం:** రాగుల్లో క్యాల్షియం, ఖనిజ లవణాలు ఎక్కువ కాబట్టి పిల్లలకు మొదట వీటిని అలవాటు చేయాలి. తర్వాత కొర్రలు, ఊదలను పరిచయం చేయాలి
- **వండే విధానం:** చిరుధాన్యాలను నానబెట్టి లేదా వేయించి వండుకోవాలి. ఇలా చేయడం వల్ల పోషకాల నష్టం తగ్గడంతో పాటు తేలికగా జీర్ణమవుతాయి. చిరుధాన్యాలను ప్రెషర్ కుక్కర్‌లో వండుకోవచ్చు. లేదా చిన్న మంట మీద మెత్తబడేవరకూ నెమ్మదిగా ఉడికించుకోవచ్చు
- **పదార్థాలతో కలిపి:** పెరుగు, నెయ్యి, కూరగాయలతో కలిపి తినిపిస్తే, రుచి పెరుగుతుంది. అదనపు పోషకాలు అందుతాయి
- **ఆకర్షణీయమైన ఆకారాల్లో:** కుకీస్, ప్యాన్ కేక్స్, లడ్డు, పాయసం, ఇడ్లీ.. ఇలా ఆకర్షణీయమైన ఆకారాల్లో వండి తినిపిస్తే, పిల్లలు ఇష్టంగా తింటారు.

ఇవి కూడదు

- **అన్నం, గోధుమలకు బదులుగా:** అన్నం, గోధుమలను పూర్తిగా తొలగించి చిరుధాన్యాలే తినిపించకూడదు. ప్రతి ధాన్యంలో ప్రత్యేకమైన పోషక నాణ్యతలుంటాయి. ప్రత్యేకించి చిన్న పిల్లలకు క్యాలరీల అవసరం ఎక్కువ కాబట్టి బరువు పెరగడం కోసం ఎదుగుదల కోసం భిన్నమైన పదార్థాలు తినిపిస్తూ ఉండాలి
- **భారీ పరిమాణాల్లో:** తింటున్నారు కదా అని భారీ పరిమాణాల్లో తినిపిస్తే కడుపుబ్బరం, అసౌకర్యంతో పిల్లలు బాధపడతారు
- **నీరు సరిపడా:** చిరుధాన్యాల్లో పీచు ఎక్కువ కాబట్టి పిల్లలకు సరిపడా నీళ్లు తాగిస్తూ ఉండాలి.

• **హరిప్రియ ఎన్,** క్లినికల్ న్యూట్రిషనిస్ట్, క్లౌడ్ నైన్ హాస్పిటల్, టి నగర్.

గైనకాలజీ



మహిళల మానసిక ఆరోగ్యం అంతర్గత హార్మోన్ల మీదే ఆధారపడి ఉంటుంది. కాబట్టి జీవితంలోని వేర్వేరు దశల్లో హెచ్చుతగ్గులకు లోనయ్యే హార్మోన్ల ప్రభావాలు, వాళ్ల మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తూ ఉంటాయి. ఉన్నట్టుండి విరుచుకుపడడం, చికాకు ప్రదర్శించడం, తీవ్రంగా కుంగిపోవడం... ఇలాంటి భావోద్వేగాలు అయోమయానికీ, గందరగోళానికీ గురి చేస్తుంటే, అందుకు కారణమైన అస్తవ్యస్థ హార్మోన్లను అదుపులోకి తెచ్చుకోవాలంటున్నారు వైద్యులు.

భావోద్వేగాల పగ్గాలు హార్మోన్ల చేతుల్లో...

నెలసరికి 15 రోజుల ముందు నుంచే శరీరంలో మార్పులు చోటు చేసుకుంటాయి. ఆ సమయంలో ఈస్ట్రోజన్ మోతాదు తగ్గుతూ ప్రొజెస్టరాన్ మోతాదు పెరుగుతుంది. ఈస్ట్రోజన్‌కూ సెరటోనిన్ అనే హ్యాపీ హార్మోన్‌కూ సంబంధం ఉంటుంది. ఈ సమయంలో సెరటోనిన్ కూడా తగ్గడంతో శరీరం బరువు పెరగడం, రొమ్ముల్లో సలపరం, చిన్న విషయానికే కోపం తెచ్చుకోవడం, కుంగిపోవడం లాంటి లక్షణాలు మొదలవుతాయి. అయితే ఈ పరిస్థితి కొందర్లో తీవ్రంగా ఉంటుంది. అలాంటివాళ్లు ప్రొటీన్ ఆధారిత ఆహారంతో పాటు ఫైటోఈస్ట్రోజన్స్ కలిగి ఉండే సోయా, మొలకలు తీసుకోవాలి. అలాగే ధ్యానం, యోగా వల్ల కూడా ఉపయోగం ఉంటుంది. అరుదుగా కొందర్లో భావోద్వేగాల తీవ్రత ఉధృతంగా ఉంటుంది. ఆత్మహత్య ఆలోచనలు కూడా వాళ్లను వేధిస్తాయి. ఇలాంటి వాళ్లు హార్మోన్ల ఉధృతిని తగ్గించే మందులు తీసుకోవాల్సి ఉంటుంది. శారీరక అసౌకర్యంతో పాటు, నెలసరి స్రావంలో సమస్యలు, భావోద్వేగాల సమస్యలు ఉంటే, వారికి వైద్యులు, కొన్ని రోజుల పాటు గర్భనిరోధక నోటి మాత్రలను సూచిస్తారు. వీటిలో ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ హార్మోన్లు స్వల్పంగా ఉంటాయి. కాబట్టి పరిస్థితి సర్దుకుంటుంది. భావోద్వేగాల తీవ్రత ఎక్కువగా ఉంటే, అందుకు ఉద్దేశించిన యాంటీ డిప్రెసెంట్స్‌ను వాడుకోవాలి. అలాగే హ్యాపీ హార్మోన్ అయిన సెరటోనిన్‌ను పెంచుకుని మానసిక స్థితిని సరిదిద్దుకోవడం కోసం రోజుకు కనీసం అరగంట పాటైనా నడుస్తూ ఉండాలి లేదా వ్యాయామం చేయాలి.

గర్భిణులు, బాలింతల్లో ఇలా...

పునరుత్పత్తి సమయంలో కూడా శరీరంలో ప్రొజెస్టరాన్ హార్మోన్ పెరుగుతుంది. దాంతో భావోద్వేగాలు అదుపు తప్పుతాయి. కుంగుబాటు వేధిస్తుంది. కాబట్టి ఈ సమయంలో గర్భిణులకు కుటుంబ తోడ్పాటు ఎంతో అవసరం. మరీ ముఖ్యంగా ప్రసవమైన వెంటనే ఈస్ట్రోజన్‌తో పాటు ప్రొజెస్టరాన్ హార్మోన్ కూడా అకస్మాత్తుగా తగ్గిపోతుంది. దాంతో భావోద్వేగాల్లో మార్పులొస్తాయి. ఈ పరిస్థితికి తోడు ప్రసవానంతరం శరీరంలో చోటుచేసుకునే మార్పులు, అసౌకర్యం, నిద్రలేమి, సర్జరీ సంబంధిత నొప్పులు, ప్రతి రెండు గంటలకూ బిడ్డకు పాలు పట్టించడం లాంటివన్నీ తోడై మానసిక ఆరోగ్యం మరింత కుదేలవుతూ ఉంటుంది. అరుదుగా కొందర్లో ఆత్మహత్య ఆలోచనలు, ప్రతికూల ఆలోచనలు తలెత్తుతాయి. బిడ్డకు హాని తలపెట్టాలనే ఆలోచనలు కూడా కొందర్ని వేధిస్తాయి. ఈ పరిస్థితే... 'పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్'. ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే తల్లి, అత్త, భర్త... ఇలా కుటుంబంలోని ప్రతి ఒక్కరూ కొత్త తల్లికి ఆసరా అందించాలి. అవసరాన్ని బట్టి వైద్యుల చేత కౌన్సెలింగ్ ఇప్పించాలి. అలాగే బిడ్డకు పాలివ్వడం వల్ల నిద్రాభంగమవుతూ ఉంటే, పాలు నిల్వ చేసుకుని కుటుంబసభ్యుల సహాయంతో బిడ్డకు పట్టించవచ్చు. ప్రసవంతో కెరీర్‌కు ఆటంకం ఏర్పడిందనే భయాలు కూడా బాలింతలను వేధిస్తూ ఉంటాయి. వీటిని తొలగించే బాధ్యత భర్తలు తీసుకోవాలి. అలాగే జంక్‌ఫుడ్, తీపి పదార్థాలకు బదులుగా సమతులాహారం తీసుకోగలిగితే, ఈ పరిస్థితి సర్దుకుంటుంది. అలాగే కంటి నిండా నిద్రపోవాలి. కోలుకున్న వెంటనే వ్యాయామాలు మొదలుపెట్టుకోవాలి. తల్లి బిడ్డకు పాలివ్వకుండా, పట్టించుకోకుండా వదిలేస్తూ ఉంటే, పరిస్థితిని పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ ముందరి స్థితిగా పరిగణించి వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. తాత్కాలిక చికిత్సతో ఈ సమస్యను సరిదిద్దుకోవచ్చు.

> **అత్యవసర గర్భనిరోధక మాత్రలతో...**
>
> ఈ మాత్రల్లో ప్రొజెస్టరాన్ అత్యధిక మోతాదులో ఉంటుంది. కాబట్టి సంబంధిత దుష్ప్రభావాలను కూడా భరించవలసి వస్తుంది. పిల్ తీసుకున్న వారం రోజుల వరకూ చికాకు, కోపం, కుంగుబాటు లాంటి భావోద్వేగాలు వేధిస్తాయి. కాబట్టి ఇలాంటి మాత్రలను కేవలం అత్యవసర సమయాల్లోనే వాడుకోవాలి. కానీ తేలికగా కొనుక్కునే వీలుండడంతో వీటిని ఇష్టారాజ్యంగా వాడుకున్న సందర్భాలు పెరుగుతున్నాయి. ఫలితంగా నెలసరి క్రమం తప్పి, తిరిగి గాడిలో పడడానికి ఎంతో కాలం పడుతుంది. గర్భధారణ కూడా క్లిష్టంగా మారుతుంది. కొందరు ఎమర్జెన్సీ పిల్స్‌కు బదులుగా అదే ప్రభావంతో కూడిన ఇంజెక్షన్లు కూడా తీసుకుంటూ ఉంటారు. వీటితో రక్తం గడ్డలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది.

మెనోపాజ్‌లో...

టీనేజీ వయసులో నెలసరి సమయంలో ప్రిమెన్‌స్ట్రువల్ సిండ్రోమ్‌తో బాధపడిన అమ్మాయిలు మెనోపాజ్‌లో కూడా తీవ్రమైన భావోద్వేగాలకు లోనవుతారు. అలాగే మెనోపాజ్‌లోకి ప్రవేశించి, ఆ దశకు చేరుకునే క్రమంలో మహిళల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. కోడళ్ల మీద విరుచుకుపడుతూ, అడపాదడపా ఏడుస్తూ, అసహనాన్ని ప్రదర్శించే అధిక శాతం అత్తల్లో మనం చూసిన భావోద్వేగాల వెనకుండే అసలు కారణం ఇదే! కానీ ఈ భావోద్వేగాలన్నీ హార్మోన్ అవకతవకల ప్రభావాలే అనే విషయాన్ని అందరూ గ్రహించలేరు. అయితే ఇలాంటి దశలో ఉన్న మహిళలకు మానసిక ఆలంబన ఎంతో అవసరం. కుటుంబ సభ్యులందరూ ఆమెకు అండగా ఉండి, తోడ్పాటును అందించాలి. అలాగే వ్యాయామంతో ఈ పరిస్థితిని అదుపులోకి తీసుకురావచ్చు. కాబట్టి 40 ఏళ్లకు చేరుకున్న ప్రతి మహిళా దైనందిన జీవితంలో వ్యాయామానికి చోటు కల్పించాలి. కుటుంబసభ్యులతో కాలక్షేప సమయాన్ని పెంచుకోవాలి. వీలైనంత వరకూ మనసును ఆహ్లాదంగా ఉంచే పనులు ఎంచుకోవాలి. ఈ దశలో కండరాలు, ఎముకల నష్టం ఉంటుంది కాబట్టి క్యాల్షియం సప్లిమెంట్లు తీసుకోవడంతో పాటు, బరువులెత్తే వ్యాయామాలు చేయాలి. పరిస్థితి తీవ్రతను బట్టి సురక్షితమైన హార్మోన్ థెరపీ చికిత్సను కూడా ఆశ్రయించవచ్చు.



అర్థం లేని కుంగుబాటు

వ్యక్తిగత, వృత్తిగత జీవితాల్లో ఉన్నత స్థితిలో ఉన్న విజయవంతమైన మహిళలు కూడా కుంగుబాటుకు లోనవుతూ ఉంటారు. ఇందుకు కూడా హార్మోన్లే కారణం. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొనే మహిళలు హార్మోన్లను పరీక్షించుకుని, లక్షణాల ఆధారంగా చికిత్సను ఎంచుకోవాలి.

డాక్టర్ స్వప్న పూస్కూరు
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ, బర్త్‌రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్, హైదరాబాద్.



మందులు - పదార్థాలు

కొన్ని పదార్థా లు మందుల ప్రభావాన్ని పక్కదోవ పటిస్తాయి. ఇంకొన్ని ఆరోగ్య సమస్యలను తెచ్చి పెడతాయి. కాబట్టి కొన్ని మందులను నిర్దిష్ట పదార్థాలతో కలిపి తీసుకోకూడదు. అవేంటో తెలుసుకుందాం!

దుష్ప్రభావాలు



- మాక్సిఫ్లాక్సాసిన్, సిప్రోఫ్లాక్సాసిన్, లివోఫ్లాక్సాసిన్ మొదలైన ఫ్లోరోక్వినోలోన్స్ కలిగిన కొన్ని యాంటీబయాటిక్స్‌ను పాలు, పెరుగు, జున్నులతో కలిపి తీసుకోకూడదు. ఈ పాల ఉత్పత్తులు యాంటీబయాటిక్స్‌తో కలిసిపోయి, వాటి శోషణను కుంటుపరుస్తాయి
- కొన్ని టెట్రాసైక్లిన్ మందులు కూడా పాల ఉత్పత్తులతో కలిసి ప్రతికూల ప్రభావాన్ని కనబరుస్తాయి. కాబట్టి ఈ మందులు తీసుకోడానికి రెండు గంటల ముందు నుంచి పాల ఉత్పత్తులకు దూరంగా ఉండాలి
- హ్యాంగోవర్‌కు విరుగుడుగా అసిటమినోఫిన్ లేదా పారాసిటమాల్ తీసుకోకూడదు. మద్యం, అసిటమినోఫిన్ లేదా పారాసిటమాల్ మిశ్రమం కాలేయ టాక్సిసిటీని పెంచుతుంది
- వార్ఫరిన్ రక్తాన్ని పలుచబరిచే మందు. విటమిన్ కె సమృద్ధిగా ఉండే పాలకూర, బ్రొకొలిలతో కలిపి వార్ఫరిన్‌ను తీసుకుంటే, ఈ మందు ప్రభావం తగ్గుతుంది. వీటితో పాటు మయొనీస్, ఆలివ్ నూనె, సోయా నూనె, కనోలా నూనెలు కూడా ఈ మందు ప్రభావాన్ని తగ్గిస్తాయి.
- మద్యం, ఇన్సులిన్‌తో పాటు ఇతర మధుమేహ మందుల మీద ప్రభావం కనబరుస్తుంది. ఈ మందులను మద్యంతో కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర తగ్గిపోయి హైపోగ్లైసీమియాకు గురి కావచ్చు లేదా పెరిగిపోయి హైపర్‌గ్లైసీమియాకు లోను కావచ్చు.

మీకు తెలుసా?

శుద్ధి చేసిన చిరుతిండ్లతో క్యాన్సర్

అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధన ఏజెన్సీ ఐఎఆర్‌సి, శుద్ధి చేసిన మాంసాన్ని గ్రూప్ 1 క్యాన్సర్ కారకంగా గుర్తించింది. దీని తర్వాతి స్థానం చక్కెరదే! ఏదో ఒక చిరుతిండి తినాలనే కోరికతో మనం అందుకునే ప్యాకేజ్డ్ ఫుడ్స్ క్యాన్సర్ కారకాలుగా మారుతున్నాయి. ఆ పదార్థాలు వాటిలోని విషపూరితాల గురించి తెలుసుకుందాం!

అదనపు చక్కెర స్థూలకాయంతో పాటు, రొమ్ము, కాలేయం, పెద్దపేగు క్యాన్సర్లకు దారి తీస్తుంది. అలాగే ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కు దారి తీసి, తీవ్రమైన ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతుంది. శుద్ధి చేసిన పదార్థాలను ఎక్కువగా తిన్న వాళ్లలో క్యాన్సర్ ముప్పు ప్రత్యేకించి రొమ్ము క్యాన్సర్ ముప్పు మరింత ఎక్కువనే ఒక పరిశోధనాత్మక వ్యాసం బ్రిటిష్ మెడికల్ జోర్నల్‌లో తాజాగ ప్రచురితమైంది. శుద్ధి చేసిన పదార్థాల్లో కొవ్వు, చక్కెర, ఉప్పులు ఎక్కువగా ఉండడంతో పాటు పీచు, కీలకమైన పోషకాలు ఎంతో తక్కువగా ఉంటాయి. శుద్ధి చేసిన పదార్థాల అసహజ నిర్మాణాలు శక్తిని ఖర్చు చేసేకునే సాధారణ తత్వాన్ని కుంటుపరిచి, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌కు గురి చేస్తాయనీ, ఫలితంగా క్యాన్సర్ సోకుతుందనీ వైద్యులు అంటున్నారు. ప్రొటీన్ బార్స్, గ్రనోలా బార్స్ తీయని పెరుగు లాంటి వాటిని మనం ఆరోగ్యకరమైన చిరుతిండ్లుగా పరిగణిస్తూ ఉంటాం. కానీ వీటన్నిట్లో చక్కెరలు, నూనెలు, రసాయనాలు దాగి ఉంటాయి. సేంద్రీయమైనవి, సహజసిద్ధమైనవిగా ప్రచారంలో ఉన్న ఉత్పత్తుల్లో సైతం క్యాన్సర్ కారకాలు ఉంటాయి కాబట్టి వాటికి కూడా దూరంగా ఉండడం మేలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే శుద్ధి చేసిన చిరుతిండ్లను ఇష్టపడేవారు పొట్టు తీయని, శుద్ధి చేయని నట్స్, పాప్‌కార్న్ లేదా ఇంట్లో తయారుచేసిన చిరుతిండ్లను ఎంచుకోవచ్చు. అలాగే కొనే ప్రతి చిరుతిండి ప్యాకెట్ లేబుల్‌ను పరిశీలిస్తూ, కృత్రిమ రుచులు, రంగులు, అత్యధిక చక్కెరలు, హైడ్రోజినేటెడ్ కొవ్వులున్న వాటి జోలికి వెళ్లకుండా ఉండాలి.



రూమ్ ఫ్రెష్‌నర్



వానాకాలం తేమ, తడి వల్ల ఇంట్లో ముక్కిపోయిన వాసనలు పేరుకుపోతూ ఉంటాయి. వీటిని వదిలించుకోవడం కోసం రూమ్ ఫ్రెషనర్స్ వాడుకుంటున్నారా? అయితే వాటి దుష్ప్రభావాల పట్ల అవగాహన పెంచుకుని, ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించడం నేర్చుకుందాం!

ఇంట్లో ఆరోగ్యకరమైన పరిమళాలు

ఆహ్లాదకరమైన వాసనలు వెదజల్లే రూమ్ ఫ్రెషనర్స్‌లో ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రమాదకరమైన రసాయనాలుంటాయి. ఇవి ఊపిరితిత్తులను నష్టపరచడమే కాకుండా హార్మోన్లను అస్తవ్యస్థం చేసేంత ప్రభావాన్ని కూడా కలిగి ఉంటాయి. వీటిని దీర్ఘకాలం పాటు వాడుకోవడం వల్ల ప్రత్యేకించి పెంపుడు జంతువులు, పిల్లలకు, శ్వాసకోశ సమస్యలున్న వారికీ రెట్టింపు చేటు జరుగుతుంది. రూమ్ ఫ్రెషనర్స్‌లో దాగి ఉన్న ప్రమాదాలు ఏవంటే...

అస్థిర సేంద్రీయ సమ్మేళనాలు: గాల్లో కలిసిపోయే పరిమళాలు వెదజల్లే అస్థిర సేంద్రీయ సమ్మేళనాలు రూమ్ ఫ్రెషనర్స్‌లో ఉంటాయి. ఇవి గదులను పరిమళభరితం చేసినప్పటికీ, వీటిలోని అసిటోన్, ఇథనాల్, లైమోనిన్ రసాయనాలు కళ్లు, గొంతు, ఊపిరితిత్తులను ఇబ్బంది పెడతాయి. దీర్ఘకాలం పాటు వీటికి బహిర్గతం అవడం వల్ల కాలేయం, మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఈ అస్థిర సేంద్రీయ సమ్మేళనాలు గాలితో ప్రతిచర్య జరిపి ఫార్మాల్డిహైడ్ అనే క్యాన్సర్ కారకంగా మారతాయి.

హార్మోన్లు అస్తవ్యస్థం: సువాసన ఎక్కువ సమయం పాటు నిలిచి ఉండడం కోసం రూమ్ ఫ్రెషనర్స్‌లో థాలేట్స్ కలుపుతారు. ఈ రసాయనాలు అంతఃస్రావ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తాయి. వీటికి క్రమం తప్పక బహిర్గతం కావడం వల్ల, పునరుత్పత్తి వ్యవస్థ దెబ్బతింటుంది. మరీ ముఖ్యంగా గర్భిణులు, పసికందులకు వీటితో ప్రమాదం ఎక్కువ. 'సహజసిద్ధ' లేదా 'అన్‌సెంటెడ్' అని పేర్కొనే ఉత్పత్తుల్లో సైతం థాలేట్స్ ఉంటాయి.

ఉబ్బసం: ఉబ్బసం లేదా శ్వాసకు సంబంధించిన సమస్యలున్నవారు రూమ్ ఫ్రెషనర్స్‌కు బహిర్గతమైనప్పుడు, వారి లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. వాటిలోని పరిమళాలు, రసాయనాల వల్ల దగ్గు, పిల్లికూతలు, శ్వాసలో ఇబ్బందులు తలెత్తవచ్చు. వీటికి అల్పస్థాయిలో బహిర్గతమైనప్పటికీ, పిల్లలు, పెద్దల్లో ఉబ్బసం ముప్పు పెరిగే అవకాశం ఉంటుందని పరిశోధనల్లో తేలింది.

ఇంటి కాలుష్యం: బయటి కాలుష్యంలాగే ఇంటి కాలుష్యం కూడా ప్రమాదకరమైనదే! బెంజీన్, టోలిన్, ఫార్మాల్డిహైడ్‌లను ఇళ్లలో విడుదల చేయడం ద్వారా రూమ్ ఫ్రెషనర్స్ ఇంటిని కలుషితం చేస్తాయి. ఇంట్లోకి ధారాళంగా గాలి చొరబడే వీలు లేనప్పుడు, ఈ రసాయనాలు గాల్లో అదృశ్యమైపోకుండా, అక్కడే నిలిచి ఉండి, వాతావరణాన్ని కలుషితం చేస్తాయి.

పెంపుడు జంతువులు: గాల్లో కలిసే రసాయనాలు పెంపుడు జంతువులకు రెట్టింపు ప్రమాదకరమైనవి. కుక్కలు, పిల్లులు ప్రత్యేకించి పక్షులు ఈ రసాయన సమ్మేళనాల ప్రభావానికి ఎక్కువగా గురవుతాయి. తుమ్ములు, దగ్గులు, చర్మపు దురదలు లేదా ప్రవర్తనల్లో మార్పులు పెంపుడు జంతువుల్లో కనిపిస్తాయి.

ప్రత్యామ్నాయాలు: రూమ్ ఫ్రెషనర్స్ చెడు వాసనలను కప్పేస్తాయి తప్ప, వాటిని తొలగించవు. బూజు, పొగ, పెంపుడు జంతువుల విసర్జకాల వాసనలు ఇంట్లోని గాలి నాణ్యతను దెబ్బతీస్తాయి. ఇవన్నీ దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని పాడు చేస్తాయి. కాబట్టి దుర్వాసనలకు మూల కారణాలను కనిపెట్టే ప్రయత్నం చేయాలి. గాలి, వెలుతురు ధారాళంగా చొరబడేలా కిటికీలు, తలుపులను తెరచి ఉంచాలి. వెడల్పాటి పాత్రలో నీళ్లు నింపి, గులాబీలు లాంటి సువాసన వెదజల్లే పూలతో నింపుకుంటే, గదిలో పరిమళాలు పరుచుకుంటాయి. లెమన్, లావెండర్, యూకలిప్టస్ ఎసెన్షియల్ ఆయిల్స్ బేకింగ్ సోడా, నీళ్లు కలిపి, రూమ్ ఫ్రెషనర్‌లా స్ప్రే చేసుకోవచ్చు.

పుతిన్‌తో పాటు 'పూప్ సూట్‌కేస్'

- అలాస్కాకు తీసుకెళ్లిన భద్రతా సిబ్బంది
- సూట్‌కేస్‌లో మలవ్యర్థాలన్నీ మాస్కోకు
- ఆరోగ్య వివరాలు ఎవరికీ తెలియకుండా ఉండేందుకే

న్యూఢిల్లీ, ఆగస్టు 18: రష్యా అధ్యక్షుడు పుతిన్ భద్రతకు ఆ దేశం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో చెప్పడానికి 'పూప్ (మలవ్యర్థాల) సూట్‌కేస్' ఓ ఉదాహరణ. ఇటీవల అలాస్కాలో ట్రంప్‌తో పుతిన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఓ ప్రత్యేక బాధ్యతలో కనిపించారు. అదేమిటి అంటే ఆయన కాలకృత్యాల తర్వాత ఆ మల మూత్రాలను సేకరించే పని. సేకరించిన వ్యర్థాలను ఓ సూట్‌కేసులో భద్రపరిచి తిరిగి మాస్కోకు తీసుకెళ్లిపోయారు. ఇలా ఎందుకంటే, విదేశీ శక్తులు ఎవరూ ఆ వ్యర్థాలతో పుతిన్ ఆరోగ్య వివరాలేవీ కనిపెట్టకుండా ఉండటానికని తెలుస్తోంది. చాలా ఏళ్ల నుంచి భద్రతా సిబ్బంది ఇదే విధంగా చేస్తున్నారు. 2017లో పుతిన్ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లినప్పటి నుంచి భద్రతా అధికారులు ఇలా చేస్తున్నారని ఎక్స్‌ప్రెస్ యూఎస్ వార్తా సంస్థ కథనం తెలిపింది.



ముంబైలో రెడ్ అలర్ట్

భారీ వర్షాలతో నగరం అతలాకుతలం

- రైళ్లు, విమాన రాకపోకలకు అంతరాయం
- నాందేడ్ జిల్లాలో ఐదుగురు గల్లంతు

ముంబై, ఆగస్టు 18: భారీ వర్షాలు ముంబై నగరాన్ని ముంచెత్తుతున్నాయి. ముంబైతోపాటు మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపిలేని వానల కారణంగా నాందేడ్ జిల్లా ముఖేడ్ తాలూకాలో ఐదుగురు గల్లంతయ్యారు. 200 మందికిపైగా వరదల్లో చిక్కుకుపోయారు. ముంబైలో సోమవారం 17.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంబై, ఠాణె, రాయగడ్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మరో మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రెడ్ అలర్ట్ జారీచేసింది. దీంతో అధికారులు సోమవారం మధ్యాహ్నం నుంచి పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. మూడు రోజులుగా కురుస్తున్న వానలకు ముంబైలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించక అనేక విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ముంబై నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నందున షెడ్యూల్ సమయం కంటే కాస్త ముందుగానే విమానాశ్రయాలకు చేరుకోవాలని ప్రముఖ విమానయాన సంస్థలు ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్ జెట్ తమ ప్రయాణికులకు అడ్వైజరీ జారీచేశాయి. విమానాశ్రయానికి బయల్దేరే ముందు తమ వెబ్‌సైట్‌లో విమాన సర్వీసులకు సంబంధించిన వివరాలను తనిఖీ చేసుకోవాలని సూచించాయి. అత్యవసరమైతే తప్ప పౌరులు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) విజ్ఞప్తి చేసింది. అరేబియా సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని ఐఎండీ హెచ్చరించింది.

అవసరమైతే ఉక్రెయిన్‌కు.. అమెరికా దళాలు!

భద్రతకు కట్టుబడి ఉంటాం.. శ్వేతసౌధంలో జెలెన్‌స్కీతో భేటీలో ట్రంప్

- తర్వాత యూరప్ నేతలతో కలసి భేటీ

వాషింగ్టన్, ఆగస్టు 18: ఉక్రెయిన్‌కు రక్షణగా నిలుస్తామని.. శాంతి కోసం అవసరమైతే అమెరికా దళాలను పంపించడానికి సిద్ధంగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. యూరప్ దేశాలు ముందు నిలుస్తాయని, తాము వీలైనంత సహాయం చేస్తామని చెప్పారు. యూరప్ దేశాలతో చర్చలు, సంప్రదింపుల తర్వాత దీనిపై స్పష్టత వస్తుందన్నారు. నిజానికి కాల్పుల విరమణ పాటించాలని తాను కోరానని, కానీ రష్యా అధ్యక్షుడు పుతిన్ అందుకు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. సోమవారం అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధంలో జెలెన్‌స్కీ, యూరప్ దేశాల నేతలతో జరిగిన చర్చల్లో ట్రంప్ ఈ వివరాలు వెల్లడించారు. ఈ చర్చల తర్వాత పుతిన్‌కు ఫోన్ చేసి మాట్లాడనున్నట్టు చెప్పారు. ఇక శాంతి ఒప్పందంలో భాగంగా తమ భద్రతకు అవసరమైన అన్ని రకాల సహాయం చేయాలని అమెరికా, యూరప్ దేశాలను జెలెన్‌స్కీ కోరారు. బలమైన సైన్యం, ఆయుధాలు, శిక్షణ, నిఘా వ్యవస్థలు ఉక్రెయిన్‌కు అవసరమని.. ఇదంతా అమెరికా, యూరప్ దేశాల చేతిలో ఉందని పేర్కొన్నారు. యూరప్‌లో ఒక్క దేశంలో శాంతికోసం చర్చించడమంటే.. మొత్తం యూరప్ శాంతి కోసమని జెలెన్‌స్కీ అభివర్ణించారు. తాము యుద్ధం నిలిపివేయడంపై దృష్టిపెడితే.. రష్యా దాడులు చేస్తూ, ప్రజల ప్రాణాలను బలితీసుకుంటోందని మండిపడ్డారు. ట్రంప్‌తో భేటీ కోసం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోపాటు ఫ్రాన్స్, ఫిన్లాండ్ అధ్యక్షులు మేక్రాన్, అలెగ్జాండర్ స్టబ్, బ్రిటన్, ఇటలీ ప్రధానులు కీర్ స్టార్మర్, జార్జియా మెలోనీ, జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, నాటో జనరల్ సెక్రెటరీ మార్క్ రూట్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా లెయెన్ శ్వేతసౌధానికి వచ్చారు. ఒక దేశం విషయంలో ఇంత మంది ప్రపంచ నేతలు ఇలా తమ పనులన్నీ వదులుకుని వచ్చి భేటీకావడం అరుదైన ఘటన అని అమెరికా అధికారవర్గాలు పేర్కొన్నాయి.



సోమవారం జెలెన్‌స్కీతో సమావేశమైన ట్రంప్

పతుల ద్వారా సతుల లేఖలు!

ఉక్రెయిన్‌లో యుద్ధం ఆపాలంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ట్రంప్ సతీమణి మెలనియా లేఖ రాసిన సంగతి తెలిసిందే. అలాస్కాలో జరిగిన చర్చల సందర్భంగా ట్రంప్ స్వయంగా ఆ లేఖను పుతిన్‌కు అందజేశారు. తాజాగా చర్చల కోసం శ్వేత సౌధానికి వచ్చిన జెలెన్‌స్కీ.. ట్రంప్ సతీమణి మెలనియాకు తన సతీమణి ఒలెనా జెలెన్‌స్కా రాసిన లేఖను ట్రంప్‌కు అందించారు. మరోవైపు, యుద్ధ విరమణ కోసం వాషింగ్టన్‌లో ట్రంప్, జెలెన్‌స్కీ, యూరప్ నేతలు భేటీ అవుతున్న తరుణంలోనే.. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగాయి. ఈ దాడుల్లో ఏడుగురు చనిపోయారని ఉక్రెయిన్ ప్రకటించింది.

ఆ రెండూ వదులుకోవాల్సిందే!

జెలెన్‌స్కీ, యూరప్ దేశాల నేతలతో భేటీకి ముందు యుద్ధ విరమణ కోసం ఉక్రెయిన్ తన డిమాండ్లను వదులుకోవాల్సిందేనంటూ ట్రంప్ ట్రూత్ వేదికగా పోస్టు పెట్టారు. 12 ఏళ్ల క్రితం రష్యా చేతిలోకి వెళ్లిన క్రిమియా ద్వీపకల్పం తిరిగి రాదని, నాటోలోకి ఉక్రెయిన్‌కు ప్రవేశం ఉండదని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే రష్యాకు ఉక్రెయిన్ భూభాగాల అప్పగింత అంశాన్ని మాత్రం ఆయన ప్రస్తావించలేదు.

సూట్‌లో బాగున్నారు జెలెన్‌స్కీ!

ట్రంప్‌తో, ఇతర దేశాధినేతలతో భేటీల సమయంలో జెలెన్‌స్కీ సాధారణ టీషర్టులు ధరించి వస్తుంటారు. అధికారిక భేటీలకు ఇలా రావడం ఏమిటన్న విమర్శలు ఉన్నాయి. గతంలో ట్రంప్‌తో భేటీలో ఓ జర్నలిస్టు దీనిపై ప్రశ్నించడం, ఆ భేటీలో ట్రంప్‌తో జెలెన్‌స్కీ వాగ్వాదం చర్చనీయాంశంగా మారాయి కూడా. తాజాగా ట్రంప్ భేటీకి వచ్చే ముందు కాస్త పద్ధతిగా దుస్తులు ధరించి రావాలని అమెరికా అధికారులు జెలెన్‌స్కీని కోరినట్టు సమాచారం. సోమవారం ట్రంప్‌తో భేటీలో జెలెన్‌స్కీ నలుపు రంగు ఫార్మల్ సూట్ ధరించి కనిపించారు. 'మీరు ఈ సూట్‌లో చాలా బాగున్నారు' అని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొనడం గమనార్హం.

మోదీకి పుతిన్ ఫోన్

ప్రధాని మోదీకి సోమవారం పుతిన్ ఫోన్ చేశారు. అలాస్కాలో ఈ నెల 15న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో జరిగిన సమావేశం వివరాలను పంచుకున్నారు. ఉక్రెయిన్‌తో సంక్షోభం శాంతియుతంగా ముగియాలన్న మోదీ.. ఈ దిశగా జరుగుతున్న యత్నాలకు భారత్ అన్ని విధాలుగా సహకరిస్తుందని మోదీ ఈ సందర్భంగా పుతిన్‌తో చెప్పినట్లు పీఎంవో కార్యాలయం వెల్లడించింది.

భారత్ నుంచి అమెరికాకు 7 రెట్లు పెరిగిన ఎగుమతులు


ట్రంప్ ప్రతీకార సుంకాల హెచ్చరికలే కారణం

న్యూఢిల్లీ, ఆగస్టు 18: ట్రంప్ ప్రతీకార సుంకాల హెచ్చరికల నేపథ్యంలో.. భారతీయ ఎగుమతిదారులు 'ఫ్రంట్‌లోడింగ్' పెంచారు! ఫ్రంట్‌లోడింగ్ అంటే.. సుంకాలు పెరుగుతాయని తెలిసినప్పుడు ముందే పెద్ద ఎత్తున ఎగుమతులను పెంచడం. ఎంతగా పెంచారంటే.. ఏప్రిల్-జూలై నెలల మధ్య అమెరికాకు మన ఎగుమతులు ఏకంగా 21 శాతం పెరిగి 33.5 బిలియన్ డాలర్లకు (రూ.2.92 లక్షల కోట్లకు) చేరింది. ఇదే సమయంలో.. భారత్ నుంచి మొత్తం ఎగుమతులు కేవలం 3 శాతం మాత్రమే పెరిగి 149.2 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.13 లక్షల కోట్లకు) చేరాయి. అంటే.. మనదేశం నుంచి పెరిగిన మొత్తం ఎగుమతులతో (3%) పోలిస్తే.. అమెరికాకు (21%) ఏడు రెట్లు ఎక్కువ పెరిగాయని గణాంకాలను ఉటంకిస్తూ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ప్రకారం... ఎగుమతులను భారీగా పెంచేయడం వల్ల.. కొనుగోలుదారులకు కొంతమేర రాయితీ ఇచ్చే అవకాశం పెరుగుతుంది. తద్వారా.. ఆగస్టు 27 నుంచి సుంకాలు 50 శాతానికి చేరినా, ఇప్పుడు ఇచ్చే రాయితీని కలుపుకొంటే అప్పుడు కొనుగోలుదారులు అమెరికన్ వినియోగదారులకు కొంత తక్కువ ధరకే ఆ ఉత్పత్తులను విక్రయించే అవకాశం కలుగుతుంది. అందుకే మన ఎగుమతిదారులు ఎక్స్‌పోర్ట్స్‌ను భారీగా పెంచారు. తమ వ్యాపారాన్ని కోల్పోకుండా ఉండేందుకు.. పాత కొనుగోలుదారులకు అదనపు రాయితీలు కూడా ఇవ్వజూపుతున్నారు. ప్రస్తుతానికి పెంచిన (25%) సుంకాల దెబ్బ పూర్తిస్థాయిలో తమపై పడకుండా ఎగుమతిదారులు తీసుకుంటున్న ఈ చర్యలు తాత్కాలికమేనని.. సుంకాల భారం 50 శాతానికి పెరిగితే వారి వ్యాపారంపై తీవ్ర ప్రభావం పడుతుందని పరిశ్రమల నిపుణులు చెబుతున్నారు. కాగా, ఏప్రిల్-జూలై నడుమ ఎగుమతులతో పోలిస్తే.. ఒక్క జూలై నెలలో భారత్ నుంచి ఎగుమతులు భారీగా పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ఉదాహరణకు.. జెమ్స్ అండ్ జువెలరీ రంగంలో ఎగుమతులు జూలైలో 28% మేర పెరిగాయి. ఫార్మా ఉత్పత్తుల ఎగుమతులు.. ఏప్రిల్-జూలై నడుమ 7.4% పెరిగితే, ఒక్క జూలైలోనే 14% మేర పెరిగాయి. ఇంజనీరింగ్ ఉత్పత్తులు ఏప్రిల్-జూలై నడుమ 6% పెరిగితే.. ఒక్క జూలైలోనే 13.8% పెరిగాయి. ప్లాస్టిక్ ఉత్పత్తుల ఎగుమతులు జూలైలో 4.4% మేర పెరిగాయి.

బెంబేలెత్తి యుద్ధనౌకలను దాచిన పాక్

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. పాకిస్థాన్‌లోని కరాచీ, గ్వదార్ పోర్టుల తాలూకు ఉపగ్రహ చిత్రాలను ఈ ఛానల్‌కు చెందిన 'ఓపెన్‌సోర్స్ ఇంటెలిజెన్స్ టీమ్' విశ్లేషించింది. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌లో కీలకమైన గ్వదార్ వాణిజ్య పోర్టులో వాణిజ్య నౌకల మధ్య పలు యుద్ధ నౌకలున్నట్లు తేలింది. వీటిలో పాక్ ఎంతో ఘనంగా చెప్పుకొనే జుల్ఫికర్ క్లాస్ నౌకలు రెండు, పాక్‌లో అతి పెద్ద యుద్ధనౌకలుగా పేరొందిన తుఘ్రిల్ క్లాస్ నౌకలు రెండు, అమెరికా నుంచి కొనుగోలు చేసిన ఏకైక యుద్ధనౌక ఒలివర్ హజార్డ్ పెర్రీ క్లాస్ నౌక, రెండు తీరప్రాంత గస్తీ నౌకలు ఉన్నాయని తెలిసింది. ఇరాన్ సరిహద్దులకు కేవలం 100 కి.మీ.ల దూరంలో ఉన్న గ్వదార్ పోర్టు ఈ విధంగా.. యుద్ధవేళ పాక్ నౌకాదళానికి తాత్కాలిక ఆశ్రయంగా మారటం విశేషం. ఇక కరాచీలోని పాకిస్థాన్ నౌకాదళ స్థావరం కూడా ఈ ఉపగ్రహ ఛాయాచిత్రాల్లో బోసిపోయి కనిపించింది. అక్కడ ఉండాల్సిన యుద్ధనౌకలు.. కరాచీ వాణిజ్య పోర్టులో ఓ సరుకు రవాణానౌక సమీపంలో ఉన్నాయి. ఆ సరుకు రవాణానౌకలో లోడింగ్/అన్‌లోడింగ్ ప్రక్రియ జరుగుతుండటం, అక్కడ పలు కంటెయినర్లు ఉండటం కూడా ఈ చిత్రాల్లో వెల్లడైంది. పీఎన్ఎస్ ఆలంగిర్‌తోపాటు మొత్తం నాలుగు యుద్ధనౌకలను, ఒక గస్తీ నౌకను ఇక్కడ దాచి పెట్టారు.



హడలెత్తించిన ఐఎన్ఎస్ విక్రాంత్

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ విక్రాంత్‌ను అరేబియా సముద్రంలో మోహరించటం, కరాచీ పోర్టును ధ్వంసం చేయటానికి భారత్ సిద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలోనే.. పాక్ తన యుద్ధనౌకలను ఈ విధంగా దాచి పెట్టి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 1971 యుద్ధవీరుడు, సదరన్ నావల్ కమాండ్ మాజీ కమాండర్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ ఎస్సీ సురేష్ బంగారా మాట్లాడుతూ, మన త్రివిధ దళాలు అత్యంత కచ్చితమైన సమన్వయంతో వ్యవహరించటం వల్ల, సముద్రం నుంచి ఒక్క క్షిపణిని కూడా ప్రయోగించకుండానే ఆశించిన లక్ష్యాలన్నింటినీ సాధించామని విశ్లేషించారు. ఆపరేషన్ సిందూర్ వేళ పాక్ తన యుద్ధవిమానాలను కూడా పౌరవిమానాలకు సమీపంలో నడిపించిందన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

చిరంజీవి భరోసా ఇచ్చారు

ఫెడరేషన్ నాయకులు



కార్మికుల సమ్మె నేపథ్యంలో ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు సోమవారం మెగాస్టార్ చిరంజీవిని కలిశారు. వారి కష్టాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షులు వల్లభనేని అనిల్ మీడియాతో మాట్లాడుతూ '24 క్రాఫ్ట్ విభాగాల నుంచి 72 మంది వెళ్లి చిరంజీవితో మాట్లాడాము. నిర్మాతలు మాపై నిందలు వేస్తున్నారు. మాకు సాధ్యంకాని నిబంధనలు పెడుతున్నారు. నిర్మాతల రెండు షరతులను అంగీకరిస్తే ఏం నష్టపోతామో చిరంజీవికి వివరించాం. డబుల్ కాల్‌షీట్ గురించి కూడా ప్రస్తావించాం. 'ఏ సమస్య వచ్చినా నా దగ్గరకు రండి' అని చిరంజీవి భరోసా ఇచ్చారు. కార్మికులతోపాటు నిర్మాతలు బాగుండాలనేదే మా కోరిక. మంగళవారం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహిస్తాం. అలాగే, చాంబర్‌తో కూడా సమావేశమవుతాం. చర్చలకు పిలిచారు కాబట్టి మేము నిరసనను కొనసాగించట్లేదు. చిరంజీవి అయినా, బాలకృష్ణ అయినా మా సమస్య పరిష్కారం కోసమే మాట్లాడతారు తప్ప ఒకరి వైపే ఉండరు' అని చెప్పారు. ఫెడరేషన్ కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ వీరశంకర్ మాట్లాడుతూ 'సినీ పరిశ్రమలో ఇలాంటి సమ్మెలు కొత్తకాదు. చాంబర్‌తో చర్చలు జరిగాక పరిష్కారం దొరుకుతుంది. నిర్మాతలు కూడా కార్మికుల పరిస్థితి అర్థం చేసుకోవాలి' అని అన్నారు.

ఆ రూల్స్‌తో సినిమాలు తీయలేం: ఎస్కేఎన్

50 ఏళ్ల కిందట యూనియన్లు రాసుకున్న నిబంధనల ప్రకారం ఇప్పటి నిర్మాతలు సినిమాలు నిర్మించలేరు అని నిర్మాత ఎస్కేఎన్ అన్నారు. ఈ నేపథ్యంలో ఓ పోస్ట్ ద్వారా నిర్మాతల అభిప్రాయాలను ఎస్కేఎన్ తెలిపారు. 'ఇతర చిత్ర పరిశ్రమల్లో ఉన్నట్లే టాలీవుడ్‌లోనే కార్మికుల పని గంటలు ఉండాలనేది నిర్మాతల కోరిక. అనేక కారణాల వల్ల నిర్మాతలకు సరైన ఆదాయం రావట్లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుల వేతనం పెంచడం మరింత భారమవుతుంది. సినీ కార్మికులకు వేతనాన్ని పెంచడాన్ని చిన్న నిర్మాతలు అంగీకరించట్లేదు. ఫిల్మ్ మేకింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చేందుకు నిర్మాతలు సరికొత్త మార్గాలను అన్వేషించాలి. సినిమా కోసం 24 విభాగాల్లోని కార్మికులు పనిచేసే విధానం మారాల్సి ఉంది. 50 ఏళ్ల కిందట యూనియన్లు రాసుకున్న నిబంధనల ప్రకారం ఇప్పటి నిర్మాతలు సినిమాలు నిర్మించలేరు. హైదరాబాద్ సినీ హబ్‌గా మారుతోంది. కార్మికులు ఇలాంటి నిబంధనలు విధించడం వల్ల ఇతర భాషల నుంచి మేకర్స్ నగరానికి రావడానికి ఆసక్తి చూపించరు' అని ఎస్కేఎన్ పేర్కొన్నారు.

ఆ సినిమాలపై ప్రభావం

సమ్మె కారణంగా షూటింగ్స్ క్యాన్సిల్ కావడం.. నిర్మాణంలో ఉన్న పలు సినిమాలకు తీవ్ర అడ్డంకిగా మారింది. ముఖ్యంగా దసరా, సంక్రాంతి పండగలకి విడుదల కావాల్సిన పలు సినిమాలపై ఈ సమ్మె ప్రభావం చూపుతోంది. రవితేజ కథానాయకుడిగా నటించిన 'మాస్ జాతర' ఈ నెల 27న విడుదల కావాల్సి ఉంది. అయితే, ఇంకా నాలుగు రోజుల షూటింగ్ మిగిలి ఉండడంతో పాటు సమ్మె కారణంగా అనుకున్న తేదీకి సినిమా విడుదల కాకపోవచ్చనే ప్రచారం జరుగుతోంది.



జాతీయ అవార్డు గ్రహీతలకు సీఎం సన్మానం

జాతీయ ఫిల్మ్ అవార్డులు అందుకున్న సినీ ప్రముఖులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలుగు చలన చిత్రాల్లో వివిధ విభాగాలకు జాతీయ అవార్డులు రావటం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు చైతన్యరెడ్డి, నిరంజన్‌రెడ్డి, సాహు గారపాటి, ఎస్కేఎన్, దర్శకులు అనిల్ రావిపూడి, ప్రశాంత్ వర్మ, సాయి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

కొన్ని రోజులుగా విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవలె భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా న్యూయార్క్‌లో నిర్వహించిన 'ద వరల్డ్ లార్జెస్ట్ ఇండియా డే' కవాతులో వారిద్దరూ పాల్గొనడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ వేడుకలో వారు తీసుకున్న ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.





నా కెరీర్‌లో గొప్ప సినిమా

నరేశ్ వీకే

సుహాస్, శివానీ నగరం హీరో హీరోయిన్లుగా నూతన దర్శకుడు గోపీ అచ్చర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రానికి 'హే భగవాన్' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బేనర్‌పై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. సుహాస్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నరేశ్ వీకే మాట్లాడుతూ 'ఈ సినిమా నా కెరీర్‌లో మరచిపోలేని గొప్ప సినిమా అవుతుంది. కథ విన్నప్పుడు పగలబడి నవ్వాను. చాలా కొత్త బ్యాక్‌డ్రాప్ తీసుకున్నారు' అని అన్నారు. సుహాస్ మాట్లాడుతూ 'ప్రశాంత్ ఈ సినిమాకి అద్భుతమైన కథ ఇచ్చాడు. కచ్చితంగా మంచి హిట్ కొడతాం. నరేశ్ గారితో పనిచేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని అన్నారు. హీరోయిన్ శివాని మాట్లాడుతూ 'ఈ సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు గోపీ అచ్చర్ల మాట్లాడుతూ 'ఈ చిత్రంలో తండ్రి కొడుకుల ఎమోషన్ హృదయాలకు హత్తుకుంటుంది' అని అన్నారు. నిర్మాత వంశీ నందిపాటి మాట్లాడుతూ 'సుహాస్ సినీ ప్రయాణం చాలా స్ఫూర్తివంతంగా ఉంటుంది' అని అన్నారు.

అచ్చమైన తెలుగు చిత్రం

అగస్త్య, రబియా ఖతూన్ జంటగా దర్శకుడు విపిన్ తెరకెక్కించిన సినిమా 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ'. సునేత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై ఉమాదేవి కోట నిర్మించారు. ఈ నెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఉమాదేవి, విపిన్ విలేకరులతో చిత్ర విశేషాలు వివరించారు. 'సినిమా అంతా చక్కని తెలుగులో ఉంటుంది. మాటల ఉచ్చారణలో కూడా అచ్చమైన తెలుగుని వింటారు. ఒక మనిషి మరో మనిషిని చూసినప్పుడు ఎలా స్పందిస్తారు? ప్రేమ ఎలా పుడుతుందనేది ఈ కథలో మీరు చూస్తారు. సినిమాలో రాధిక పాత్ర అద్భుతంగా ఉంటుంది. ఆవిడ మంచి గాయకురాలు. కొన్ని కారణాల వల్ల పాడటం మానేసి సాధారణ కుటుంబ జీవితం గడుపుతారు. ఈ పాత్రలో రాధిక స్క్రీన్ ప్రెజెన్స్ అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమాలో ట్రావెన్‌కోర్ ప్రిన్స్ కూడా నటించారు. ఆయన శాస్త్రీయ సంగీతం కోసం చేసిన సేవ మనం ఊహించలేం. అలాంటి ఒక క్యారెక్టర్‌ని పరిచయం చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. జస్టిన్ మంచి సంగీతాన్ని అందించారు. చాలా రోజుల తర్వాత తెలుగులో మంచి మ్యూజికల్ లవ్ స్టోరీ వచ్చిందని ప్రేక్షకులు ఫీల్ అవుతారు' అని వారు అన్నారు.





ఆ ఫొటోలు దాచుకున్నా

శ్రీదేవి విజయ్ కుమార్

'ఈ సినిమాలో స్కూల్ డ్రెస్ వేసుకునే అకాశం వచ్చింది. ఇది మరచిపోలేని అనుభవం. అందుకే చాలా ఫొటోలు తీసి దాచుకున్నా. నేను ఇప్పటి వరకు ఇలాంటి క్యారెక్టర్ చేయలేదు' అని అన్నారు హీరోయిన్ శ్రీదేవి విజయ్‌కుమార్. ఆమె నటించిన 'సుందరకాండ' సినిమా ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- హీరోయిన్‌గా రీ ఎంట్రీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఏ యాక్టర్‌కైనా మంచి క్యారెక్టర్ చేయాలనే ఉంటుంది. 'సుందరకాండ'లో అలాంటి ఒక అర్థవంతమైన పాత్ర పోషిస్తున్నా
- నా క్యారెక్టర్‌లో చాలా భిన్నమైన భావోద్వేగాలున్నాయి. చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్ చేశాను. ఈ సినిమాలో మహిళా పాత్రలన్నీ శక్తిమంతమైనవే
- చాలా కొత్త పాయింట్‌తో వస్తున్న ప్రాజెక్టు ఇది. ప్రేక్షకురాలిగా ఈ సినిమా నాకు చాలా నచ్చింది. కుటుంబ సభ్యులందరూ థియేటర్‌కి వెళ్లి చాలా ఎంజాయ్ చేయవచ్చు.
- నా వివాహం తర్వాత సినిమాలకి బ్రేక్ వచ్చింది. ఆ తర్వాత టీవీలో కొన్ని ప్రోగ్రామ్స్ చేశాను. ఇన్ని సంవత్సరాల తర్వాత స్క్రీన్ మీద చూసుకోవడం చాలా ఆసక్తి కలుగుతోంది.
- డైరెక్టర్ వెంకీకి ఇది మొదటి సినిమా. కానీ చాలా అనుభవం గడించిన దర్శకుడిలా తీశారు. ఆయన విజన్ చాలా క్లియర్‌గా ఉంటుంది. తనకి ఏం కావాలో స్పష్టత ఉంది.

కోట శ్రీనివాసరావు సతీమణి కన్నుమూత



కోట శ్రీనివాస రావు ఇంట మరో విషాదం చోటు చేసుకుంది. ఆయన భార్య రుక్మిణి(75) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం తుది శ్వాస విడిచారు. కోట శ్రీనివాసరావు జూలై 13న తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే. కోట శ్రీనివాసరావుకు రుక్మిణితో 1966లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు ఆంజనేయ ప్రసాద్ 2010లో రోడ్డు ప్రమాదంలో మరణించారు.

రద్దయిన పాలసీల పునరుద్ధరణ

అక్టోబరు 17 వరకు అవకాశం: ఎల్ఐసీ

న్యూఢిల్లీ: ఏవైనా కారణాలతో ప్రీమియం చెల్లించలేక మధ్యలోనే రద్దయిన పాలసీల పునరుద్ధరణకు భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) గడువు ఇచ్చింది. ఇందుకోసం ఈ నెల 18 నుంచి అక్టోబరు 17 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపడుతోంది. పాలసీ షరతులకు లోబడి ఇంకా పాలసీ గడువు ఉండి, ప్రీమియం చెల్లింపులు ఆపేసిన ఐదేళ్ల లోపు పాలసీలకు మాత్రమే ఈ పునరుద్ధరణ వర్తిస్తుంది. ఇందుకోసం చెల్లించాల్సిన లేటు ఫీజుల్లోనూ రూ.5,000 పరిమితికి లోబడి 30 శాతం వరకు రాయితీ ఇస్తారు. ఇంకా పాలసీ గడువు ఉండి, మధ్యలో ప్రీమియం చెల్లించడం ఆపేసిన అన్ని నాన్-లింక్డ్ బీమా పాలసీలను ఈ గడువులోగా పునరుద్ధరించుకోవచ్చని ఎల్ఐసీ తెలిపింది.

హైదరాబాద్ జినోమ్ వ్యాలీలో జింజర్ హోటల్

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ హోటల్స్ సంస్థ ఇండియన్ హోటల్స్ కంపెనీ (ఐహెచ్‌సీఎల్) తన జింజర్ హోటల్స్‌ను హైదరాబాద్ జినోమ్ వ్యాలీకి విస్తరిస్తోంది. ఇందులో భాగంగా జినోమ్ వ్యాలీలో 'జింజర్ జినోమ్ వ్యాలీ' పేరుతో ఒక స్టార్ హోటల్ నిర్మిస్తోంది. మాడిసన్ గ్రూప్‌తో కలిసి ఐహెచ్‌సీఎల్ ఈ 75 గదుల హోటల్ నిర్మించనుంది. జినోమ్ వ్యాలీ ప్రాంత వ్యాపార, సామాజిక కార్యక్రమాలకు ఈ హోటల్ ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,130 ▼	92,700 ▼	1,27,000 ▲
విజయవాడ	1,02,800 ▲	97,000 ▲	1,17,500 ▲
విశాఖపట్నం	1,02,690 ▲	92,750 ▼	1,27,000 ▲
రాజమండ్రి	1,01,180 ▼	92,750 ▼	1,17,600 ▼
ప్రొద్దుటూరు	1,00,700 ▲	92,640 ▲	1,17,300 ▼
ముంబై	99,623 ▼	91,255 ▼	1,14,050 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19 తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	520
వరంగల్	497	గోదావరి	520
చిత్తూరు	558	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	121
కరీంనగర్	102	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	98
కర్నూలు	102	నెల్లూరు	103
విశాఖపట్నం	113	అనంతపురం	103
గోదావరి	119		

'భారత్‌లో తయారీ'పై జర జాగ్రత్త



పోటీతత్వమే మనకు శ్రీరామ రక్ష ● ట్రంప్ సుంకాలతో మనకు ముప్పే ● ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సుబ్బారావు

న్యూఢిల్లీ: మేకిన్ ఇండియా (భారత్‌లో తయారీ) కార్యక్రమంపై ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు హెచ్చరించారు. ఈ పథకం 'మనకు అవసరమైన ఉత్పత్తులన్నీ దేశంలోనే తయారీ పథకం'గా మారకుండా చూడాలన్నారు. అలా చేస్తే చైనా+1 వ్యూహంలో భాగంగా మన దేశంలో పెట్టుబడులు పెట్టాలనుకునే కంపెనీల పెట్టుబడులకు గండి పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మేకిన్ ఇండియా పథకం విజయం మన దేశ కంపెనీల పోటీతత్వాన్ని పెంచడంపై ఆధార పడి ఉందే తప్ప, వాటికి పోటీ నుంచి రక్షణ కల్పించడంలో కాదని గుర్తించాలన్నారు. అలా చేస్తే మన కంపెనీల ఉత్పాదక శక్తి కూడా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ప్రధాని మోదీ చెబుతున్న 'ఆత్మనిర్భరత'కు అసలు అర్థం రక్షణ, ఇంధనం వంటి కొన్ని కీలక రంగాల్లో వ్యూహాత్మక స్వయం సమృద్ధే తప్ప, అన్ని రంగాల్లో పూర్తి స్వయం సమృద్ధి కాదని అర్థం చేసుకోవాలని సుబ్బారావు కోరారు.

సుంకాల పోటు తప్పదు: అమెరికా మన దేశంపై విధిస్తున్న సుంకాలపైనా ఆర్‌బీఐ మాజీ గవర్నర్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. అవునన్నా కాదన్నా అమెరికా మనకు అతిపెద్ద ఎగుమతి మార్కెట్ అనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఈ సుంకాల పోటుతో 'మేకిన్ ఇండియా' ద్వారా మన దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రధాని మోదీ లక్ష్యానికీ గండి పడే ప్రమాదం ఉందన్నారు. దీంతో చైనా+1 వ్యూహంలో భాగంగా మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేయాలనుకునే విదేశీ కంపెనీలు వెనక్కి తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఈ నెల 27 నుంచి ట్రంప్ విధించిన 25 శాతం అదనపు సుంకంతో కలిపి 50 శాతం సుంకాలు అమల్లోకి వస్తే, ఆసియాలో మన దేశంపైనే అత్యధిక సుంకాలు ఉన్నట్టవుతుందన్నారు. అలాంటి స్థితిలో ఏ కంపెనీ కూడా మన దేశంలో తమ యూనిట్ పెట్టి అమెరికాకు ఎగుమతి చేయలేదని సుబ్బారావు స్పష్టం చేశారు.

సగం ఎగుమతులపై ప్రభావం

ట్రంప్ సుంకాల ప్రభావం అమెరికాకు మన దేశం ఎగుమతి చేసే కనీసం సగం ఎగుమతులపై ఉంటుందని సుబ్బారావు స్పష్టం చేశారు. ఈ సుంకాలతో ముఖ్యంగా ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్న వస్త్ర, రత్నాభరణాలు, తోలు ఉత్పత్తుల కంపెనీలు ఎక్కువగా దెబ్బతింటాయన్నారు. ఫార్మా, ఎలక్ట్రానిక్ పరికరాల దిగుమతులను ప్రస్తుతానికి సుంకాల నుంచి మినహాయించడం తాత్కాలిక ఉపశమనంగానే చూడాలని సుబ్బారావు కోరారు. భవిష్యత్‌లో వీటిపైనా సుంకాల పోటు తప్పక పోవచ్చన్నారు. ఈ సుంకాల నేపథ్యంలో మరో ఐదేళ్లలో భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మూడింతలు పెంచి 50,000 కోట్ల డాలర్లకు పెంచాలనే లక్ష్యమూ సాధ్యం కాదని స్పష్టం చేశారు.

చైనా డంపింగ్

అమెరికా సుంకాల పోటుతో చైనా తన వస్తువులను ఇతర దేశాల మార్కెట్లలో కుమ్మరించే ప్రమాదమూ ఉందని సుబ్బారావు హెచ్చరించారు. ఈ మార్కెట్లు కూడా భారత ఎగుమతులకు అమెరికా తర్వాత ప్రధాన మార్కెట్లన్నారు. అదే జరిగితే ఇతర దేశాలకూ మన ఎగుమతులు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అమెరికా నుంచి వ్యవసాయ, పాడి ఉత్పత్తుల దిగుమతుల కోసం ట్రంప్ చేస్తున్న ఒత్తిళ్లపై జాగ్రత్తగా ఉండక తప్పదన్నారు. మరీ తప్పదనుకుంటే తలుపులు బార్లా తెరవకుండా ఆచితూచి వ్యవహరించాలని కోరారు. అమెరికా ఒత్తిళ్లకు లొంగి ఉన్న పళంగా రష్యా చమురు దిగుమతులను ఆపేయడం కూడా భారత్‌కు అంత శ్రేయస్కరం కాదని సుబ్బారావు స్పష్టం చేశారు. అలా చేస్తే చమురు ధరలు పెరిగి మన ఆర్థిక పునాదులు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అప్పుడు దేశంలో ద్రవ్యోల్బణం కూడా భగ్గుమనే ప్రమాదం ఉందని సుబ్బారావు అన్నారు.

10 ఏళ్లలో రూ.1,000 కోట్ల అద్దె

బెంగళూరులో 2.7 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకున్న యాపిల్

న్యూఢిల్లీ: భారత్‌లో ఐఫోన్ల తయారీని భారీగా పెంచడంపై దృష్టి సారించిన యాపిల్.. మన దేశంలో కార్యకలాపాలను అదే స్థాయిలో విస్తరిస్తోంది. ఇందుకోసం బెంగళూరులో ఎంబసీ గ్రూప్‌నకు చెందిన కమర్షియల్ ప్రాజెక్టు ఎంబసీ జెనిత్‌లో దాదాపు 2.7 లక్షల చదరపు అడుగుల భారీ కార్యాలయ స్థలాన్ని యాపిల్ 10 ఏళ్ల కాలానికి లీజుకు తీసుకుంది. 9 అంతస్తుల్లో (5 నుంచి 13వ అంతస్తు వరకు) విస్తరించి ఉన్న ఈ ఆఫీస్ స్పేస్ కోసం చదరపు అడుగుకు రూ.235 చొప్పున సంస్థ నెలకు మొత్తం రూ.6.3 కోట్ల అద్దె చెల్లించనుంది. ఈ అద్దె ఏటా 4.5 శాతం చొప్పున పెరగనుందని.. అద్దెతో పాటు పార్కింగ్, మెయింటెనెన్స్ చార్జీలతో కలిపి పదేళ్లకు మొత్తం రూ.1,000 కోట్లకు పైగా ముట్టజెప్పనుందని డేటా అనలిటిక్స్ కంపెనీ ప్రాప్‌స్టాక్ సోమవారం వెల్లడించింది. 2025 ఏప్రిల్ 3 నుంచి అమలులోకి వచ్చిన ఈ లీజు ఒప్పందంలో భాగంగా యాపిల్ రూ.31.57 కోట్లు డిపాజిట్ కూడా చేసిందని ప్రాప్‌స్టాక్ పేర్కొంది. అయితే, ఈ విషయంపై స్పందించేందుకు యాపిల్ నిరాకరించింది.

ఐపీఓ మార్కెట్లో మరిన్ని సంస్కరణలు: సెబీ

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు సెబీ సిద్ధమవుతోంది. ఇందుకోసం సోమవారం ఒక చర్చా పత్రం విడుదల చేసింది. సంబంధిత వర్గాలు ఈ చర్చా పత్రంపై తమ అభిప్రాయాలు, సూచనలు సెప్టెంబరు 8 లోగా తెలియజేయాలని కోరింది. ఐపీఓల్లో రిటైల్ మదుపరుల వాటాను 35 శాతం వద్ద కొనసాగిస్తూనే పెద్ద కంపెనీలు పబ్లిక్ ఇష్యూల ద్వారా జారీ చేయాల్సిన కనీస పబ్లిక్ ఆఫర్ (ఎంపీఓ)ను తగ్గించాలని సెబీ ప్రతిపాదించింది. దీంతో భారీ స్థాయిలో మార్కెట్ క్యాప్ ఉండే కంపెనీలు ఐపీఓల ద్వారా ఒకేసారి తమ షేర్లను మార్కెట్లో కుమ్మరించాల్సిన అవసరం ఉండదు. మార్కెట్ పరిస్థితులను బట్టి ఐదు నుంచి పదేళ్లలో దశల వారీగా తమ ఈక్విటీలో 25 శాతం వాటాను రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరులకు జారీ చేస్తే సరిపోతుంది.

మరింత గడువు: వచ్చే నెల 1 నుంచి అమలు చేయతలపెట్టిన మార్జిన్ ఆబ్లిగేషన్ల గడువును కూడా సెబీ అక్టోబరు 10 వరకు పొడిగించింది. ఈ నిబంధన చేసేందుకు సమయం పడుతుందని డిపాజిటరీ సంస్థలు కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సెబీ తెలిపింది. ఈ చర్యతో బ్రోకర్లు.. ఖాతాదారులకు తెలియకుండా వారి సెక్యూరిటీలను కుదువ పెట్టే దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నారు.

విస్తరణ బాటలో మోంట్రా ఎలక్ట్రిక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మురుగప్పా గ్రూప్‌నకు చెందిన క్లీన్ మొబిలిటీ సంస్థ మోంట్రా ఎలక్ట్రిక్.. హైదరాబాద్‌కు తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా సోమవారం నాడిక్కడ ఎలక్ట్రిక్ స్మాల్ కమర్షియల్ వెహికల్ (ఈ-ఎస్‌సీవీ) కోసం ప్రత్యేక డీలర్‌షిప్‌ను ప్రారంభించింది. శ్రీరామ్ హర్ష భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన ఈ డీలర్‌షిప్ కేంద్రాన్ని టీఐ క్లీన్ మొబిలిటీ (మోంట్రా ఎలక్ట్రిక్) చైర్మన్ అరుణ్ మురుగప్పన్, ఎండీ జలజ్ గుప్తా, హర్ష గ్రూప్ చైర్మన్ హర్షవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జలజ్ గుప్తా మాట్లాడుతూ.. వాణిజ్య ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) మార్కెట్లలో హైదరాబాద్ కీలకంగా ఉండటమే కాకుండా లాజిస్టిక్ హబ్‌గా ఎదుగుతోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించామని, ఈ షోరూమ్‌లో మోంట్రా ఎలక్ట్రిక్ ఏవియేటర్ శ్రేణి వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. కాగా విస్తరణలో భాగంగా రానున్న రోజుల్లో హర్ష గ్రూప్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నంలలో డీలర్‌షిప్‌లను ఏర్పాటు చేయనున్నట్లు గుప్తా చెప్పారు.

మార్కెట్‌కు జీఎస్‌టీ జోష్

- ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,168 పాయింట్లు అప్
- చివరికి 676 పాయింట్ల లాభంతో 81,273 వద్ద ముగింపు
- మళ్లీ 25,000 స్థాయిని తాకిన నిఫ్టీ
- వాహన, వినియోగ రంగ షేర్లలో ర్యాలీ

రూ.6.17 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: జీఎస్‌టీ రేట్లు తగ్గించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ ప్రకటించడంతో పాటు ఎస్ అండ్ పీ 18 ఏళ్ల తర్వాత భారత పరపతి రేటింగ్‌ను పెంచడం స్టాక్ మార్కెట్ వర్గాల్లో భారీ ఉత్సాహాన్ని నింపింది. జీఎస్‌టీ రేట్ల తగ్గుదలతో భారీగా లబ్ది పొందనున్న వాహనం, వినియోగ రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు పోటెత్తించడంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం ఉవ్వెత్తున ఎగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,168.11 పాయింట్లు పెరిగి 81,765.77 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి కాస్త తగ్గిన సూచీ చివరకు 676.09 పాయింట్ల లాభంతో 81,273.75 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 390 పాయింట్లు పెరిగి 25,000 స్థాయిని అధిగమించినప్పటికీ, చివరికి 245.65 పాయింట్ల వృద్ధితో 24,876.95 వద్ద స్థిరపడింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.6.71 లక్షల కోట్లు పెరిగి రూ.450.96 లక్షల కోట్లకు చేరుకుంది.

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 20 రాణించాయి. మారుతి సుజుకీ షేరు ఏకంగా 8.94 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్ 5.02 శాతం వృద్ధి చెందగా.. అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎం అండ్ ఎం, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు 3 శాతానికి పైగా పుంజుకున్నాయి. కాగా, ఐటీసీ 1.26 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఐటీ రంగ షేర్లూ నష్టాల్లో పయనించాయి.
- బీఎస్ఈలోని చిన్న, మధ్య స్థాయి కంపెనీల ప్రాతినిధ్య సూచీలైన స్మాల్‌క్యాప్ 1.39 శాతం, మిడ్‌క్యాప్ ఒక శాతం వృద్ధి చెందాయి. రంగాల వారీ సూచీల్లో ఆటో ఏకంగా 4.26 శాతం ఎగబాకింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 3.08 శాతం, కన్స్యూమర్ డిస్క్రెషనరీ 2.74 శాతం, రియల్టీ 2.19 శాతం లాభపడ్డాయి. కమోడిటీస్, మెటల్, సర్వీసెస్ ఇండెక్స్‌లు 1.96 శాతం వరకు పెరిగాయి. ఐటీ, పవర్, టెక్, ఫోకస్డ్ ఐటీ సూచీలు మాత్రం నష్టాల్లో ముగిశాయి.
- బీఎస్ఈలో మొత్తం 4,365 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,499 లాభపడ్డాయి. 1,696 నష్టపోగా.. 170 యథాతథంగా ముగిశాయి. 156 కంపెనీల స్టాక్స్ సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని తాకాయి.

- ఇండిగో, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్.. కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డును విడుదల చేశాయి. మాస్టర్ కార్డ్, రూపే నెట్‌వర్క్‌తో ఈ కార్డును ఐడీఎఫ్‌సీ ఆఫర్ చేస్తోంది. విమాన బుకింగ్స్, ఇతరత్రా కొనుగోళ్లపై ప్రత్యేక ఆఫర్లను ఈ కార్డు ద్వారా అందించనుం ది.
- సూర్య రోష్ని రూ.25 కోట్ల పెట్టుబడితో వైర్స్ అండ్ కేబుల్స్ విభాగంలో ప్రవేశించింది. టర్బో ఫ్లెక్స్ శ్రేణితో ఈ ఉత్పత్తులను తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న రిటైల్ నెట్‌వర్క్‌లో ఈ ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి.
- వినాయక చవితిని పురస్కరించుకుని ఏపీ, తెలంగాణలోని వినియోగదారులకు ఇండియా యమహా మోటార్ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. రేజెడ్ ఆర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్ స్కూటర్లపై రూ.10,010 తగ్గింపును ఆఫర్ చేస్తోంది.

గిల్‌కు చోటు దక్కేనా?

ఆసియాకప్ జట్టు ఎంపిక నేడు



న్యూఢిల్లీ: వచ్చేనెలలో జరిగే ఆసియాకప్ టీ20 టోర్నీ కోసం మంగళవారం భారత జట్టును ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు బెర్త్ దక్కుతుందా? లేదా? అనే ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో పరుగుల వరద పారించిన గిల్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అలాగే ఐపీఎల్‌లోనూ రాణించాడు. అయితే గిల్‌ను ఎవరి స్థానంలో భర్తీ చేయాలనేదే సెలెక్టర్లకు ఇప్పుడు సమస్యగా మారింది. కొంతకాలంగా టాప్-3లో అభిషేక్, శాంసన్, తిలక్ మెరుగ్గానే రాణిస్తున్నారు. ఇప్పుడు వారికి పోటీగా జైస్వాల్, గిల్, సుదర్శన్ సిద్ధంగా ఉన్నారు. కానీ వీరు లేకుండానే సూర్యకుమార్ నేతృత్వంలోని టీ20 జట్టు చివరి 20 మ్యాచ్‌ల్లో 17 విజయాలతో అదరగొట్టింది. ఒకవేళ 15 మందితో కూడిన భారత జట్టులో గిల్‌కు చోటిస్తే అతడిని కచ్చితంగా బరిలోకి దింపాల్సి ఉంటుంది. అదే జరిగితే శాంసన్, అభిషేక్, తిలక్‌లలో ఒకరు తమ స్లాట్‌ను త్యాగం చేయాల్సిందే. అటు గిల్ కోసం రింకూ సింగ్‌పై వేటు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మిడిలార్డర్‌లో శ్రేయాస్ అయ్యర్ చోటుపైనా సస్పెన్స్ కొనసాగుతోంది. బౌలింగ్ విభాగంలో పేసర్ బుమ్రా అందుబాటులో ఉంటాడని సమాచారం. అతడికి జతగా అర్ష్‌దీప్, హర్దిక్ ఉంటారు. హర్షిత్ రిజర్వ్ పేసర్. ప్రసిద్ధ్, సిరాజ్‌లను సెలెక్టర్లు టెస్టు పేసర్లుగానే పరిగణిస్తున్నారు కాబట్టి అక్టోబరులో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు వీరిద్దరు తాజాగా బరిలోకి దిగవచ్చు. స్పిన్నర్లుగా అక్షర్, కుల్దీప్, వరుణ్ చక్రవర్తి మొదటి ప్రాధాన్యంలో ఉన్నారు. అయితే ఆల్‌రౌండర్ కావాలనుకుంటే వాషింగ్టన్ సుందర్‌ను తీసుకున్నా ఆశ్చర్యం లేదు. రెండో సీమ్ ఆల్‌రౌండర్‌గా శివమ్ దూబేతో పాటు రిజర్వ్ కీపర్‌గా జితేశ్, జురెల్‌ల మధ్య పోటీ నెలకొంది.

మహిళల వన్డే వరల్డ్ కప్

టీమిండియా ఎంపిక నేడు

మహిళల వన్డే వరల్డ్ కప్‌నకు భారత జట్టును మంగళవారం ఎంపిక చేయనున్నారు. నీతూ డేవిడ్ ఆధ్వర్యంలోని సెలెక్షన్ కమిటీ డ్యాషింగ్ బ్యాటర్ షఫాలీ వర్మ, పేసర్ రేణుకా సింగ్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఆసక్తి వ్యక్తమవుతోంది. మెగా టోర్నీ వచ్చేనెల 30 నుంచి భారత్‌లో జరగనుంది.

ఆటే ముఖ్యమని.. ప్రధానిని కూడా కలవలేదు

గవాస్కర్‌పై కర్సన్ ఘావ్రీ ప్రశంస



న్యూఢిల్లీ: మ్యాచ్‌కు ముందు ఓ దేశ ప్రధాని ఆటగాళ్లను కలుసుకునేందుకు వస్తే.. ఎవరైనా ఉద్వేగంతో ఎదురుచూస్తారు. కానీ భారత బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాత్రం తనకు ఆటే ముఖ్యమంటూ మైదానంలోకి వెళ్లాడట. ఈ విషయాన్ని సన్నీ సహచరుడు, మాజీ పేసర్ కర్సన్ ఘావ్రీ వెల్లడించాడు. "ఢిల్లీలో ఆస్ట్రేలియాతో టెస్టు మ్యాచ్‌కు ముందు అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ ఆటగాళ్లను కలుస్తారని సమాచారం వచ్చింది. కానీ ఆయన రావడం ఆలస్యం కాగా అప్పటికే టాస్ పూర్తయి భారత్ బ్యాటింగ్ చేసేందుకు సిద్ధమైంది. గవాస్కర్ ప్యాడ్లు కట్టుకుని సిద్ధంగా ఉన్నాడు. అప్పుడే డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చిన రాజ్‌సింగ్ దుంగార్పూర్ 'ప్రధాని వచ్చారు. మీరందరూ రండి. మూడు నిమిషాల్లో వచ్చేద్దాం' అని చెప్పాడు. అయితే సన్నీ మాత్రం 'మీరెళ్లండి.. నాకు నా బ్యాటింగ్, టీమ్ ముఖ్యం' అని అన్నాడు. బరిలోకి దిగి టీ బ్రేక్ వరకు ఆడాడు. అయితే ఆ రోజు ఆట చివర్లో ప్రధాని స్వయంగా గవాస్కర్‌ను కలుసుకునేందుకు మరోసారి రావడం విశేషం' అని ఘావ్రీ వివరించాడు.

ఇక.. ఆర్చరీ లీగ్

- అక్టోబరులో నిర్వహణ
- సురేఖ, ధీరజ్ సహా ఐదుగురు తెలుగు ఆర్చర్లకు చోటు

న్యూఢిల్లీ: ప్రధాన క్రీడల్లో మాదిరే ఆర్చరీలోనూ 'ఫ్రాంచైజీ' అడుగుపెట్టింది. మొట్టమొదటి ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) అక్టోబరులో జరగనుంది. ఆరు జట్లు ఇందులో తలపడుతున్నట్టు జాతీయ ఆర్చరీ సంఘం (ఏఏఐ) సోమవారం వెల్లడించింది. జ్యోతి సురేఖ, దీపికా కుమారి, ధీరజ్ బొమ్మదేవర, అభిషేక్ వర్మలాంటి స్టార్లు ఏపీఎల్ బరిలో దిగనున్నారు. సురేఖ, ధీరజ్ సహా మరో ముగ్గురు తెలుగు ఆర్చర్లు చికితా రావు, జిగ్నేష్, హంస కూడా లీగ్‌లో పోటీపడతారు. ఫ్రాంచైజీల పేర్లను ఖరారు చేయాల్సి ఉంది. తొలి సీజన్‌కు వేలంలో కాకుండా డ్రాఫ్ట్ విధానంలో ఆర్చర్లను జట్లు ఎంపిక చేసుకోనున్నాయి. ఒక్కో జట్టులో 8 మంది ఆర్చర్లుంటారు. ఇందులో నలుగురు పురుషులు, నలుగురు మహిళా ఆర్చర్లుంటారు. ప్రతి జట్టు ఇద్దరు విదేశీ ఆర్చర్లను చేర్చుకోవచ్చు.

మిక్స్‌డ్ మజా

- బరిలో అల్కారజ్-రదుకాను, జొకోవిచ్-డానిలోవిచ్ జోడీలు
- మొత్తం 16 జంటల మధ్య పోటీ
- నేడు, రేపు యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ చాంపియన్‌షిప్

రాత్రి 8.30 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో



అల్కారజ్





ప్రాక్టీస్‌లో ఎమ్మా రదుకాను

న్యూయార్క్: టెన్నిస్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వినూత్నంగా గ్రాండ్‌స్లామ్ మిక్స్‌డ్ డబుల్స్ పోటీలకు ఆతిథ్యమిచ్చేందుకు యూఎస్ ఓపెన్ సిద్ధమైంది. ఈ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్ సింగిల్స్, డబుల్స్ పోటీలు ఈనెల 24న ఆరంభం కానుండగా.. ఐదురోజుల ముందే 19, 20వ తేదీల్లో మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. కేవలం రెండ్రోజుల్లో మెరుపులా ముగిసే ఈ మిక్స్‌డ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ క్రీడాకారులు పోటీపడుతుండడం టోర్నీకి మరింత ఆకర్షణ కానుంది. ముఖ్యంగా యువ కెరటం కార్లోస్ అల్కారజ్, బ్రిటన్ బ్యూటీ ఎమ్మా రదుకాను జోడీగా బరిలోకి దిగుతుండడంతో అభిమానుల దృష్టంతా వీళ్లపైనే నెలకొంది. తొలి రౌండ్‌లో టాప్ సీడ్ జాక్ డ్రేపర్-జెస్సికా పెగుల జంటతో అల్కారజ్ జోడీ తలపడనుంది. సింగిల్స్ వరల్డ్ నెం.1 జానిక్ సినర్..సినియకోవాతో జత కట్టాడు. ఇగా స్వియటెక్-కాస్పర్ రూడ్, జొకోవిచ్-డానిలోవిచ్, ఒసాకా-మోన్‌ఫిల్స్ జంటలు మిక్స్‌డ్ బరిలోకి ఉన్నాయి. డిఫెండింగ్ చాంప్‌గా సారా ఎర్రాని-ఆండ్రియా వవస్సోరి జోడీ మరోసారి టైటిల్ నెగ్గాలనే పట్టుదలతో ఉంది. 45 ఏళ్ల వీనస్ విలియమ్స్, ఒపెల్కాతో కలిసి పోటీపడుతోంది. మంగళవారం రౌండ్-1, క్వార్టర్స్ జరగనుండగా.. సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లను బుధవారం నిర్వహిస్తారు.

ఫార్మాట్ విశేషాలు

- మొత్తం 16 జంటలు పోటీపడుతున్నాయి. కంబైన్డ్ సింగిల్స్ ర్యాంకుల ఆధారంగా ఎనిమిది జంటలకు నేరుగా ఎంట్రీ దక్కగా, మిగతా ఎనిమిది జోడీలను వైల్డ్‌కార్డ్ ద్వారా ఎంపిక చేశారు.
- ఒక సెట్‌లో ఆరు గేమ్‌లకు బదులు నాలుగు గేమ్‌లు మాత్రమే ఉంటాయి. నాలుగు పాయింట్లు ముందుగా ఎవరు గెలుస్తారో వారిదే సెట్. మూడో సెట్ లేకుండా 10 పాయింట్ల టైబ్రేక్‌ను నిర్వహిస్తారు.
- విజేత ప్రైజ్‌మనీ రూ. 8.76 కోట్లు కాగా.. రన్నరప్ జోడీకి రూ. 3.50 కోట్లు దక్కుతాయి.

చుట్టుముట్టిన విమర్శలు

ప్రధాన టోర్నీకి ముందు మిక్స్‌డ్ డబుల్స్‌ను ప్రత్యేకంగా నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. సింగిల్స్ టాప్ ప్లేయర్లకు పెద్ద పీట వేయడంతోపాటు టోర్నీ ప్రైజ్‌మనీని రెండు లక్షల నుంచి పది లక్షల డాలర్లకు (రూ. 1.74 కోట్ల నుంచి 8.73 కోట్లు) పెంచడంపై డిఫెండింగ్ చాంప్ ఎర్రాని తీవ్ర విమర్శలు చేసింది. కేవలం సింగిల్స్ ప్లేయర్లకు లాభం చేకూర్చేలా టోర్నీ ఫార్మాట్, షెడ్యూల్‌ను కూడా మార్చారని ఆరోపించింది. వారిలో డబుల్స్ స్పెషలిస్టులే లేరని తెలిపింది. అయితే, ఎక్కువ మంది సింగిల్స్ ప్లేయర్లను ఆకర్షించడానికే ఇలా చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. దీంతోపాటు టోర్నీ పాపులారిటీ కూడా పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అథ్లెట్ షీనాపై నిషేధం



న్యూఢిల్లీ: భారత ట్రిపుల్ జంపర్ షీనా వర్కేపై జాతీయ డోపింగ్ నిరోధక ఏజెన్సీ (నాడా) నిషేధం విధించింది. కేరళకు చెందిన ఈ 32 ఏళ్ల అథ్లెట్ డోప్ పరీక్షలో పాజిటివ్‌గా తేలింది. 2023 ఆసియాగేమ్స్‌లో ప్రాతినిధ్యం వహించిన షీనా.. ఇటీవలి జాతీయ క్రీడల్లో రజతం, ఫెడరేషన్ కప్‌లో కాంస్యం గెలుచుకుంది.

ఆసియా షూటింగ్‌లో భారత్‌కు రజతం

షిమ్కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ పిస్టల్ విభాగంలో భారత పురుషుల జట్టు రజత పతకంతో బోణీ చేసింది. సోమవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో అన్మోల్, ఆదిత్య, సౌరభ్ చౌదరితో కూడిన భారత త్రయం రెండోస్థానంతో రజతం అందుకుంది. చైనా స్వర్ణం, ఇరాన్ కాంస్యం నెగ్గాయి. ఇక, జూనియర్ పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కపిల్ స్వర్ణం, గవిన్ కాంస్యం అందుకున్నారు. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లో భారత్ రజతం దక్కించుకుంది.

స్పోర్ట్స్

హెచ్‌సీఏ తాత్కాలిక చీఫ్ దల్జీత్‌పై సీఐడీకి ఫిర్యాదు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) తాత్కాలిక అధ్యక్షుడు దల్జీత్ సింగ్, జాయింట్ సెక్రటరీ బసవరాజు, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్‌పై సీఐడీ చీఫ్ చారు సిన్హాకు ఆ సంఘం మాజీ కార్యవర్గ సభ్యుడు చిట్టి శ్రీధర్ ఫిర్యాదు చేశాడు. అమీర్‌పేట సీసీ, ఖాల్సా సీసీ అనే రెండు క్లబ్‌ల తరఫున దల్జీత్ 2018లో సంతకాలు చేసి చెక్‌లు ఇచ్చి, వార్షిక రెన్యువల్ ఫీజును చెల్లించాడని, ఇది మల్టిపుల్ క్లబ్‌ల కిందకు వస్తుందని శ్రీధర్ ఆరోపించాడు. లోధా నిబంధనల ప్రకారం ఒక సభ్యుడు ఒక క్లబ్‌లోనే ఉండాలని, తాత్కాలిక అధ్యక్షుడిగా అతడికి కొనసాగే హక్కు లేదని, తక్షణమే దల్జీత్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇదే ఫిర్యాదును హెచ్‌సీఏ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న రిటైర్డ్ జస్టిస్ నవీన్‌రావు, అంబుడ్స్‌మన్‌కు కూడా ఈమెయిల్ ద్వారా పంపించానని తెలిపారు. బసవరాజు అమీర్‌పేట క్లబ్ నుంచి హెచ్‌సీఏ ఎన్నికల్లో పోటీ చేయడానికి నిబంధనలను ఉల్లంఘించారని, అలాగే సునీల్ అగర్వాల్ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడిగా ఉంటూ అతడి కుమారుడు హెచ్‌సీఏ తరఫున ఆడడం పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకు వస్తుందని శ్రీధర్ అన్నాడు.

షూటర్ శ్రీధర్ డబుల్ ధమాకా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): పుణెలో జరిగిన జాతీయ పారా ఓపెన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో కాకినాడ షూటర్ శ్రీధర్ రాయల రెండు పతకాలు కొల్లగొట్టాడు. 50 మీటర్ల రైఫిల్-ఆర్ 9 విభాగంలో స్వర్ణం నెగ్గిన శ్రీధర్.. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్-ఆర్5 కేటగిరీలో కాంస్యం సాధించాడు. ఖమ్మం షూటర్ పావని.. ఎయిర్ రైఫిల్ 10 మీటర్ల-ఆర్4 విభాగంలో రజతం నెగ్గింది.

ఈసీ సభ్యుడిగా ఒకసారి సరిపోతుంది!

న్యూఢిల్లీ: జాతీయ క్రీడా సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీ చేయాలంటే..గతంలో ఆయా సమాఖ్యల ఎగ్జిక్యూటివ్ కమిటీలలో రెండుసార్లు సభ్యుడిగా ఉండాల్సి వచ్చేది. కానీ పార్లమెంట్ ఆమోదించిన నూతన జాతీయ క్రీడా పరిపాలన బిల్లు ప్రకారం ఒక్కసారి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తే చాలు. యువ క్రీడా పరిపాలకులు, నాయకత్వ లక్షణాలు కలిగిన అథ్లెట్లను ప్రోత్సహించేందుకే రెండు టర్మ్‌'లను ఒకటికి కుదించినట్టు కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య వెల్లడించారు. జాతీయ క్రీడా పరిపాలన బిల్లును ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. రాష్ట్రపతి సంతకం చేశాక 'కొత్త బిల్లు' చట్టంగా మారనుంది.

స్థానిక భాషల్లో.. సైబర్ మోసాలపై అవగాహన కల్పించండి

» అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదేశం



న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, సైబర్ మోసాలపై ప్రత్యేక దృష్టి సారించాలని.. స్థానిక భాషల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఢిల్లీలోని తన కార్యాలయంలో సైబర్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ డివిజన్ (సీఐఎస్) కార్యకలాపాలను కేంద్ర మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4 సీ) ప్రాధాన్యాన్ని అధికారులకు వివరించారు. సైబర్ నేరాలపై పోరాటంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ప్రధాన సమన్వయ కేంద్రంగా ఐ4 సీ పనిచేస్తోందని తెలిపారు. సైబర్ మోసగాళ్ల నుంచి రూ.5,489 కోట్లు స్వాధీనం చేసుకున్నామని, 12 లక్షలకుపైగా మొబైల్ ఫోన్లు బ్లాక్ చేశామని, 13 లక్షలకుపైగా బ్యాంకు ఖాతాలను సీజ్ చేశామని అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. కాగా, సైబర్ నేరగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న సొమ్మును బాధితులకు తిరిగి ఇచ్చే నిబంధనలను సులభతరం చేయాలని అధికారులను సంజయ్ ఆదేశించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ భేటీ అయ్యారు. సోమవారం పార్లమెంట్‌లోని అమిత్ షా కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

బీడీలపై జీఎస్టీ తగ్గించాలి: బీఎంఎస్

న్యూఢిల్లీ, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): బీడీలపై ఉన్న జీఎస్టీని 28 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్), దాని అనుబంధ సంస్థ అయిన తెలంగాణ స్టేట్ బీడీ కార్మిక సంఘ్ డిమాండ్ చేశాయి. ఈ సంఘాల ప్రతినిధులు కేంద్ర కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవ్యను ఢిల్లీలో కలిసి వినతిపత్రం సమర్పించారు. బీడీలపై జీఎస్టీని 40 శాతనికి పెంచాలన్న ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు తమకు తెలిసిందని ఆందోళన వ్యక్తం చేశారు. 40% పెంచితే దేశంలోని 2 కోట్ల మంది బీడీ కార్మికులు, తెలంగాణలోని 10 లక్షలమంది బీడీ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు.

పోడు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే హరీశ్‌బాబు నిరవధిక నిరాహార దీక్ష

కాగజ్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పోడు భూముల సమస్యను పరిష్కరించాలని, జీవో 49ను శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూరు ఎమ్మెల్యే హరీశ్ బాబు సోమవారం కాగజ్‌నగర్‌లోని తన నివాసంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోడు రైతుల సమస్యలను ఎన్నో సార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అయినా స్పందించడం లేదని చెప్పారు. జీవో 49ను శాశ్వతంగా రద్దు చేస్తున్నట్లు సీఎం ప్రకటించాలన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడేవరకు దీక్షను కొనసాగిస్తానన్నారు. అంతకుముందు ఆయన పోడు రైతుల సమస్య పరిష్కరించాలని కాగజ్‌నగర్ అటవీ శాఖ కార్యాలయాన్ని ముట్టడించే కార్యక్రమం చేపట్టగా.. ఉదయమే పోలీసులు హరీశ్ బాబును హౌస్ అరెస్టు చేశారు.

రేపటినుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు: కూనంనేని

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవడానికి సీపీఐ సిద్ధమవుతోంది. 20 నుంచి 22వ తేదీ వరకు జరిగే పార్టీ రాష్ట్ర 4వ మహాసభల్లో ఈ అంశంపై ప్రధానంగా చర్చిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. మహాసభల వేదికకు ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు దివంగత పొట్లూరి నాగేశ్వరరావు నగర్‌గా నామకరణం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ మహాసభల్లో మొత్తం 743 మంది ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులతో కలిపి దాదాపు వెయ్యి మంది పాల్గొంటారని చెప్పారు. బుధవారం జీడిమెట్ల పోలీసు స్టేషన్ నుంచి మహా సభల వేదిక వరకు ఫ్లాగ్ మార్చ్ ఉంటుందన్నారు. మఖ్దూం భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సాంబశివరావు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం పొత్తు ఉంటుందని, కాంగ్రెస్‌తో స్నేహ సంబంధాలు కొనసాగుతాయని తెలిపారు.

న్యూడెమోక్రసీలో మరో చీలిక?

» చంద్రన్న వర్గంలో తిరుగుబాటు

» రాష్ట్ర కార్యదర్శి అశోక్ వర్గంలో పలువురి రాజీనామా

ఇల్లెందు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మరో చీలికవైపు పయనిస్తోంది. రెండేళ్లుగా కేంద్ర కమిటీ కార్యదర్శిగా చంద్రన్న నాయకత్వంలో సాగుతోన్న న్యూడెమోక్రసీలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్ తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఆయన నాయకత్వంలో చంద్రన్న వర్గానికి రాజీనామా చేస్తున్నట్టు సోమవారం పలువురు ప్రకటించారు. తాము మూకుమ్మడిగా చంద్రన్న వర్గాన్ని వీడుతున్నామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీగానే కొనసాగుతామని అశోక్ ప్రకటించారు. ఇప్పటికే కొన్నేళ్లుగా న్యూడెమోక్రసీలో జరిగిన పరిణామాలతో న్యూడెమోక్రసీ చంద్రన్న వర్గం, మాస్‌లైన్, న్యూడెమోక్రసీ యతీంద్ర కుమార్ వర్గాలుగా చీలిపోయారు. అశోక్ నాయకత్వంలో మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో సోమవారం వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులు సమావేశమై కేంద్రకమిటీ కార్యదర్శి చంద్రన్న వ్యవహార శైలిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం గమనార్హం.

'స్థానికం'లో మహిళా నేతలకు ప్రాధాన్యం

» పదవులు రాలేదని నిరాశ వద్దు: మహేశ్ గౌడ్



హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ నేతలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు కచ్చితంగా గుర్తింపునిస్తామన్నారు. సోమవారం గాంధీభవన్‌లో జరిగిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడారు. పదవులు రాలేదని నిరాశ చెందవద్దని, మహిళా కాంగ్రెస్ నేతలకు పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఉన్నందున.. మహిళా కార్యకర్తలంతా కలిసి సమన్వయంతో ముందుకు సాగాలని మహిళా కాంగ్రెస్ తెలంగాణ పరిశీలకులు కమలాక్షి చెప్పారు. కాగా, సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి మహేశ్ గౌడ్ నివాళులర్పించారు.

ఆ బ్యారేజీలు నాసిరకంగా కట్టిందే మీరు: మేడిపల్లి

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లికి దిగువన బ్యారేజీలు అత్యంత నాసిరకంగా.. కుంగిపోయేట్లు కట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అంటూ కాంగ్రెస్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రశ్నించారు. ఎల్లంపల్లి నుంచి నీటిని సముద్రంలోకి వదిలేయడం నేరపూరిత నిర్లక్ష్యమంటూ హరీశ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలు నాసిరకంగా కట్టింది తామేనని, అందుకే ఎల్లంపల్లి నుంచి నీళ్ల వదలగానే అవి సముద్రంలో కలుస్తున్నాయంటూ హరీశ్‌రావు నిజం అంగీకరించారని చెప్పారు. ప్రభుత్వ పాలన ప్రజాసంక్షేమం దిశగా సాగుతోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. 'అందుబాటులో ప్రజాప్రతినిధులు' కార్యక్రమంలో భాగంగా గాంధీభవన్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వారం రోజుల్లో ప్రజాభవన్‌లో నిరుద్యోగులతో భేటీ అయి.. వారి సమస్యలను వింటానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీనిచ్చారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) బీజేపీ అధికార ప్రతినిధిలా వ్యవహరిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి విమర్శించారు. రాహుల్ వాదనలో విశ్వసనీయత ఉంది కాబట్టే ఓట్ చోరీపై సమాధానం చెప్పకుండా.. రాజకీయ సవాళ్లను విసురుతున్నారని ఆక్షేపించారు.



ఖమ్మం జిల్లా ఏన్కూరులో యూరియా కోసం ఎగబడుతున్న రైతులు



మహబూబాబాద్ జిల్లా గూడూరు జాతీయ రహదారిపై రాస్తారోకోలో మహిళా రైతు నిరసన



మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూరు సింగిల్‌విండో కార్యాలయం ముందు తమ చెప్పులను క్యూ లైన్‌లో పెట్టిన రైతులు

యూరియా కోసం రైతుల వెతలు

పంపిణీ కేంద్రాల వద్ద భారీగా బారులు.. వర్షంలో సైతం క్యూలో నిలబడి నిరీక్షణ

» రాష్ట్రానికి సరిపోయేంతగా రాని యూరియా
» ఎకరాకు ఒక్కో బస్తా మాత్రమే పంపిణీ
» వేల సంఖ్యలో క్యూ కడుతున్న రైతులు
» కొద్ది మందికే అందుతుండడంతో ఆందోళన
» పలు చోట్ల రాస్తారోకో చేపట్టిన అన్నదాతలు
» టోకెన్లు జారీ చేసి యూరియా ఇవ్వండి
» అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఓవైపు వానాకాలం పంటలకు యూరియా వేయాల్సిన కీలక సమయం.. మరోవైపు అవసరానికి సరిపడా రాష్ట్రానికి రాని యూరియా. దీంతో ఎక్కడికక్కడ యూరియా కొరత ఏర్పడింది. వ్యవసాయ సహకార సంఘాలకు, ఆగ్రో రైతుసేవా కేంద్రాలకు వస్తున్న యూరియా.. స్థానిక అవసరాలకు ఏమాత్రం సరిపోయేదిగా లేకపోవడంతో వచ్చిన కొద్దిపాటి యూరియా కోసం రైతులు పోటీ పడుతున్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా యూరియా పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. పంపిణీ కేంద్రాలకు వందల సంఖ్యలోనే యూరియా బస్తాలు వస్తుండడం, రైతులు మాత్రం వేల సంఖ్యలో వస్తుండడంతో అందరికీ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. అధికారులు ఎకరానికి ఒక్కో బస్తా మాత్రమే ఇస్తున్నా.. అందుబాటులో ఉన్న యూరియా అందరికీ సరిపోకపోవడంతో రైతులు ఆందోళనకు దిగుతున్నారు. సోమవారం రాష్ట్రంలో పలు చోట్ల రైతులు యూరియా అందడం లేదంటూ రోడ్డెక్కారు. ధర్నా, రాస్తారోకో చేపట్టారు. పోలీసులు వచ్చి వారిని సముదాయించాల్సి వచ్చింది. అయితే యూరియా పంపిణీ కేంద్రాలకు రైతులందరినీ ఒకేరోజు రప్పించకుండా.. టోకెన్లు జారీ చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు.

తోపులాటలు.. ఆందోళనలు..

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామ సహకార సంఘం వద్ద రైతులు యూరియా కోసం వర్షంలోనే గంటల తరడి క్యూలో నిలుచున్నారు. చివరికి ఓపిక నశించి ఆందోళనకు దిగారు. చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట పీఏసీఎస్ వద్ద తోపులాట చోటుచేసుకుంది. యూరియా కోసం రైతులు ఎగబడడంతో పోలీసులు వారిని నిలువరించారు. లారీలో 500 బస్తాలు మాత్రమే రాగా.. అవి ఎవరికీ సరిపోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో పీఏసీఎస్‌కు 560 బస్తాల యూరియా రాగా.. సుమారు 3వేల మంది క్యూలో నిలబడ్డారు. అధికారులు కేవలం 280 మందికే పంపిణీ చేయడంతో రైతులు ఆందోళనకు దిగారు. సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వచ్చి సముదాయించారు. హుస్నాబాద్‌లో రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఖమ్మం జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో యూరియా కోసం రైతులు సోమవారం తెల్లవారుజామున 4గంటల నుంచే క్యూ కట్టారు. తల్లాడలో పోలీసు బందోబస్తు మధ్య టోకెన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేశారు. ప్రైవేటు దుకాణాల్లో కూడా యూరియా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎల్కతుర్తిలో సమస్య తీర్చిన మంత్రి పొన్నం..

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో యూరియా కోసం రోజుల తరబడి క్యూ కట్టినా దొరక్కపోవడంతో రైతులు ఆగ్రహించారు. వంద మందికి పైగా రైతులు సోమవారం హనుమకొండ-కరీంనగర్ ఎన్‌హెచ్-563పైకి చేరుకుని ధర్నా, రాస్తారోకో చేపట్టారు. పోలీసులు ఈ విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడారు. దీంతో గంట వ్యవధిలో యూరియా లారీ ఎల్కతుర్తి సొసైటీకి చేరుకుంది. రైతులు క్యూ కట్టి బస్తాలను తీసుకెళ్లారు. తాడ్వాయి మండలంలోని కాల్వపల్లి గ్రామంలో ఆగ్రోస్ కేంద్రం వద్ద రైతులు యూరియా కొరతపై ఆందోళన చేపట్టారు. అయితే వ్యవసాయ అధికారుల నివేదికల ప్రకారమే యూరియా సరఫరా అవుతోందని పీఏసీఎస్ సీఈవో తెలిపారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు సింగిల్ విండో కార్యాలయానికి పెద్ద సంఖ్యలో చేరుకున్న రైతులు వర్షంలో తడుస్తూనే నిరీక్షించారు. చివరికి తమ చెప్పులను క్యూలో పెట్టి సమీపంలోని చెట్ల కింద వేచి ఉన్నారు. డబ్బులిచ్చి కొనుక్కునే యూరియాకు కూడా ఇంత కొరత ఉంటే పంటల సాగు ఎలా సాధ్యమవుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా గూడూరులో వరంగల్ నుంచి భద్రాచలం వెళ్లే 365 జాతీయ రహదారిపై రైతులు రెండు గంటలపాటు బైఠాయించడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు బలవంతంగా వారిని అక్కడ్నుంచి పంపించివేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



మహబూబాబాద్ జిల్లా గూడూరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

టోకెన్లు ఇచ్చి పంపిణీ చేయండి: మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరాలో గందరగోళం తలెత్తకుండా ఉండేందుకు రైతులకు టోకెన్లు జారీ చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఒకేరోజు రైతులంతా బారులు తీరే పరిస్థితి రాకుండా.. ఏ రోజు ఎవరు రావాలో సూచిస్తూ టోకెన్లు జారీచేయాలన్నారు. తొలుత చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత విడతల వారీగా పెద్ద రైతులకు యూరియా పంపిణీ చేయాలని సూచించారు. అవసరమైతే పట్టాదారు పాస్ పుస్తకాలను అనుసంధానం చేయాలని, రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయశాఖ అధికారులతో మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం నుంచి రాష్ట్రానికి సరిపడా యూరియా రాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. 3 లక్షల టన్నుల యూరియా లోటు ఏర్పడిందని, దీనిని గ్రహించి కలెక్టర్లు యూరియా సరఫరాను పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించకుండా అన్ని శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశ్రామిక అవసరాలకు సబ్సిడీ యూరియాను మళ్లించే అవకాశమున్న యూనిట్లను తనిఖీ చేసి, వ్యత్యాసాలుంటే కేసులు నమోదు చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం సమయానికి సరఫరా చేస్తున్నదనే నమ్మకం కల్పించాలన్నారు. రైతులు.. ప్రతిపక్ష పార్టీల నాయకులు మాట్లాడే మాటలకు భయాందోళనకు గురై యూరియాను అవసరానికి మించి కొనుగోలు చేయవద్దని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

రేవంత్ అసమర్థతతో.. కంపెనీలు తరలిపోతున్నాయి

రాష్ట్రం ఆటోపైలట్ మోడ్‌లో కాదు...

ఆటో డిస్ట్రక్షన్ మోడ్‌లోకి వెళ్లింది: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చెత్త సర్కార్ నడుస్తోందని.. మున్సిపల్, ఆరోగ్యశాఖల సమన్వయ లోపం వల్ల మురుగు నీరు, చెత్తకుప్పలతో హైదరాబాద్ సహా పట్టణాలన్నీ కంపుకొడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు అవస్థలు పడుతున్నారని.. ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానాలన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయని సోమవారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ప్రజలు సమస్యలతో అలమటిస్తుంటే పాలకులు మాత్రం 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్లలో బిజీగా ఉన్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత, కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనతో తెలంగాణకు రావాల్సిన భారీ పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రానికి తెచ్చిన 'కేన్స్ టెక్నాలజీ' సెమీకండక్టర్ల పరిశ్రమ గుజరాత్‌కు తరలిపోవడం బాధాకరమని చెప్పారు. రేవంత్ సీఎం అయ్యాక తెలంగాణ ప్రగతి 'ఆటో డిస్ట్రక్షన్ (స్వయం విధ్వంసక)' మోడ్‌లోకి వెళ్లిపోయింది. పదేళ్లపాటు కష్టపడి నిర్మించిన బ్రాండ్ హైదరాబాద్, బ్రాండ్ తెలంగాణ ప్రతిష్ఠను కాంగ్రెస్ సర్వనాశనం చేసింది.." అని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణను ఢిల్లీ పెద్దలకు ఏటీఎంగా మార్చి, ఇక్కడి సంపదను వారికి దోచిపెట్టడమే కాంగ్రెస్ సర్కార్ ఎజెండాగా మారిందని ఆరోపించారు. వేల కోట్ల ముడుపులు తీసుకుని బడా కాంట్రాక్టర్లకు, క్యాబినెట్‌లోని మంత్రుల కంపెనీలకు బిల్లులు చెల్లిస్తున్నారని.. చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా తిప్పలు పెడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు.

చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలి

» బీజేపీతోనే బీసీ సాధికారత: కృష్ణయ్య

రాంనగర్/న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు తదితర డిమాండ్లతో ఢిల్లీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం భారీ ప్రదర్శన నిర్వహించింది. వందలాది మంది సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, బీసీ సంఘాల నేతలు తరలిరావడంతో జంతర్‌మంతర్ దద్దరిల్లిపోయింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీజేపీతోనే బీసీ సాధికారత సాధ్యమని చెప్పారు. బీజేపీ బీసీని ప్రధానిని, 27 మందిని మంత్రులను, నలుగురు గవర్నర్లను, ఒక గిరిజన మహిళను రాష్ట్రపతి చేసిందని గుర్తు చేశారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేశ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

యూరియా వచ్చింది సగమే!

» అరకొరగా సరఫరా చేస్తున్న కేంద్రం
» ఖరీఫ్‌కు 9.80 లక్షల టన్నులు అవసరం
» ఇప్పటికి వచ్చింది 5.32 లక్షల టన్నులే
» ఇంకా 4.5 లక్షల టన్నులు రావాలి
» సరఫరాలో కేంద్రం విఫలం: సీఎల్పీ



హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగుకు సరిపడా రాష్ట్రానికి యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా చేయకపోవడంతో కొరత ఏర్పడింది. దీంతో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలంలో 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా.. ఇప్పటివరకు కేవలం 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్రానికి వచ్చింది. అంటే నిర్ణీత కోటాలో సగం యూరియా మాత్రమే రాష్ట్రానికి చేరింది. దీంతో రైతులకు సరిపడా యూరియా అందడంలేదు. రాష్ట్ర అవసరాలు, కేటాయింపులకు అనుగుణంగా యూరియా సరఫరా చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కేంద్రానికి పలుమార్లు లేఖలు రాశారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేశారు. కానీ, కేంద్రం నుంచి ఆశించిన మేరకు యూరియా రావడంలేదు. ఈ సీజన్‌లో ఆగస్టు వరకు కేటాయింపులు 8.30 లక్షల టన్నులుగా ఉంది. కానీ, ఇపట్పివరకు జరిగిన సరఫరాతో పోలిస్తే ఇంకా 2.98 లక్షల టన్నుల యూరియా కొరత ఏర్పడింది. దీనికితోడు రాష్ట్రంలోని రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్స్ లిమిటెడ్ నుంచి ఆశించిన స్థాయిలో యూరియా ఉత్పత్తి కావడంలేదు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 145 పనిదినాలు ఉంటే.. 78 రోజులు రామగుండంలో యూరియా ఉత్పత్తి జరగలేదు. ఇటు స్థానికంగా ఉత్పత్తి సరిగా లేకపోవడం, అటు కేంద్రం నుంచి కోటా ప్రకారం రావాల్సిన యూరియా రాకపోవడంతో రాష్ట్రంలో కొరత ఏర్పడింది. ఈ వానాకాలం పంటలు గట్టెక్కాలంటే ఇంకా 4.50 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి రావాల్సి ఉంటుంది.

ఆగస్టు వరకు కేటాయింపులు.. రాష్ట్రానికి వచ్చిన వివరాలు

నెల	కేంద్రం కేటాయింపులు	రాష్ట్రానికి వచ్చింది	నెలవారీ కోత
ఏప్రిల్	1.70 లక్షల టన్నులు	1.21 లక్షల టన్నులు	49 వేల టన్నులు
మే	1.60 లక్షల టన్నులు	88 వేల టన్నులు	72 వేల టన్నులు
జూన్	1.70 లక్షల టన్నులు	98 వేల టన్నులు	72 వేల టన్నులు
జూలై	1.60 లక్షల టన్నులు	1.43 లక్షల టన్నులు	17 వేల టన్నులు
ఆగస్టు	1.70 లక్షల టన్నులు	82 వేల టన్నులు	88 వేల టన్నులు
మొత్తం	8.30 లక్షల టన్నులు	5.32 లక్షల టన్నులు	2.98 లక్షల టన్నులు

యూరియా సరఫరాలో కేంద్రం విఫలం: సీఎల్పీ

తెలంగాణకు కేటాయింపుల మేరకు యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెంకటరమణారావు, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, భూపతిరెడ్డి ఆరోపించారు. సీఎల్పీ మీడియా హాల్లో వారు సమావేశంలో మాట్లాడారు. యూరియా కోసం కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని లేఖలు రాసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుండి ఏమీ చేయలేక పోతున్నారని, రాష్ట్రంలో రైతుల కష్టాలకు బీజేపీదే బాధ్యత అని అన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు దమ్ముంటే యూరియా కోసం ప్రధాని మోదీని నిలదీయాలని, ఆ పార్టీ తెలంగాణ ఎంపీలు జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. యూరియా పేరుతో డ్రామాలు ఆడుతున్న బీఆర్ఎస్ నాయకులు.. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని, బీజేపీ నేతలను ఎందుకు నిలదీయడంలేదని ప్రశ్నించారు.

తెలంగాణకు యూరియా ఇవ్వండి

» 3లక్షల టన్నులు విడుదల చేయండి
» నడ్డాకు రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు 3లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చి రైతులను ఆదుకోవాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాను రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు కోరారు. సోమవారం ఢిల్లీలో నడ్డాను ఎంపీలు రేణుకా చౌదరి, మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, గడ్డం వంశీకృష్ణ కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే మకర్ ద్వారం వద్ద తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళన నిర్వహించారు. వాయిదా తీర్మానం, జీరో అవర్‌లో నోట్ ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించి ఆ వివరాలు వెల్లడించారు. రాష్ట్రానికి వెంటనే 3లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇవ్వాల్సిందిగా కేంద్ర మంత్రిని కోరామని, దశల వారీగానైనా అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశామని తెలిపారు. అసదుద్దీన్ ఒవైసీ సహా ఇండియా కూటమిలోని 30 మంది ఇతర రాష్ట్రాల ఎంపీలు కూడా తెలంగాణకు మద్దతుగా యూరియా ఇవ్వాలని సంతకాలు చేశారని వెల్లడించారు. ఈ వానాకాలం సీజన్‌కు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని, జూలై వరకు 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇవ్వాల్సి ఉందని, కానీ.. ఇప్పటివరకు కేంద్రం కేవలం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చిందని వివరించారు. సకాలంలో యూరియా ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు తాము కూడా కేంద్ర మంత్రి నడ్డాకు వినతిపత్రాలు ఇచ్చామని, అయినా కేంద్రం స్పందించలేదని అన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చారని, రైతుల కోసం వారు కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని, ఇద్దరు కేంద్ర మంత్రులు ఏం చేస్తున్నారని నిలదీశారు. మంగళవారం మరోసారి నడ్డా సమయం ఇచ్చారని, తెలంగాణ బీజేపీ ఎంపీలు సైతం కలిసి రావాలని కోరారు. తాను ఎరువులు, రసాయనాల స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నానని, ప్రతిసారీ తెలంగాణకు యూరియా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని ఎంపీ బలరాం నాయక్ తెలిపారు.



కేంద్ర మంత్రి నడ్డాకు వినతి పత్రం ఇస్తున్న ఎంపీలు రేణుకా చౌదరి, మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, గడ్డం వంశీకృష్ణ

చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని తొలగించాలి!

» ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు తుమ్మల లేఖ



హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హస్తకళల పరిశ్రమకు చేనేత రంగం ఊపిరిలాంటిదని, చేనేత ఉత్పత్తులపై కేంద్రం విధించిన 5 శాతం వస్తు సేవల పన్ను (జీఎస్టీ)తో ప్రస్తుతం ఈ రంగం తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోందని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే చేనేత రంగం గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులకు జీవనాధారంగా ఉందన్నారు. చేనేత కార్మికుల ప్రయోజనాలను కాపాడటానికి, వారికి నిరంతరం ఉపాధి కల్పించడానికి చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీని మినహాయించేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హస్తకళల, చేనేతశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌లకు మంత్రి తుమ్మల లేఖలు రాశారు. ముడి సరుకుల ధరలు పెరగడం, పవర్‌లూమ్, హ్యాండ్లూమ్ రంగాలు తక్కువ ఉత్పత్తి వ్యయంతో వస్త్రాలు తయారు చేయడంతో మార్కెట్లో చేనేత వస్త్రాలు తయారుచేసే నేత కార్మికులకు గిరాకీ తగ్గిపోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తుమ్మల ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి తోడు 5శాతం జీఎస్టీ విధించడంతో చేనేత ఉత్పత్తుల ధరలు పెరిగి వినియోగం తగ్గిపోతోందని, కార్మికుల జీవనాధారం సంక్షోభంలో పడుతోందన్నారు. ఖాదీ ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ మినహాయింపు ఉండగా.. చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ కొనసాగించడం అన్యాయమని మంత్రి పేర్కొన్నారు.

కోటి మందికి ఏఐ ఆధారిత పౌరసేవలు!

» 2027 నాటికి అందించాలన్నదే సర్కారు లక్ష్యం: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఏఐ ఆధారిత పౌర సేవలను 2027 నాటికి కోటి మంది ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో ఐటీ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులకు మూడు రోజుల ఏఐ శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమది సమస్య వచ్చిన తర్వాత స్పందించే ప్రభుత్వం కాదన్నారు. ప్రజలు అడగకుండానే ఏఐ సహకారంతో వారి ముంగిటకు పౌర సేవలను చేర్చి సరికొత్త తెలంగాణను నిర్మించాలన్నదే తమ సంకల్పమని చెప్పారు. ఈ కొత్త తెలంగాణ 5 బిలియన్ డాలర్ల ఏఐ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా మారుతుందని, వేలాది ఉద్యోగాలను సృష్టిస్తుందని వివరించారు. 'ఏఐ క్యాపిటల్ ఆఫ్ ది గ్లోబ్‌గా తెలంగాణ'ను తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్‌ను అందుబాటులోకి తేబోతున్నామన్నారు. దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్‌ను ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో 20 ప్రభుత్వ శాఖలకు చెందిన 300 రకాల పౌర సేవలను ఏఐ ఆధారిత ప్లాట్‌ఫాంపై అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం ఆయా శాఖల నుంచి 250 మంది అధికారులను ఎంపిక చేసి.. ఏఐ వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వీరికి 3 నెలల పాటు ఏఐ నిపుణులు మార్గదర్శనం కూడా చేస్తారని వివరించారు.

త్వరలోనే రెండో విడత 'పనుల జాతర' : సీతక్క



హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు అభివృద్ధి చర్యల్లో భాగంగా త్వరలోనే రెండో విడత 'పనుల జాతర' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది చేపట్టిన పనుల జాతరలో ఉపాధి హామీ ద్వారా కూలీలకు మొత్తం 12.23 కోట్ల పనిదినాలు కల్పించామని, అభివృద్ధి పనుల కోసం రూ.4529.07 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. అందులో కూలీల వేతనాలకు రూ.2,614.3 కోట్లు, సామగ్రికి రూ.1,685.52 కోట్లు, నిర్వహణకు రూ.229.25 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ దఫా పనుల జాతరలో ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా మహిళలకు ఉపాధి కల్పన, జలనిధి కింద నీటి సంరక్షణ పనులతో పాటు, వ్యవసాయ పొలాలకు బాటల నిర్మాణం, ఫలవనాల పెంపకం చేపడతామన్నారు.

గ్రామీణ రోడ్ల పునరుద్ధరణకు 148.85 కోట్లు

భారీ వర్షాలు, వరదల కారణంగా పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని 223 ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నట్లు ఆ శాఖకు చెందిన ఇంజనీరింగ్ విభాగం అంచనాలు రూపొందించింది. వాటి తాత్కాలిక పునరుద్ధరణకు రూ.6.14 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.142.71 కోట్లు కలిపి మొత్తం రూ.148.85 కోట్లు ఖర్చు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు.

గోదావరి బోర్డు చైర్మన్‌గా బీపీ పాండే

» కృష్ణా బోర్డు చైర్మన్‌గానూ అదనపు బాధ్యతలు

గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) చైర్మన్‌గా బన్సమణి ప్రసాద్ పాండే సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బీపీ పాండేకు కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్‌గానూ పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టారు. కృష్ణా బోర్డు చైర్మన్‌గా పనిచేస్తున్న అతుల్‌కుమార్ జైన్ కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్‌గా నియమితులైన విషయం విదితమే. కొన్ని రోజులుగా ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు బీపీ పాండేకు అప్పగించడంతో రెండు బోర్డులకు సంయుక్త చైర్మన్‌గా పాండే బాధ్యతలు చూడనున్నారు. సోమవారం బీపీ పాండేను ఈఎన్‌సీ (జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్ కలుసుకొని... శుభాకాంక్షలు తెలిపారు.

ఎక్కడైనా ఉత్పత్తి చేసుకో.. హైదరాబాద్‌లో వాడుకో

» సోలార్ రూఫ్‌టాప్‌పై ఈఆర్‌సీ నిబంధనలు

» అభ్యంతరాలకు సెప్టెంబరు 5 వరకు గడువు

రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో సొంతిళ్లపై సోలార్ రూఫ్‌టాప్ పెట్టుకుని అక్కడ ఉత్పత్తయ్యే కరెంట్‌ను హైదరాబాద్‌లో వాడుకునేలా తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి వెసులుబాటు ఇవ్వనుంది. దీనికి సంబంధించిన నిబంధనలను వెబ్‌సైట్‌లో పెట్టింది. ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించడానికి వీలుగా పబ్లిక్ డొమైన్‌లో ఉంచింది. సెప్టెంబరు 5లోగా అభ్యంతరాలు వ్యక్తం చేయాలని గడువు విధించింది. కేంద్ర ఇంధన వనరుల మంత్రిత్వశాఖ ఆదేశాలతో ఈఆర్‌సీ ఈ నిబంధనలు రూపొందించింది. నెట్ మీటరింగ్, గ్రూప్ నెట్ మీటరింగ్, గ్రాస్ మీటరింగ్, వర్చువల్ నెట్ మీటరింగ్ అనే 4 విధానాలకు సంబంధించి నిబంధనలు రూపొందించింది. నెట్‌మీటరింగ్ విధానంలో 10 కిలోవాట్ల దాకా సోలార్ రూఫ్‌టాప్‌కు మీటరింగ్ పెట్టడానికి సాధ్యాసాధ్యాల నివేదిక అక్కర్లేకుండా వినియోగదారుడికి డిస్కమ్ మీటర్ బిగించాలి. గ్రూప్ మీటరింగ్‌లో ఇతర ప్రాంతాల్లో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను హైదరాబాద్‌లో ఉపయోగించుకోవచ్చు. విద్యుత్ మిగిలితే సంబంధిత డిస్కమ్‌కు అమ్ముకునే అవకాశం ఉంటుంది. ధరలను ఈఆర్‌సీ ఖరారు చేయనుంది. వర్చువల్ మీటరింగ్‌లో గ్రామంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేసే వినియోగదారుడితో హైదరాబాద్‌లో ఉండే వినియోగదారుడు నేరుగా ఒప్పందం చేసుకోవొచ్చు. ఈ వెసులుబాటు ప్రకారం 100 కిలోవాట్ల దాకా విద్యుత్‌ను మార్పిడి చేసుకోవచ్చు.

విద్యాశాఖలో 412 పోస్టులకు అనుమతి

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డైట్ కళాశాలల్లో 412 అతిథి అధ్యాపకులు, కార్యాలయ సహాయకులు, డ్రైవర్ల పోస్టులకు ప్రభుత్వం అనుమతించింది. ఇందులో విద్యాశాఖ పరిధిలోని గ్రంథాలయాల్లో 173 పోస్టులున్నాయి. ఈ మేరకు ఆర్థికశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాదిపాటు కొనసాగనున్న ఈ పోస్టుల్లో అతిథి అధ్యాపకులకు నెలకు రూ.23,400, డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.19,500, స్వీపర్లు, అటెండర్లకు నెలసరి వేతనం రూ.15,600గా ఖరారు చేశారు.

42%కి కేసీఆర్ చట్టమే శాపం!

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు చట్టంలోనే లేవని, ఎందుకు అబద్ధాలతో బహుజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ప్రశ్నించారు. దూదేకుల, నూర్ బాషా, బార్బర్, దోబీ వృత్తి చేసే ముస్లింలకు 56 ఏళ్లుగా బీసీ రిజర్వేషన్లు అమలవుతున్నాయని గుర్తు చేశారు. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో బీసీలలో ఉన్న ముస్లింలను రిజర్వేషన్ల నుంచి తొలగించగలరా? అని నిలదీశారు. సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహరాజ్ 375వ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. టాంక్ బండ్ సమీపంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసి, రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. "గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలా శాసనమే. గతంలో తెలంగాణ ఇస్తామని చెప్పారు మాట నిలబెట్టుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్‌గాంధీ మాట ఇచ్చారు. ఆయన సూచనల మేరకే కులగణన సర్వే చేశాం. అందులో తప్పులుంటే చూపాలని సవాల్ విసిరాం. తప్పులు చూపితే క్షమాపణ చెబుతామన్నాం. రాజకీయ ప్రయోజనాల కోసం కులగణనను తప్పు పట్టవద్దు. దీన్ని తప్పుపడితే మరో వందేళ్ల వరకు బీసీలకు న్యాయం జరగదు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లులు రూపొందించి ఆమోదం కోసం గవర్నర్‌కు పంపి నెలలు గడుస్తున్నా వాటిని ఆమోదించలేదు. సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడంతో కేసీఆర్ చేసిన చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్‌ను రూపొందించి, గవర్నర్ ఆమోదం కోసం పంపగా, అది కూడా రాష్ట్రపతి వద్దే పెండింగ్‌లో ఉంది" అని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లులను ఆమోదించాలని ఢిల్లీలో ధర్నా చేశామని, 100 మందికి పైగా ఎంపీలు వచ్చి మద్దతు తెలిపారని గుర్తు చేశారు. ఈ ధర్నాకు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఈ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది కిషన్‌రెడ్డి, మోదీ కాదా? అని నిలదీశారు.

దొంగ ఓట్లతోనే మహారాష్ట్రలో అధికారం

దొంగ ఓట్లతో బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. "మహారాష్ట్రలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీ లభించగా, తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు అంత తేడా వచ్చింది? నాలుగు నెలల్లోనే ఎన్నికల కమిషన్ కోటి ఓట్లు ఎలా నమోదు చేసింది? అంబేద్కర్ పుట్టిన గడ్డ మీదనే రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు. దొంగ ఓట్లతోనే మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. దేశం నలుమూలలా ఓట్ల చోరీ జరుగుతోంది. బతికున్న వారిని చనిపోయినట్లుగా చూపి, బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారు. ఈ కుట్రను రాహుల్ గాంధీ బయటపెట్టారు. తప్పు చేసిన వారిని వదిలేసి తప్పును ప్రశ్నించిన రాహుల్ గాంధీని ఎన్నికల కమిషన్ అఫిడవిట్ అడుగుతోంది. ఇది ఎంతవరకు న్యాయం? ఓటు హక్కును దొంగిలించిన వారిని శిక్షించాలని రాహుల్‌గాంధీ పాదయాత్ర చేస్తున్నారు. త్వరలో నేను, భట్టి ఆ పాదయాత్రలో పాల్గొంటాం. అందరం కలిసి ఓట్ల చోరీకి పాల్పడే వారి భరతం పడదాం. సమస్య వచ్చినపుడు పోరాడేందుకు మీ నైతిక మద్దతు ఉండాలి" అని కోరారు. విగ్రహాల ఏర్పాటు వర్ధంతులు, జయంతుల కోసమే కాదు, యువతలో స్ఫూర్తిని రగిలించేందుకని ముఖ్యమంత్రి చెప్పారు. మొగలుల పాలన కాలంలోనే బహుజనుల సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. అందుకే సచివాలయం సమీపంలో పాపన్న విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ఖిలా షాపూర్ కోటను మైనింగ్ పేరుతో కాలగర్భంలో కలిపే కుట్ర చేసిందని ఆరోపించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ చారిత్రక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.



ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్, పక్కన మంత్రులు పొన్నం, తుమ్మల, శ్రీహరి, లక్ష్మణ్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మేయర్ విజయలక్ష్మి తదితరులు

పాపన్న తరహాలో రాహుల్ గాంధీ పోరాటం

సామాజిక న్యాయం కోసం ఆనాడు సర్వాయి పాపన్న ఉద్యమించినట్లు ఈనాడు బీసీలందరినీ కలుపుకుని రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాజ్యాంగానికి లోబడి రిజర్వేషన్లు సాధించుకోవడానికి కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రవీంద్ర భారతిలో సోమవారం జరిగిన సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్యను అందిస్తే భవిష్యత్తు తరాలను నిర్మించినట్లేనని అన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, పీసీసీ చీఫ్ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషాన్నిచ్చిందని తెలిపారు. నిత్యం బహుజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటు పడుతున్న సీఎం రేవంత్.. రెడ్డి మాత్రమే కాదని, గౌడ్ కూడా అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. సాహసం, ధైర్యానికి ప్రతీక సర్వాయి పాపన్న అని కొనియాడారు.

పాపన్న విగ్రహానికి శంకుస్థాపన

ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఇతర నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయం ఎదురుగా ఉన్న అమర వీరుల స్థూపం వెనుక భాగంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

పోరాటయోధుడు సర్వాయి పాపన్నగౌడ్

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

» భవిష్యత్ తరాలకు స్ఫూర్తి పాపన్న: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం పోరాడి అమరుడైన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. పెత్తందారీ వ్యవస్థను ధైర్యంగా ఎదిరించి నిలబడ్డారని కొనియాడారు. సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని తాము డిమాండ్ చేశామని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించిందని వ్యాఖ్యానించారు. సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీడిత జనం, బహుజనుల ఆత్మగౌరవం కోసం సర్వస్వాన్ని ధారబోసిన మహాయోధుడు సర్వాయి పాపన్న అని మాజీ మంత్రి కేటీఆర్ కొనియాడారు. పాపన్న పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలని ఎక్స్‌లో పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్, దాసోజు శ్రవణ్ మాట్లాడారు. సర్వాయి పాపన్న ఆశయాలను నిలబెట్టుకోవాలంటే బహుజన వర్గాలకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా సమన్వయంతో పోరాడాలన్నారు.

టి-ఫైబర్ పై సమగ్ర నివేదిక సమర్పించండి

» ప్రజలకు మెరుగైన సేవలందేలా చూడాలి: సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు అందించే లక్ష్యంతో ప్రారంభించిన టి-ఫైబర్ పనులు జరిగిన తీరు.. దాని ప్రస్తుత పరిస్థితి.. భవిష్యత్‌లో చేపట్టనున్న పనులపై సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంపై ఇప్పటి వరకూ చేసిన ఖర్చు, పూర్తి చేయడానికి కావాల్సిన నిధులు, ఆ నిధుల సేకరణ, కార్యక్రమం విజయవంతం కావడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి నివేదికలో పొందుపర్చాలని సూచించారు. సోమవారం రాత్రి ఆయన తన నివాసంలో ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. టి-ఫైబర్ పనులు చేసిన కాంట్రాక్ట్ సంస్థలకు నోటీసులు ఇచ్చి.. పనులు చేసిన తీరుపై నివేదిక కోరాలని సీఎం ఆదేశించారు. సంస్థలో ఉద్యోగుల సంఖ్య, వారి పని తీరును సమీక్షించాలన్నారు. టి-ఫైబర్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. కాగా.. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణారావు, టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

ఇక సర్కారీ బడుల్లోనూ పూర్వ ప్రాథమిక విద్య

» జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలను వినియోగించుకోవాలని ప్రభుత్వ ఆదేశం

» అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త రూపం

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల సంక్షేమంపై దృష్టి సారించింది. రెండున్నరేళ్లు దాటిన చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లో శిశు విద్య(ప్రీప్రైమరీ)ను ప్రారంభించడానికి కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ క్రమంలోనే అంగన్‌వాడీ కేంద్రాలను ఎంచుకున్న పాఠశాలల్లోకి మార్చనున్నారు. పిల్లలు రెగ్యులర్ పాఠశాలల్లో చేరేనాటికి వారిని సంసిద్ధులను చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందుకోసం విద్యార్థులు లేని (జీరో ఎన్‌రోల్‌మెంట్) ప్రభుత్వ పాఠశాలల భవనాలను వినియోగించుకోవాలని నిర్ణయించింది. ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించడానికి రాష్ట్రంలో 21 జిల్లాల్లో 62 జీరో ఎన్‌రోల్‌మెంట్ ప్రభుత్వ పాఠశాలలను మహిళా శిశు సంక్షేమ శాఖ పరిశీలించింది. వాటిలో 17 జిల్లాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలో ఉన్న 34 పాఠశాలలను గుర్తించింది. ఈ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను తక్షణమే పరిశీలించాలని సంబంధిత అధికారులకు మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సృజన మార్గదర్శకాలు జారీ చేశారు. అన్నీ అనువుగా ఉంటే సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి పూర్వ ప్రాథమిక విద్యాబోధనను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మార్పులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలను ఇకపై అంగన్‌వాడీ ఉపాధ్యాయులుగా పిలుస్తారు.

ఎల్లుండి ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం

» భద్రాద్రి జిల్లా బెండాలపాడులో సీఎం చేతులమీదుగా కార్యక్రమం

» అనంతరం లక్ష మందితో బహిరంగ సభ

» రేపు గచ్చిబౌలిలో సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనానికి సీఎం భూమి పూజ

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



బెండాలపాడులో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

చండ్రుగొండ/హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతాయని వెల్లడించారు. అనంతరం లక్షమందితో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో బెండాలపాడులో మంత్రి పొంగులేటి పర్యటించారు. పలువురు ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, పలు శాఖల అధికారులతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం పొంగులేటి విలేకరులతో మాట్లాడారు. ఇళ్ల కోసం పేదలు పదేళ్లుగా ఎదురు చూశారని, వారి ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రకటనను సీఎం రేవంత్ భద్రాద్రి రాముని సన్నిధిలో ప్రకటించారని.. ఇప్పుడు అదే జిల్లాలో ఇళ్లను ప్రారంభించడం చరిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. తొలి దశలో రూ.22,500 కోట్లతో మంజూరు చేసిన 4.5 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు.

రిజిస్ట్రేషన్‌శాఖను ఆదాయ వనరుగా చూడటం లేదు

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను తమ ప్రభుత్వం ఆదాయ వనరుగా చూడటం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ నెల 20న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరగనున్న సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భూమి పూజ కార్యక్రమంపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సచివాలయంలో సోమవారం మంత్రి సమీక్ష చేశారు. బుధవారం సీఎం గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్(తాలిమ్) సంస్థ ఆవరణలో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్నారని వెల్లడించారు. ఈ భవనంలో రంగారెడ్డి, గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్ర నగర్ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల సముదాయాల నిర్మాణానికి సంబంధించి తొలి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 సమీకృత భవనాల పరిధిలోకి తీసుకురాబోతున్నామని వివరించారు. అబ్దుల్లాపూర్‌మెట్, పెద్ద అంబర్‌పేట్, హయత్‌నగర్, వనస్థలిపురం కార్యాలయాలను కోహెడ్‌లో.. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, శంషాబాద్ కార్యాలయాలను మహేశ్వరం మండలం మంకాల్‌లో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. మేడ్చల్, కుత్బుల్లాపూర్, కీసర, శామీర్‌పేట్ కార్యాలయాల సముదాయాన్ని కండ్లకోయలో.. ఉప్పల్, నారపల్లి, కాప్రా, ఘట్‌కేసర్, మల్కాజ్‌గిరి కార్యాలయాలను బోడుప్పల్‌లో.. బంజారాహిల్స్, ఆజంపురా, చార్మినార్, దూద్‌బౌలి కార్యాలయాలను మలక్‌పేటలో నిర్మించనున్నట్లు స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు త్వరలోనే ఈ-ఆధార్ విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నామని పొంగులేటి తెలిపారు. ఇప్పటికే ఈ విధానాన్ని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని చెప్పారు.

ఓపిక నశించింది.. ఇక పోరుబాటే

» 20 నెలల్లో ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు

» ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ

» ఈనెల 23న హైదరాబాద్‌లో మహాధర్నా

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినప్పటికీ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న 31 సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రంలోని 18 ఉపాధ్యాయ సంఘాలు కలిసి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ)గా ఏర్పడ్డాయి. సోమవారం నగరంలోని యూటీఎఫ్ ప్రధాన కార్యాలయంలో కమిటీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 23న నగరంలోని ధర్నాచౌక్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ఉపాధ్యాయులంతా ఉద్యమబాట పడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో, మేనిఫెస్టోలో పొందుపరచిన హామీలను అమలు పరచడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. నూతన జిల్లాలకు డీఈవో, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈవో, నూతన మండలాలకు ఎంఈవో పోస్టులను మంజూరు చేయడంతో పాటు, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలు రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల, పెన్షనర్ల, వివిధ రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సోమయ్య, లింగారెడ్డి కోరారు. సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేశామని, మంత్రులు, ఆఫీసర్ల కమిటీలు వేసినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో దశలవారీ ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని యూఎస్‌పీసీ నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో పోరుబాటకు ఉపాధ్యాయులంతా సిద్ధంగా ఉన్నారని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

సచివాలయంలో కాంట్రాక్టర్ల ధర్నా

» పెండింగ్ బిల్లుల కోసం ఆర్థికశాఖ అధికారుల చాంబర్ ఎదుట బైఠాయింపు..

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల కోసం రాష్ట్ర సచివాలయంలో కాంట్రాక్టర్లు సోమవారం ఆందోళనకు దిగారు. ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా చాంబర్ ఉన్న రెండో అంతస్తుకు భారీగా చేరుకొని బైఠాయించారు. తమ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ సహా ఇతర శాఖలకు వెళ్లాలంటూ ముందుగా విజిటర్స్ పాసులు తీసుకుని దాదాపు వంద మందికిపైగా కాంట్రాక్టర్లు సచివాలయంలోకి వెళ్లారు. 'మన ఊరు-మన బడి'లో భాగంగా చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని ఆరోపిస్తూ ఆర్థిక శాఖ అధికారుల చాంబర్ ముందు బైఠాయించారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పనులు పూర్తి చేసినా నిధులు విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆందోళనను గమనించిన పోలీసులు వారిని బలవంతంగా బయటకు పంపేందుకు ప్రయత్నించగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలోనే సందీప్‌కుమార్ సుల్తానియాను కలిసి బిల్లులు చెల్లించాలంటూ వారు వినతి పత్రం అందజేశారు. పెండింగ్ బిల్లులను త్వరలో క్లియర్ చేస్తామని ఆయన హామీనివ్వడంతో వెనుదిరిగినట్లు సమాచారం. కాగా, గతంలోనూ కాంట్రాక్టర్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాంబర్ ఎదుట ధర్నా చేసిన విషయం తెలిసిందే.

సచివాలయంలో ధర్నా దేశంలో తొలిసారి: హరీశ్‌రావు

కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో పెండింగ్ బిల్లుల కోసం కాంట్రాక్టర్లు సచివాలయంలో రెండు సార్లు ధర్నా చేయడం దేశంలో ఇక్కడే మొదటిసారి జరిగి ఉంటుందని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. 'ప్రభుత్వ తీరు ఇలాగే కొనసాగితే ప్రజలంతా ఏకమై ఎక్కడికక్కడ నిలదీస్తారు. తస్మాత్ జాగ్రత్త' అంటూ 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు.

సెప్టెంబరు 9 నుంచి ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్

» లోగో, వెబ్‌సైట్ ఆవిష్కరించిన డీజీ సౌమ్య మిశ్రా



హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జైళ్ల శాఖ జాతీయ స్థాయి డ్యూటీ మీట్‌కు తెలంగాణ వేదిక కానుంది. సెప్టెంబరు 9 నుంచి 11 వరకు హైదరాబాద్ వేదికగా ఏడవ అఖిల భారత 'ప్రిజన్ డ్యూటీ మీట్-2025' జరగనుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల జైళ్ల శాఖ అధికారులు ఇందులో పాల్గొంటారు. ఈ డ్యూటీ మీట్‌కు సంబంధించిన లోగో, ఈవెంట్ వెబ్‌సైట్‌ను తెలంగాణ జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్యామిశ్రా చంచల్‌గూడలోని 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్'(సికా)లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అఖిల భారత ప్రిజన్ డ్యూటీ మీట్‌కు తెలంగాణ వేదిక కావడం గొప్ప విషయమన్నారు. ఈ జాతీయ స్థాయి కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించడంలో లోగో, వెబ్‌సైట్ ప్రారంభించడం ఒక ముఖ్యమైన అడుగు అన్నారు. ఇందులో పాల్గొంటున్నట్లు ఇప్పటి వరకు 22 రాష్ట్రాల నుంచి ధ్రువీకరణ అందిందన్నారు. వీటిలో 13 రాష్ట్రాలు ఇప్పటికే పాల్గొనే వారి పేర్ల జాబితాను అందజేశాయన్నారు.

అడవుల్లో పేలిన ఐఈడీ.. జవాన్ మృతి

చర్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కూంబింగ్ చేస్తున్న బలగాలను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి డీఆర్‌జీ జవాన్ మృతి చెందగా.. మరో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్కు అడవుల్లో సోమవారం ఉదయం జరిగింది. అక్కడి అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు బలగాలకు సమాచారం అందడంతో బీజాపూర్‌కు చెందిన డీఆర్‌జీ బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. కూంబింగ్ అనంతరం డీఆర్‌జీ బలగాలు తిరుగుపయనమవగా.. మావోయిస్టులు అమర్చిన ఐఈడీపై జవాన్లు కాలు వేయడంతో అది పేలింది. జవాన్ దినేష్ నాగ్ (43) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, భరత్, హేమ్లు, మండ్రు అనే ముగ్గురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని బీజాపూర్ వైద్యశాలకు తరలించారు. మృతి చెందిన జవాన్‌కు నివాళులర్పించి భౌతికకాయాన్ని అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోక్సో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

దుబ్బాక, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం, పోక్సో కేసులో నిందితుడికి సిద్దిపేట జిల్లా ఫస్టుక్లాస్ అదనపు సెషన్సు కోర్టు 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధించింది. అక్బర్‌పేట- భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామానికి చెందిన పర్స శ్రీనివాస్ (48) 2022 ఏప్రిల్ 16న రాత్రి బహిర్భూమికి వెళ్లిన ఓ 14 ఏళ్ల బాలికను నిర్బంధించాడు. అంతేగాక అరవకుండా చున్నీని నోట్లో కుక్కి, అత్యాచారానికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని బాలిక తన తల్లికి తెలియజేయగా ఆమె అదే నెల 18న భూంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. సోమవారం కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి జయప్రసాద్ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా చర్యలు తీసుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై హరికృష్ణను సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు.

విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకుల మృతి

చిన్నకోడూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు రక్షణగా విద్యుత్తు తీగ ఏర్పాటు చేస్తుండగా.. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆ తీగ తగలడంతో విద్యుదాఘాతంతో తండ్రి, కొడుకు అక్కడికక్కడే మృతిచెందారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్ శివారులో సోమవారం ఈ ఘటన జరిగింది. చంద్లాపూర్‌కు చెందిన ముర్తి గజేందర్ రెడ్డి (52) రైతు. అతడికి భార్య పద్మ, కుమారుడు రాజిరెడ్డి (25) కూతురు సంతోషి ఉన్నారు. రాజిరెడ్డి సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి శివారులోని ఓ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ తండ్రికి వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. గజేందర్‌రెడ్డి అతడి కుమారుడు రాజిరెడ్డి సోమవారం గంగాపూర్ శివారులోని చేను వద్దకు వెళ్లారు. అక్కడ మొక్కజొన్న పంటకు అడవి పందుల నుంచి రక్షణ కోసం వైర్‌ను ఏర్పాటు చేసే పనిలో మునిగారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఆ తీగ పక్కనే ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్ కొట్టడంతో గజేందర్, రాజిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. ఈనెల 14న సంతోషి వివాహం జరిగింది. పెళ్లి జరిగిన ఇంట్లో ఇంతలోనే ఈ విషాదం చోటు చేసుకోవడంతో బంధువులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

పెరుగుతున్న కల్తీ సారా మృతులు

» ఇప్పటివరకు 30 మంది కన్నుమూత

» వీరిలో ఏడుగురు ప్రవాసాంధ్రులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కువైత్‌లో కల్తీ సారా తాగి మరణిస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఇప్పటి వరకు దాదాపు 30 మంది మరణించారు. వీరిలో ఏడుగురు ఏపీకి చెందిన వారని అధికారులు తెలిపారు. నలుగురు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు కాగా, మిగిలిన ముగ్గురు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన వారు ఉన్నారని సమాచారం. మరో వైపు కల్తీ సారా ఘటనలో 40 మంది భారతీయులతో పాటు 160 మంది బాధితులు వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరికి కంటి చూపు శాశ్వతంగా పోయిందని, మరికొందరికి కిడ్నీలు దెబ్బతిన్నాయని వైద్యులు తెలిపారు. మరోవైపు, ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం కల్తీ సారా కారకులపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలో బంగ్లాదేశ్‌కు చెందిన దెలోరా ప్రకాశ్ అనే ప్రవాసీయుడు సారా విక్రయిస్తున్నాడని గుర్తించిన పోలీసులు అతనితో పాటు, ఆయన నేతృత్వంలో పనిచేసే భారత్, నేపాల్ దేశాలకు చెందిన 67 మందిని అరెస్టు చేశారు. కల్తీ సారా ఉత్పత్తి చేస్తున్న 10 కేంద్రాలను మూసివేశారు. దేశవ్యాప్తంగా తనఖీలను ముమ్మరం చేశారు. వీసా, ఉపాధి నిబంధనలను ఉల్లంఘించి ఉంటున్న భారతీయులు సహా విదేశీయులను అరెస్ట్ చేస్తున్నారు. తాజాగా 258 మంది విదేశీయులను అరెస్ట్ చేసినట్లు ప్రభుత్వం సోమవారం వెల్లడించింది.


రథయాత్రలో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

భక్తులు ఉత్సాహంగా రథయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర ఆర్టీసీ కాలనీ, పాత రామాంతపూర్, ఎండోమెంట్ కాలనీల మీదుగా సాగుతూ అర్ధరాత్రి 12:30 గంటలకు తిరిగి గోకుల్‌నగర్‌లోని యాదవసంఘం భవన సమీపంలోకి చేరుకుంది. మరో 100 మీటర్ల దూరం వెళితే యాత్ర ముగిసేదే! అయితే ఆ రథాన్ని లాగుతున్న వాహనం మొరాయించింది. ఫలితంగా రథం ముందుకు కదలకపోవడంతో కొందరు యువకులు ఆ వాహనాన్ని పక్కకు తీసి.. చేతులతోనే రథాన్ని లాగేందుకు సిద్ధమయ్యారు. నిర్వాహకుడు రవీందర్ యాదవ్, సంఘం చైర్మన్ కుమారుడు కృష్ణ యాదవ్‌తో పాటు సురేశ్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, రుద్ర వికాస్, రాజేంద్ర రెడ్డి, ఎంపీ కిషన్ రెడ్డి గన్‌మన్ శ్రీనివాస్, వాహనంతో వచ్చిన గణేశ్, డెకరేషన్ బాయ్ మహేశ్ రథాన్ని లాగారు.

ఆ కేబుల్ వైర్ తునక లేకపోయివుంటే..

రథాన్ని లాగుతుండగా పైన విద్యుత్తు తీగలు రథానికి అడ్డుగా ఉన్నాయని గుర్తించారు. ఆ వైర్లను కర్రతో పైకి లేపడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో విద్యుత్తు తీగ నుంచి కిందకు వేలాడుతున్న ఒక కేబుల్ వైరు ముక్క ఇనుప రథానికి తగిలింది. ఆ ముక్కలోని కాపర్ వైరు.. అటు 11కేవీ హైటెన్షన్ వైరుకు, ఇటు రథానికి తగలడంతో విద్యుదాఘాతం సంభవించింది. రథాన్ని లాగుతున్న తొమ్మిది మంది దూరంగా ఎగిరిపడ్డారు. వారిలో కృష్ణ యాదవ్ (21), సురేశ్ యాదవ్ (34), శ్రీకాంత్ రెడ్డి (35), రుద్ర వికాస్ (39), రాజేంద్ర రెడ్డి (45) విద్యుదాఘాతంతో మృతిచెందారు. మహేశ్, రవీందర్ యాదవ్, గణేశ్, శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు. వీరిలో మహేశ్‌కు చికిత్స చేసి ఇంటికి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



హైటెన్షన్ విద్యుత్తు వైరు నుంచి వేలాడుతూ రథానికి తగిలిన కేబుల్ వైరు

మృతుల్లో కృష్ణ అవివాహితుడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గాంధీకి చేరుకొని మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.5లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. గాయపడ్డవారికి చికిత్స ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. కేబుల్ వైర్ ద్వారా కరెంట్ సరఫరా జరగడంతోనే ప్రమాదం జరిగినట్లు అధికారులు చెబుతున్నారని, కలెక్టర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రేటర్ పరిధిలో విద్యుత్తు తీగలపై



సురేశ్ యాదవ్



రుద్ర వికాస్

కేబుల్ వైర్లు లేకండా చూసేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని ప్రకటించారు. ఘటన జరిగిన కొద్దిసేపటికే సౌత్ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖ్ అలీ ప్రమాద స్థలికి రాగా ఆయన్ను మృతుల కుటుంబసభ్యులు, స్థానికులు చుట్టుముట్టారు. విద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఫలితంగా రామాంతపూర్, ఉప్పల్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారంతో పాటు.. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సీఎండీ హామీ ఇచ్చారు. వినాయక చవితి, దసరా ఉత్సవాల వరకు వైర్లపై వేలాడుతున్న ఇంటర్నెట్, కేబుల్ తీగలను సరిచేస్తామని చెప్పారు. ప్రమాద ఘటనపై నివేదిక ఇవ్వాలని హబ్సిగూడ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ ప్రతిమ షోమ్‌ను ఆదేశించారు. గోకుల్‌నగర్ ఘటనలో ఐదుగురి మృతిపట్ల టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా, శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా చేపట్టిన ఊరేగింపులో విద్యుత్తు షాక్‌తో ఐదుగురు ప్రాణాలుకోల్పోవడం బాధాకరమని, మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్‌చేశారు. ఈ ఘటనంలో మృతిచెందిన వారి కుటుంబాలకు కేటీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడి ఆస్పత్రుల్లో చేరినవారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాక్షించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

ఆహ్వానిస్తే సరదాగా వెళ్లి.. మృతుల్లో ముగ్గురు స్నేహితులు

» ఒకరికి ఆరు నెలల పాప

» మరొకరు తల్లిదండ్రులకు ఏకైక సంతానం

రామంతాపూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భక్తిశ్రద్ధలతో రథయాత్రలో పాల్గొనేందుకు వెళ్లిన తమవారు విగతజీవులుగా వాకిళ్లలోకి చేరడాన్ని ఆ కుటుంబీకులు జీర్ణించుకోలేకపోతున్నారు. మృతుల కుటుంబీకుల్లో ఎవ్వరిని కదిలించినా కన్నీళ్లే తప్ప మాటలు రావడం లేదు. మృతుల్లో శ్రీకాంత్ రెడ్డి, రాజేంద్రరెడ్డి, రుద్ర వికాస్ మంచి స్నేహితులు. రథయాత్ర నిర్వాహకుడు రవీందర్ యాదవ్‌తో శ్రీకాంత్ రెడ్డికి స్నేహం ఉంది. రవీందర్ ఆహ్వానించడంతో రథయాత్రకు శ్రీకాంత్ రెడ్డి.. తాను నిర్వహిస్తున్న హోటల్‌లో భాగస్వామి అయిన రాజేంద్రరెడ్డిని, మరో స్నేహితుడైన రుద్ర వికాస్‌ను వెంటబెట్టుకొని వెళ్లాడు. శోభాయత్రకు వెళ్లిన ఈ ముగ్గురు స్నేహితులూ మృత్యువాత పడ్డారు. రాజేంద్రరెడ్డికి భార్య, బీటెక్ పూర్తిచేసిన కుమార్తె ఉంది. బిడ్డను మంచి ఉద్యోగంలో చేర్పించి, పెళ్లి చేసి అత్తారింటికి పంపాల్సిన తండ్రి అకాలమరణం చెందాడంటూ ఆప్తులు కంటికీమంటికి ధారగా రోదిస్తున్నారు. రుద్ర వికాస్ హబ్సిగూడ వీధి నంబర్-8లో స్టీల్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య, ఎనిమిది, ఐదేళ్ల వయసున్న ఇద్దరు కుమారులున్నారు. గణేశ్ ఉత్సవాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొనే రుద్రవికాస్.. వినాయక లడ్డూను ప్రతియేటా వేలంపాటలో తానే దక్కించుకునేవాడు. రథోత్సవం నిర్వాహకుడు రవీందర్ గాయాలపాలై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రెండేళ్ల క్రితమే పెళ్లి..

మృతుడు సురేశ్ యాదవ్ స్థానికంగా పాల వ్యాపారం చేస్తున్నాడు. అతడికి రెండేళ్ల క్రితం పెళ్లయింది. సురేశ్ దంపతులకు ఆరు నెలల క్రితం పాప పుట్టింది. ఇక విద్యాదాఘాతంలో ఒక్కగానొక్క కొడుకు కృష్ణయాదవ్ మృత్యువాత పడటంతో గోకుల్ నగర్ యాదవ సంఘం అధ్యక్షుడు పింజర్ల రఘు యాదవ్ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రితో కలిసి పాలవ్యాపారం చేస్తున్న కృష్ణ. తండ్రికి తగ్గ తనయుడు అన్నట్లుగా యాదవ సంఘంలో చురుగ్గా పాల్గొనేవాడు. స్థానికంగా జరిగే అన్ని కార్యక్రమాల్లో ముందుండేవాడని స్థానికులు చెప్పారు. పెళ్లి ప్రయత్నాలు చేస్తున్న క్రమంలోనే చెట్టంత కొడుకు మరలిరాని లోకాలకు వెళ్లాడంతో కన్నవారు షాక్‌కు గురయ్యారు. కిరాయి రథం వెంబడి పని చేసేందుకొచ్చిన గోల్నాక నివాసి గణేశ్.. విద్యుదాఘాతానికి గురై గాయాలపాలయ్యాడు. అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

12 ఏళ్ల బాలిక దారుణ హత్య

» తల్లిదండ్రులు పనికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా బాలిక

» మధ్యాహ్నం తండ్రి వచ్చేసరికి రక్తపు మడుగులో మృతదేహం

» కూకట్‌పల్లిలో ఘటన



సహస్ర (ఫైల్)

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో 12 ఏళ్ల బాలిక దారుణ హత్యకు గురైంది. తల్లిదండ్రులు పనులకు వెళ్లడంతో ఇంట్లో చిన్నారి ఒక్కత్తే ఉండటం, మధ్యాహ్నం తండ్రి వచ్చి చూసేసరికే బాలిక రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండటంతో ఘటనపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూకట్‌పల్లిలోని దయార్‌గూడలో జరిగిన ఈ ఘటన స్థానికులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసింది. గుర్తు తెలియని దుండగుడు ఇంట్లోకి చొరబడి బాలికను కత్తితో పొడిచి చంపాడని భావిస్తున్నారు. హతురాలు.. కృష్ణ, రేణుక దంపతుల కుమార్తె సహస్ర (12). ఈ దంపతులకు సహస్రతో పాటు ఓ బాబు ఉన్నాడు. ఐదేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మక్తక్యాసారం నుంచి బతుకుదెరువు కోసం కూకట్‌పల్లికి వచ్చి ఉంటున్నారు. కృష్ణ బల్కంపేటలో ఓ బైక్ రిపేర్ షాపు నిర్వహిస్తున్నాడు. రేణుక కూకట్‌పల్లిలో ఓ ప్రైవేట్ హాస్పిటల్ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా ఉద్యోగం చేస్తోంది. కూతురు సహస్ర కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతుంటే.. కుమారుడు ఇంటికి సమీపంలోనే ఓ ప్రైవేటు స్కూల్లో చదువుతున్నాడు. సోమవారం ఉదయం 9 గంటలకు కృష్ణ, రేణుక పనులకు, బాబు స్కూల్‌కు వెళ్లారు. ఇంట్లో సహస్ర ఒక్కత్తే ఉంది. మధ్యాహ్నం 12:30కు కుమారుడికి లంచ్ బాక్స్ తీసుకెళ్లేందుకు కృష్ణ ఇంటికి వెళ్లాడు. ఒంటికి తీవ్రగాయాలైన స్థితిలో కూతురు మృతదేహాన్ని చూసి షాక్‌తో బిగ్గరగా రోదించాడు. ఫోన్ చేసి భార్యకు ఘోరం గురించి చెబుతుంటే.. ఆమెకు భర్త మాట్లాడుతోంది గానీ, ఎందుకు రోదిస్తున్నాడని గానీ అర్థం కాకపోవడంతో పక్కవాళ్లకు ఫోన్ చేస్తే జరిగిన ఘోరం గురించి తెలిసింది. డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో కేవీ సుబ్బారావు ఘటనాస్థలికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం రంగంలోకి దిగి వివరాలు సేకరించారు. తమకు ఎవ్వరిపైనా అనుమానాలు లేవని పోలీసులకు బాధిత తల్లిదండ్రులు చెప్పారు. మృతదేహాన్ని గాంధీ మార్చురికీ తరలించారు. చుట్టు పక్కల ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. బాలికతో సన్నిహితంగా ఉండే స్నేహితుల గురించి ఆరా తీస్తున్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలిక కుటుంబసభ్యులను పరామర్శించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'శంషాబాద్'లో స్మార్ట్ కియోస్కులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల కోసం సరికొత్త సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఎయిర్‌పోర్ట్‌లో స్మార్ట్ కియోస్కులు, డిజిటల్ మ్యాప్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. సోమవారం స్మార్ట్ కియోస్క్, డిజిటల్ మ్యాప్స్ ప్రారంభం సందర్భంగా జీహెచ్ఐఏఎల్ సీఈవో ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ ప్రధాన చెక్-ఇన్‌హాల్స్, బోర్డింగ్ గేట్‌లు, అరైవల్స్, బ్యాగేజ్ క్లెయిమ్ ప్రాంతాల్లో మొత్తం 10 కియోస్కులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా ప్రయాణికులు రియల్ టైమ్ ఫ్లైట్ అప్‌డేట్స్, 3డీ నావిగేషన్, ఎమర్జెన్సీ సహాయ సమాచారం పొందవచ్చన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.